అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

గురువారం 22-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 52 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

న్యాయకోవిదుడు ఫాలి నారిమన్ కన్నుమూత

- ప్రముఖుల సంతాపం



న్యూఢిల్లీ : ప్రముఖ న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి శామ్ నారిమన్ బుధవారం న్యూఢిల్లీలో కన్నుమూశారు. ఆయన వయస్సు 95 సంవత్సరాలు. 1991లో పద్మభూషణ్, 2007లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్న నారిమన్ 70 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 1950లో బాంబే ...13లో



ఉద్వేగభరితం.. మేడారం..

వనమంతా జనమయం

- లక్షలాది జనాల నడుమ గద్దెపై సారలమ్మ
- నేడు సమ్మక్క రాక

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ములుగు/తాడ్వాయి

వనమంతా జనమయంతో మేడారం మహా జాతర ఉద్వేగభరితంగా ప్రారంభమైంది. ఆదివాసీల సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించే డప్పు డోలు వాయిద్యాలతో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన జాతర.. జనసంద్రంగా మారింది. లక్షలాది మంది ఎదురుచూస్తుండగా వనదేవత సారలమ్మను వడ్డె కాక సారయ్య, ఇతర వడ్డెలు బుధవారం రాత్రి గద్దెలపై ప్రతిష్ఠించారు. ముందుగా మేడారం గ్రామానికి 3 కి.మీ దూరంలోని కన్నెపల్లిలో మధ్యాహ్నం నుండే సారలమ్మ దేవాలయం వద్ద మహిళలు ముగ్గులు వేసి అలంకరించారు. పూజారి కాక సారయ్య.. ఆదివాసీ ఆచార, వ్యవహారాలతో పూజలు చేయగా.. మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు గుడి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వడ్డెలు డోలు వాయిద్యాలు వాయిస్తూ, కొమ్ములూదుతూ ముందుకు కదలగా మహిళలు దండాలు పెడుతూ స్వాగతం పలికారు. ఏటూర్‌నాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు జిల్లా అడిషనల్ ఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్ నేతృత్వంలోని భారీ బందోబస్తు, రోప్ పార్టీ నడుమ వడ్డేలు సారలమ్మలను తోడ్కొని బయలుదేరారు. జంపన్నవాగు మీదుగా లక్షలాది మంది ప్రజల నడుమ సారలమ్మ గద్దెలపై కొలువుతీరింది. దారి పొడవునా వడ్డెలను తాకడానికి మహిళలు తీవ్రంగా ప్రయత్నించారు. వడ్డెలు సజావుగా సారలమ్మను తీసుకురావడానికి ఆదివాసీ సంఘం, తుడుందెబ్బ యువకులు వారికి రక్షణగా నిలిచారు. సారలమ్మను వడ్డె కాక సారయ్య గద్దెలపై ప్రతిష్ఠించాక, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ తదితరులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో సారలమ్మను దర్శించుకున్నారు.

గద్దెలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు

సారలమ్మను కన్నెపల్లి నుంచి తీసుకొస్తున్న క్రమంలోనే మేడారానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి మంగళవారం ఉదయం పెనక వంశీయులైన వడ్డెలు పగిడె రూపంలో ఉన్న సమ్మక్క భర్త పగిడిద్దరాజును తోడ్కొని గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో రాత్రి బస చేశారు. అనంతరం బుధవారం ఉదయం తిరిగి కాలినడకన బయలుదేరి సాయంత్రం జంపన్నవాగు పరిసర ప్రాంతం ...3లో

ఉచిత కరెంట్ , రూ.500కే గ్యాస్ సిలిండర్

వారంలో అమలు

త్వరలోనే రూ. 2 లక్షల రైతు రుణమాఫీ

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పి కొట్టాలి

- మోడీ హామీ ఇచ్చిన పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఏమైంది..?
- 14 పార్లమెంట్ సీట్లను గెలిపించి తీరాలి : కోస్గి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- కొడంగల్‌లో రూ.4369 కోట్లతో 20 అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరు ప్రకటన





నవ తెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ఢిల్లీలో మోడీ.. గల్లీలో కేడీ కేసీఆర్ తెలంగాణకు తీరని ద్రోహం చేశారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని కేంద్రం మాట తప్పింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి తీరాలి. తెలంగాణలో ...3లో

గత ముఖ్యమంత్రుల బాటలోనే నేనూ!

- రూ.2 వేల కోట్లతో 64 ఐటీఐల అభివృద్ధి
- ఓఆర్ఆర్ హైదరాబాద్‌కు లైఫ్‌లైన్ : సీఐఐ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి 3లో..

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితకు

సీబీఐ మరోసారి నోటీసులు

- ఈనెల 26న హాజరుకావాలని సమన్లు





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు దర్యాప్తు సంస్థ మరోసారి నోటీసులు జారీచేసింది. ఈ నెల 26 (సోమవారం) తమ ముందు హాజరుకావాలని ...6లో

నోటిఫికేషన్లు సిద్ధం చేయండి

- సింగరేణిలో 485 పోస్టుల భర్తీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- ఈ ఏడాది వెయ్యి మందికి కారుణ్య నియామకాలు
- థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడండి
- సింగరేణిపై సమీక్షలో అధికారులకు ఆదేశాలు
- నేడు నోటిఫికేషన్లు : సీఎండీ

వివరాలు 3లో

మార్క్సిజం-లెనినిజం ప్రపంచానికి దారి దీపాలు

భారత్‌లో నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవాలి

- దేశంలో మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య
- హైదరాబాద్‌లో రెడ్‌బుక్ డే సందర్భంగా 'లెనిన్ ఓ విప్లవాయుధం' పుస్తకం సామూహిక పఠనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్క్సిజం-లెనినిజం ప్రపంచానికి మార్గం చూపుతాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. భారత్‌లో నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవాలని చెప్పారు. దేశంలో మతోన్మాదం విస్తరిస్తున్నదనీ, దాన్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ బుక్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతం, ...13లో

రైతులపై బుల్లెట్లు, టియర్ గ్యాస్ షెల్స్

యువ రైతు మృతి.. 25 మందికి తీవ్ర గాయాలు

- హర్యానా-పంజాబ్ సరిహద్దుల్లో పరిస్థితి ఉద్రిక్తం
- జేసీబీ, ప్రొక్లెయినర్స్ యజమానులకు బెదిరింపులు
- ఐదో దఫా చర్చలకు కేంద్రం పిలుపు
- రైతులపై పోలీసు చర్యలను ఖండించిన ఏఐకేఎస్, ఎస్‌కేఎం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కావాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' చేపట్టిన అన్నదాతలపై బీజేపీ ప్రభుత్వం టియర్ గ్యాస్ షెల్స్, రబ్బర్ బుల్లెట్ల వర్షం కురిపించింది. రైతులపై పోలీసులు జరిపిన ఈ దాడిలో బుల్లెట్ గాయాలతో భటిండా జిల్లా బల్లో గ్రామానికి చెందిన యువ రైతు శుభకరన్ సింగ్ (23) మరణించారు. 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ఈ నెల 18న కేంద్ర మంత్రులు - రైతుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో అన్నదాతలు తిరిగి 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభు, ఖానౌరీ నుంచి ఢిల్లీ వైపు రైతులు కదంతొక్కారు. రైతులను అడ్డుకునేందుకు పోలీసులు, భద్రత దళాలు ఏర్పాటుచేసిన బారికేడ్లను, ఇనుప చువ్వలను, కాంక్రీటు గోడలను తొలగించేందుకు ...13లో



(ఫైల్)

శుభకరన్ సింగ్ (23)



ఎన్డీయే ఎంపీలకు వ్యతిరేకంగా ఎస్‌కేఎం ఆందోళన

- బీజేపీ నేతల దిష్టిబొమ్మలు దహనం

వివరాలు 13లో

కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుంది

రాహుల్‌తో విభేదాలు లేవు : సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్



లక్నో : రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. పొత్తుపై కాంగ్రెస్‌తో విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. అంతా బాగానే ఉన్నదని, బాగానే ముగుస్తుందని ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీతో ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. పొత్తుకు సంబంధించి అన్ని విషయాలూ త్వరలోనే స్పష్టమవుతాయని ఆయన చెప్పారు. సీట్ల సర్దుబాటుపై ఒప్పందం కుదిరితేనే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ భాగస్వామి అవుతారంటూ సమాజ్‌వాదీ పార్టీ కొద్ది రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. అమేథీలో సోమవారం జరిగిన రాహుల్ యాత్రకు అఖిలేష్ హాజరు కాలేదు. ఆ తర్వాత సమాజ్‌వాదీ పార్టీ ఏకపక్షంగా మరో 11 స్థానాలకు ...13లో

మోడీ రామరాజ్యంలో

దళితులపై వివక్ష

వెనుకబడిన వర్గాలకు ఉద్యోగాల్లేవు : జోడో యాత్రలో రాహుల్ విమర్శ

కాన్పూర్ : మోడీ రామరాజ్యంలో దళితులపై వివక్ష తీవ్రమవుతున్నదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. జనాభాలో 90శాతంగా వున్న దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలకు తగినన్ని ఉద్యోగాలను కేంద్రం సృష్టించడం లేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. రామరాజ్యంగా చెప్పుకునే మోడీ ప్రభుత్వ హయాంలోనే వారి పట్ల వివక్ష కనబడుతుందన్నారు. 'ఇదేమీ రామరాజ్యం? వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు వీరికెవరికీ ఉద్యోగాల్లేవు.' అని ఆయన భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో విమర్శించారు.

'దేశంలో 50శాతం జనాభా వెనుకబడిన వర్గాలు. 15శాతం దళితులు, 8శాతం గిరిజనులు, 15శాతం మైనారిటీలు. మీరెంత అరిచి గీ పెట్టినా మీకు ఈ దేశంలో ఉపాధి దొరకదు. మీకు ఉద్యోగాలు రావాలని నరేంద్ర మోడీ కోరుకోవడం లేదు' అని రాహుల్ గాంధీ విమర్శించారు.




మీడియాలో కానీ, బడా పరిశ్రమల్లో కానీ దళితులు, వెనుకబడిన వర్గాలవారెవరూ లేరని, అధికార యంత్రాంగంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. కులం, వర్గం భారత్‌ను విభజిస్తున్న తీరు ఈ రకంగా వుందని విమర్శించారు. ప్రజలు ఆకలితో చనిపోతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎంతమంది దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారు వున్నారు. గిరిజనురాలైన ...13లో

కరెంట్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : వేసవి ప్రణాళిక సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారాల్ని ప్రజలు నమ్మవద్దనీ, ఇలాంటి ప్రచారాల పట్ల అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మారిన క్రమంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వచ్చే వేసవిలో నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. బుధవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యుత్ శాఖ వేసవి యాక్షన్‌ప్లాన్ అమలుపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కోలకు చెందిన ఉన్నతాధికారులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులతో మాట్లాడాలనీ, విద్యుత్ సమస్యలపై



కాల్‌సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందిస్తూ, వినియోగదారుల కాల్స్‌ను రికార్డ్ చేయాలని ఆదేశించారు. అత్యధిక విద్యుత్ డిమాండ్ దృష్ట్యా సరఫరా, నిర్వహణ, ఓవర్ లోడ్‌తో ఇబ్బందులు వస్తున్నాయనీ, వీటిని సమన్వయం చేసుకొని పరిష్కరించాలని చెప్పారు. కమర్షియల్ ఏరియాల్లో విద్యుత్ నిర్వహణ పనుల కోసం రాత్రివేళ లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాలని సూచించారు. నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తే, ఆ సమాచారాన్ని ముందుగా వినియోగదారులకు సంక్షిప్త సందేశాల రూపంలో తెలియజేయాలన్నారు. గత ఏడాదితో ఇప్పటి విద్యుత్ డిమాండ్‌ను పోలుస్తూ ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం ఇచ్చి, ప్రచారం చేయాలని సూచించారు. గత పాలకులు తక్కువ పనిచేసి, ప్రచారం ఎక్కువ చేసుకున్నారనీ, అసత్యాలు ప్రచారం చేసే వారిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో దక్షిణ డిస్కం సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ, ఉత్తర డిస్కమ్ సీఎమ్‌డీ కే వరుణ్‌రెడ్డి, టీఎస్ ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వద్దు

టీఎస్ రెడ్కో ప్రాజెక్ట్ డైరెక్టర్ డీ అమరేందర్ రెడ్డి బదిలీని నిలిపివేయాలని ఆలిండియా రెనువబుల్ ఎనర్జీ ఎంటర్‌ప్రైన్యూర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ...6లో

ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్ ఛేంజర్

- దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేస్తాం
- అసెంబ్లీలో ముందు సీట్లో ఎందుకు కూర్చోవట్లేదు కేటీఆర్?: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిలో రీజినల్ రింగురోడ్డు నిర్మాణం సూపర్ గేమ్ ఛేంజర్ అవుతుందని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మొన్నటిదాకా ముందు సీట్లో కూర్చున్న కేటీఆర్ అధికారం పోగానే తనకేం తెల్వదన్నట్టుగా వెనుక సీట్లో కూర్చోవటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కృష్ణా నది జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. పదేండ్ల కాలంలో కనీసం 250 టీఎంసీల నీళ్లను వాడలేని కేసీఆర్ నల్లగొండకు పోయి నోటికొచ్చినట్టు ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నిర్ణయాల వల్ల ఇప్పుడు నల్లగొండ జిల్లాకు నీళ్లు అందని పరిస్థితి నెలకొందని తెలిపారు. రాబోయే రోజుల్లో దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని హామీనిచ్చారు.

నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.700 కోట్లు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజరాహిల్స్‌లో గల మంత్రుల నివాస సముదాయంలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఔటర్ రింగురోడ్డు హైదరాబాద్‌కు గేమ్ ఛేంజర్‌గా మారిందనీ, దాని ఫలితంగానే ఎయిర్ పోర్ట్, సాఫ్ట్‌వేర్, ఫార్మా ఇండస్ట్రీలు అభివృద్ధి చెందాయని చెప్పారు. ఇప్పుడు రాబోతున్న ఆర్ఆర్ఆర్ తెలంగాణ అభివృద్ధిలో సూపర్ గేమ్ ఛేంజర్‌గా మారబోతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. మూడేండ్లలో పనులను పూర్తిచేయాలనే సంకల్పంతో తాము ముందుకెళు‌తున్నామన్నారు. 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలనే వినతిపై నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించారని తెలిపారు.



సీఆర్ఐఎఫ్ కింద మరో రూ.855 కోట్ల రూపాయలను మంజూరీ అయ్యేలా చూస్తామని హామీనిచ్చారని చెప్పారు. పదేండ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని కేసీఆర్ దోచుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కృషితో మూసీ కాలుష్యాన్ని తొలగించి టూరిస్టు స్పాట్ గా చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని చెప్పారు. లక్షల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన గత కేసీఆర్ ప్రభుత్వం రూ.363.43 కోట్ల యుటిలిటీ చార్జీలను చెల్లించలేమని చేతులెత్తేసిందని విమర్శించారు. దీంతో జాతీయ రహదారుల నిర్మాణాలు పెండింగ్‌లో పడ్డాయని తెలిపారు. భువనగిరి గుట్టకు కేబుల్ కార్ల నిర్మాణానికి కేవలం రూ.200 కోట్ల రూపాయల నిధులను కేటాయించుకోలేని వ్యక్తి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అని విమర్శించారు. బయట ఫైటింగులు చేసుకొని లోపల మీటింగులు పెట్టుకొనే బీఆర్ఎస్, బీజేపీ బంధం కేసీఆర్ ఢిల్లీ పర్యటనలో బయటపడబోతున్నదన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందనీ, అ పార్టీది ఇక ముగిసిన అధ్యాయమే అని చెప్పారు.

పూసపల్లి కుట్రకేసును ఎత్తేయాలి


- ఉప ముఖ్యమంత్రి భట్టికి న్యూడెమోక్రసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

న్యూడెమోక్రసీ నాయకులపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏజెన్సీ గ్రామాలపై పోలీసుల కూంబింగ్‌ను నిలిపేయాలని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్, నాయకులు గౌని ఐలయ్య, జి అనురాధ కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తదితరుల అరెస్ట్‌తోపాటు అనంతర పరిణామాలను ఉప ముఖ్యమంత్రికి వారు వివరించారు. సమస్యలపై పోరాడుతున్న తమ పార్టీని నిషేధిత నక్సలైట్ పార్టీగా కొంతమంది పోలీసు అధికారులు పరిగణించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వారు ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారనీ, దాన్ని సరిదిద్దాలని కోరారు. ఖమ్మం సరిహద్దులో ఉన్న కోయ చెలక గ్రామంలో అశోక్ అరెస్టు తర్వాత బయ్యారం, పాఖాల కొత్తగూడ, ఇల్లందు మండలాల పరిధిలోని అటవీ ప్రాంత గ్రామాలు, గూడేలు, తండాల్లో పోలీసులు కూంబింగ్‌కు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. కోయచెలకలో అరెస్టు చేసిన వారితోపాటు మరో నలుగురిని వారి ఇండ్ల వద్ద నుంచి తీసుకెళ్లి వివిధ పోలీసు స్టేషన్లలో నిర్బంధించారని వివరించారు. కూంబింగ్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రాంచంద్రరావు కన్నుమూత

- నేడు అంత్యక్రియలు



(ఫైల్)

హైదరాబాద్ బ్యూరో

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మాటూరు రాంచంద్రరావు (76) ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని తన స్వగృహంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఖమ్మం మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) సీనియర్ నేత మంచికంటి రాంకిషన్ రావుకు రాంచంద్రరావు స్వయాన మేనల్లుడు. ఆయన స్ఫూర్తితోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు పేటలో పుట్టిన ఆయన.. పార్టీ పిలుపు మేరకు ఖమ్మం వచ్చి స్థిరపడ్డారు. 1965లో ఆయన పార్టీ సభ్యులుగా చేరారు. ఆయన తండ్రి నాగభూషణ రావు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా పనిచేశారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎఫ్) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన రాంచంద్రరావు.. అటు తరువాత ఎస్ఎఫ్ఐగా రూపాంతరంలోను వ్యవస్థాపక నాయకులుగా ఉంటూ 1973లో సీపీఐ(ఎం) పూర్తి కాలం కార్యకర్తగా చేరారు. 1976 ఎమర్జెన్సీ కాలంలో, తరువాత, జైలు జీవితం గడిపారు. ఎమర్జెన్సీ కాలంలో కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కొరియర్‌గా పనిచేశారు. రహస్య జీవితం గడిపారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఖమ్మంలో జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర కమిటీ తొలి కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు, సీపీఐ(ఎం) నాయకులు ఎం. సుబ్బారావు, బాబురావు, సిఐటియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎస్కే మేరా సాహెబ్ తదితరులు సంతాపం ప్రకటించారు.

ప్యాపిలి ఎస్ఐ మృతి

నంద్యాల : మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నా సాగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా ప్యాపిలి ఎస్ఐ, ఆయన అల్లుడు, డ్రైవర్ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.... అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ (57) ప్యాపిలి మండలం రాచర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. తన కుమార్తె అనూషకు మచిలీపట్నంకు చెందిన పవన్‌సాయి (25)తో 15న వివాహం చేశారు. హైదరాబాద్‌లో ఇంటిగృహ ప్రవేశానికి ఎస్ఐ, తన కుమార్తె, అల్లుడు కారులో వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

అభ్యంతరాలకు పాతరే...

ఎన్నికల బాండ్లపై మోడీ సర్కారు ఏకపక్ష నిర్ణయం

ఆర్‌బీఐ, ఈసీ అభిప్రాయాలు బుట్టదాఖలు చేశారు

సుప్రీంకోర్టు తీర్పుతో భంగపాటు


ఎన్నికల బాండ్ల పథకం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది నియంతృత్వ పోకడలను ప్రతిఘటించే వారికి లభించిన అరుదైన విజయం. కానీ గత సార్వత్రిక ఎన్నికలు సహా దేశంలో జరిగిన అనేక ఎన్నికలలో పాలక పక్షం ఈ చట్టవిరుద్ధమైన నిధులతోనే బరిలోకి దిగి ప్రత్యర్థులను ఓడించిందన్న విషయం మాత్రం మరచిపోకూడదు. వాస్తవానికి ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు గతంలోనే విచారణ జరిపి తీర్పు ఇచ్చి ఉండాల్సింది. అయితే సుప్రీంకోర్టు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేసిందన్న విమర్శలు వచ్చాయి. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌ని మోడీ ప్రభుత్వం రాజ్యసభ సీటుతో సత్కరించడం ఈ వాదనకు బలం చేకూర్చింది. విచారణను ఎందుకు జాప్యం చేశారని పాత్రికేయులు గొగోయ్‌ని ప్రశ్నిస్తే ఈ కేసు కోర్టు ముందుకు వచ్చిందన్న విషయమే తనకు గుర్తు లేదని సమాధానమిచ్చారు.

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం 2017 బడ్జెట్‌లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రకటించింది. అయితే బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి నాలుగు రోజుల ముందు ఓ సీనియర్ అధికారి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగాన్ని పరిశీలించారు. ఓ కీలకమైన పథకాన్ని ప్రవేశపెట్టాలంటే ఆర్‌బీఐ అనుమతి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎందుకంటే బాండ్లను ప్రవేశపెట్టాలంటే ఆర్‌బీఐ చట్టంలో విధిగా మార్పులు చేయాల్సి ఉంటుంది. ఆ విషయం ప్రభుత్వానికి తెలియదేమో అనుకొని ఆ అధికారి ఓ సవరణను ప్రతిపాదించారు.
ఆర్‌బీఐ చట్టాన్ని సవరించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖకు నోట్ పంపారు. దీనిపై వివరణ కోరుతూ 2017 జనవరి 28న ఆర్‌బీఐకి మెయిల్ వచ్చింది.

ఆర్‌బీఐ ఏమంది?

ఈ మెయిల్‌పై జనవరి 30న ఆర్‌బీఐ స్పందించింది. ఎన్నికల బాండ్ల ఆలోచన మంచిది కాదని, అది ఆర్‌బీఐ అధికారాన్నే ప్రశ్నిస్తోందని తెలిపింది. బాండ్ల పథకం కోసం చట్టాన్ని సవరించడం కేంద్ర బ్యాంకింగ్ చట్టంలోని ముఖ్య సూత్రానికి తూట్లు పొడవడమే అవుతుందని, అది చెడు సంప్రదాయానికి దారి చూపుతుందని అభిప్రాయపడింది.
ఆర్‌బీఐ తన సమాధానంలో మరో అభ్యంతరాన్ని కూడా లేవనెత్తింది. బాండును కొనుగోలు చేసే వ్యక్తి లేదా సంస్థే నేరుగా పార్టీకి విరాళం అందించాల్సిన పని లేదని చట్టంలో పేర్కొన్నారని గుర్తు చేస్తూ దీనివల్ల ఇక పారదర్శకతకు చోటు ఎక్కడుంటుందని ప్రశ్నించింది. 'ఎవరైనా ఓ వ్యక్తి బాండును కొనుగోలు చేసి దానిని విదేశీ ప్రభుత్వం సహా ఎవరికైనా విక్రయిస్తే వారు దానిని రాజకీయ పార్టీకి బహుమతిగా అందజేయవచ్చు. పేరు లేని బాండు నగదుతో సమానం. అది బేరర్ బాండు. దానిని ఎవరికైనా బదిలీ చేయవచ్చు. అంటే రాజకీయ పార్టీకి విరాళం ఇచ్చిన అసలు వ్యక్తి ఎవరో లేదా సంస్థ ఏదో ఎవరికీ తెలీదు' అని వివరించింది.





ఆర్‌బీఐ మరో కీలక అంశాన్ని కూడా ప్రస్తావించింది. చట్ట సవరణ ప్రకారం వ్యక్తులు లేదా సంస్థల బ్యాంకు ఖాతాల నుండి రాజకీయ పార్టీలకు నగదు బదిలీ అవుతుంది. అయితే ఈ ప్రక్రియ చెక్కు లేదా బ్యాంక్ బదిలీ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మాత్రమే జరగాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. వివిధ దేశాల్లో అమలులో ఉన్న పద్ధతులకు స్వస్తి చెప్పి ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టాల్సిన అవసరమేమీ లేదని తెలిపింది.

ఈసీ కూడా...

ఆర్‌బీఐ మాత్రమే కాదు...ఎన్నికల సంఘం కూడా ఎన్నికల బాండ్ల పథకం ప్రమాదకరమైనదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రాజకీయ పార్టీలు తాము పొందే విరాళాల వివరాలను తెలియజేయాల్సిన అవసరం లేదన్న వెసులుబాటు రాజకీయ నిధులకు సంబంధించిన పారదర్శకతపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపింది. ఎన్నికల బాండ్ల చట్టాన్ని ఆమోదించిన తర్వాత కూడా ఈసీ తన వ్యతిరేకతను వ్యక్తం చేస్తూనే ఉంది. సుప్రీంకోర్టుకు తన అసమ్మతి తెలియజేస్తూనే ఉంది.



చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్టు..

అటు ఆర్‌బీఐ, ఇటు ఎన్నికల కమిషన్...ఈ రెండు ముఖ్యమైన సంస్థలు బాండ్లపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా వ్యవహరించింది. ఆర్‌బీఐ సకాలంలోనే స్పందించినప్పటికీ ప్రభుత్వం మాత్రం తమకు ఆ సలహా ఆలస్యంగా అందిందని, అప్పటికే ఆర్థిక బిల్లు ముద్రణ పూర్తయిందని చెప్పింది. చివరికి అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో సర్కారుకు భంగపాటు తప్పలేదు. ఏది ఏమైనా ప్రజాస్వామ్యంలో సంస్థాగత నియంత్రణలకు పరిమితి ఉంటుందన్న విషయాన్ని ఎన్నికల బాండ్ల ఎపిసోడ్ చాటిచెప్పింది. బలవంతులైన పాలకులు ఏది చేయాలనుకున్నా... అది ప్రమాదకరమైనది అయినా, రాజ్యాంగ విరుద్ధమైనది అయినా...దానిని అడ్డుకునేందుకు జరిగే ప్రతిఘటన స్వల్పంగానే ఉంటుంది.

బీజేపీకే ఉపకరించింది

మోడీ ప్రభుత్వం రూపొందించిన ఎన్నికల బాండ్ల పథకం అధికార బీజేపీకి రెండు రకాలుగా ఉపయోగపడింది. అపరిమిత కార్పొరేట్ విరాళాలు ఎలాంటి తనిఖీలు లేకుండా ఆ పార్టీ ఖాతాలో చేరిపోయాయి. అదే సమయంలో ఇతర పార్టీలకు అందే విరాళాల వివరాలన్నీ కేంద్రం చెవిలో పడ్డాయి. ఫలితంగా ప్రతిపక్షాలకు మద్దతు ఇస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలు ప్రారంభించేందుకు ప్రభుత్వానికి అవకాశం లభించింది. సుప్రీంకోర్టు తీర్పు పుణ్యమా అని ఇప్పుడు విరాళాల వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్ బహిర్గతం చేయాల్సి ఉంటుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే రాజకీయ నిధుల్లో ఎన్నికల బాండ్ల వాటా స్వల్పమే. 2019 సార్వత్రిక ఎన్నికలకు మొత్తం 8.7 బిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. గత ఐదు సంవత్సరాలలో ఎస్‌బీఐ విక్రయించిన ఎన్నికల బాండ్ల విలువ కేవలం రెండు బిలియన్ డాలర్లు మాత్రమే. వీటిలో బీజేపీకి అందిన విరాళాలే అధికం.

చేయాల్సింది ఎంతో ఉంది

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్, మాజీ ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ, బీజేపీ మాజీ ఎంపీ, మాజీ మంత్రి సుబ్రమణ్య స్వామితో ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ చర్చించారు. ఎన్నికల రంగంలో అందరికీ నిష్పాక్షిక న్యాయం, సమాన అవకాశాలు లభించాలంటే చేయాల్సింది ఎంతో ఉన్నదని వారంతా అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వ్యవస్థ బీజేపీకి అనుకూలంగా ఉన్నదని వారు గుర్తు చేశారు.



గత ముఖ్యమంత్రుల బాటలోనే నేనూ!

- చంద్రబాబు, వైఎస్, కేసీఆర్‌ల హయాంలో ప్రగతి పథంలో హైదరాబాద్
- వారి సాంప్రదాయాన్ని కొనసాగిస్తాం
- రూ.2 వేల కోట్లతో 64 ఐటీఐల అభివృద్ధి
- స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంప్రదింపులు
- ఓఆర్ఆర్ హైదరాబాద్‌కు లైఫ్‌లైన్ : సీఐఐ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత ముఖ్యమంత్రుల బాటలోనే తాను హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడుతానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లోని హోటల్ వెస్టిన్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఆధ్వర్యంలో విద్య, నైపుణ్యావృద్ధి, వ్యవస్థాపక అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు ఎలా ఉన్నా వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ హయాంలో హైదరాబాద్ ప్రగతి పథంలో దూసుకు పోయిందని అన్నారు. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవనీ. గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తామని అన్నారు. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే తమ విధానమని రేవంత్ స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఆర్థిక ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పరిశ్రమలకు కావాల్సిన అనుమతుల నుంచి మొదలుకుని రక్షణ వరకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ తీసుకున్న విధానపరమైరన నిర్ణయం వల్ల గతంలో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ ఏర్పాటైందని గుర్తు చేశారు. అప్పుడేసిన అడుగులే నేడు నగరాన్ని ఫార్మా హబ్‌గా మార్చేందుకు దోహద పడ్డాయని చెప్పారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్ గురించి మాట్లాడితే అవసరం లేదని అన్నారనీ, ఇప్పుడది హైదరాబాద్‌కు లైఫ్ లైన్‌గా మారిందని సీఎం తెలిపారు. రూ.2 వేల కోట్లతో తెలంగాణలో ఉన్న 64 ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సీఐఐతో కలిసి ముందుకు నడుస్తామని పేర్కొన్నారు. స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జాయిన్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందించనున్నట్టు వెల్లడించారు. లాజిస్టిక్ రంగంలో మరింత అవకాశాలు మెరుగుపర్చేందుకు డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం

- ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలి : కలెక్టర్లు, పోలీసు అధికారులకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 19 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి ఆదేశించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో బుధవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 9,80,000 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. మొత్తం 1,521 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి కూడా సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లొద్దనీ, ఆ విధంగా తీసుకెళ్లడాన్ని నిషేధించామని స్పష్టం చేశారు. పరీక్షా ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు లేదా మూల్యాంకన కేంద్రాలకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని కోరారు. ఏ విధమైన పరీక్షా పత్రాలు కూడా లీక్ అవ్వకూడదని ముఖ్యమంత్రి పలు మార్లు హెచ్చరించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ సూపరింటెండెంట్‌లు, తపాలా శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చేనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ రెండో తేదీ వరకు జరుగుతాయని వివరించారు. 5.8 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారనీ, 2,676 కేంద్రాలలో జరుగుతాయని చెప్పారు. ఈ పరీక్షలను కూడా పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పటిష్టమైన ఏర్పాట్లతో ఇంటర్, పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులను కోరారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు తగు విధంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద తగు ప్రాథమిక చికిత్స ఏర్పాట్లు చేసి ఆశా వర్కర్లు, ఏఎన్ఎం సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎలాంటి చిన్న పొరపాట్లకు తావు లేకుండా పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీజీపీ రవి గుప్తా మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి పరీక్షలను ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, అడిషనల్ డీజీ సంజయ్ జైన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాకులు ఎ కృష్ణారావు, అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ , రూ.500కే గ్యాస్ సిలిండర్ వారంలో అమలు

(మొదటి పేజీ తరువాయి)

14 పార్లమెంట్ స్థానాలు గెలిచి తీరాలి.. త్వరలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం.. వారం రోజుల్లో తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవారికీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం.." అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రేవంత్ తొలిసారి పర్యటించారు. రూ.4,369 కోట్ల విలువైన 20 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.వలసల జిల్లా పాలమూరుకు వలస వచ్చిన కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేండ్ల కాలంలో ఒక్క ఎకరాకైనా సాగు నీరు ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ మొదలు పెట్టిన తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ దూరాడు తప్ప ఉద్యమాన్ని ఆయన మొదలు పెట్టలేదని చెప్పారు. సమైక్యాంధ్రలో జరిగిన దోపిడీ కంటే తెలంగాణ రాష్ట్రంలో అధికంగా జరిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌తో చేసుకున్న చీకటి ఒప్పందం వల్లే 203 జీవో ద్వారా అక్రమంగా 12 టీఎంసీల నీటిని తీసుకెళ్లారని వివరించారు. రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులతో కాంట్రాక్టర్లకు తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల పరిధి నుంచి ఏటా లక్షలాది మంది వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు గడ్డ నన్ను ఆశీర్వదించి అక్కున చేర్చుకుందని, తాను ముఖ్యమంత్రి కావడానికి కారణమైన కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. మార్చి 15న రైతుబంధు, రైతు భరోసా అమలు చేస్తామన్నారు.

బీజేపీకి, బీఆర్ఎస్‌కు చీకటి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. ప్రధాని మోడీ జిల్లాకు వచ్చినప్పుడు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చి పదేండ్లయినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జాతీయ రహదారులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో నలుగురు ఎంపీలు బీజేపీ వాళ్లు గెలిచినా తెలంగాణకు నాలుగు రూపాయలు అయినా తేలేదని విమర్శించారు. అందువల్ల ఉద్యోగాలు రావాలన్నా, ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, దేశంలో తెలంగాణ అగ్రభాగంలో నిలబడాలన్నా కాంగ్రెస్‌ను ఆదరించి అత్యధిక మెజార్టీతో ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలో రూ.4369.143 కోట్లతో అభివృద్ధి పనుల కోసం భూమి పూజ చేసినట్టు చెప్పారు. గత పాలకుల చేత వివక్షకు గురికాబడిన ఈ ప్రాంత సాగు భూములకు నీరందించే కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ప్రాజెక్టు కోసం రూ.2945 కోట్లకు టెండర్లను సైతం పిలుస్తున్నామని తెలిపారు. రూ.300 కోట్లతో వెటర్నరీ కళాశాల, రూ.344.5 కోట్లతో రెండు లైన్ల రోడ్డు, రూ.224.50 కోట్లతో మెడికల్ కాలేజీ, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలలకు శంకుస్థాపన చేశామన్నారు. కొడంగల్ పట్టణంలో 220 బెడ్స్ ఆస్పత్రి, రూ.213.20 కోట్లతో టీచింగ్ కళాశాల, పంచాయత్ రాజ్ రోడ్లు, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. అలాగే, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, కొడంగల్ నియోజకవర్గంలోనే 50వేల మెజార్టీ రావాలని అన్నారు.కార్య క్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర రెడ్డి, సీడీడబ్ల్యూసీ నాయకులు వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మల్లు రవి, యెన్నం శ్రీనివాసరెడ్డి, పర్ణిక రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిట శ్రీహరి, వంశీకృష్ణ, మేఘా రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్లు సిద్ధం చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు, 168 ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు వీలుగా నోటిఫికేషన్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. అలాగే సంస్థలో కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలనీ, ఈ ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పారు. బుధవారంనాడాయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగరేణి కాలరీస్‌పై ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలనీ, పరీక్షల్లో ఏలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల జరిగిన సింగరేణి ఉద్యోగ మేళాలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, వారసుల వయో పరిమితిని 35 ఏండ్ల నుంచి 40 ఏండ్లకు పెంచే విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే సింగరేణి కార్మికుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేకుండా చేసుకున్న కోటి రూపాయల ప్రమాద బీమా ఒప్పందం పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. సంస్థలో పనిచేస్తున్న 43 వేల మంది ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించినట్లవుతుందని చెప్పారు. కోల్ ఇండియాలో ఇప్పటి వరకు ఇలాంటి ఒప్పందం ఏదీ లేదని, త్వరలో మిగిలిన బ్యాంకులతోనూ ఈ తరహా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎమ్‌డీ ఎన్ బలరామ్ వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఈ నెల 26వ తేదీ ప్రారంభించనున్నందున ఏర్పాట్లు చేయాలని డిప్యూటి సీఎం సింగరేణి అధికారులను ఆదేశించారు. సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సింగరేణి ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన అతిథి గృహం భూమి పూజా కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కార్మికుల సంక్షేమం కోసం సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందనీ, గోదావరిఖని, మంచిర్యాల కార్మికులకు సురక్షిత మంచినీరు అందించేందుకు వీలుగా చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లను త్వరలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుత వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బొగ్గు ఉత్పత్తి, రవాణాపై రోజువారీ సమీక్ష నిర్వహించాలనీ, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా సీఎమ్‌డీ ఎన్ బలరాం మాట్లాడుతూ సంస్థలోని 317 డైరెక్ట్, 168 ఇంటర్నల్ పోస్టులకు గురువారం నోటిఫికేషన్లు జారీ చేస్తామని తెలిపారు.

'ఎడ్లబండి' టు 'హెలికాప్టర్'

మేడారంలో జాతర విహంగ వీక్షణం



నవతెలంగాణ-మహదేవపూర్

ఆసియా ఖండంలోనే అతి ముఖ్యమైన ఆదివాసీ జాతర సామ్మక్క, సారలమ్మ జాతరకు తరలివచ్చే సందర్శకులకు నాడు ఎడ్లబండ్లు అందుబాటులో ఉండగా.. నేడు ఏకంగా హెలికాప్టర్లనే అందుబాటులో ఉంచారు. ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగే మేడారం జాతరకు.. హన్మకొండ నుంచి అందుబాటులో ఉండే.. హెలికాప్టర్‌లో.. మేడారం జాతరకు ఒక రౌండ్ ట్రిప్‌తో సహా వీఐపీ దర్శనం పొందొచ్చు. అలాగే ప్రత్యేకంగా హెలికాప్టర్ జాయ్ రైడ్ కూడా ఉంటుంది. జాతర పరిసరాలను విహంగ వీక్షణం చేయవచ్చు. ఒకేసారి ఆరుగురు ప్రయాణించే హెలికాప్టర్ ధరను ఒక్కొక్కరికి రూ.28,999గా నిర్ణయించారు. మరో రైడ్‌లో.. జాతర జరిగే ప్రాంతం మీదుగా 6 నుంచి 7 నిమిషాల పాటు గాలిలో హెలికాప్టర్ చక్కర్లు కొట్టనుంది. అమ్మ వారి గద్దెల పక్క నుంచి మొదలయ్యే రైడ్.. జంప న్న వాగు, చిలుకలగుట్ట పక్కనుంచి చుట్టూరా ఉండే జాతర పరిసరాల మీదుగా సాగుతుంది. దీని కోసం ఒక్కొక్కరి నుంచి రూ.4800 వసూలు చేయనున్నారు. మహదేవపూర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి మేడారానికి అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వెళ్లారు. అలాగే మహదేవపూర్ కాళేశ్వరం సిరివంచ నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించారు.



వనమంతా జనమయం



(మొదటి పేజీ తరువాయి)

మీదుగా మేడారం గద్దెల వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అలాగే, మేడారానికి 18 కి.మీ దూరంలో ఉన్న ఏటూరునాగారం మండలం కొండాయిలో ఉన్న గోవిందరాజులు దేవాలయంలో వడ్డెలు పొదెం బాబుతో పాటు మరికొందరు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడె రూపంలో ఉన్న గోవిందరాజులను తీసుకుని బుధవారం కాలినడకన బయలుదేరారు. దేవాలయం నుండి వడ్డెలు బయటకు రాగానే గ్రామానికి చెందిన మహిళలు దండాలు పెడుతూ స్వాగతం పలికారు. రాత్రికి మేడారం గద్దెలపై గోవిందరాజును ప్రతిష్ఠించారు. కాగా, చిలుకలగుట్ట నుంచి గురువారం సమ్మక్కను గద్దెలపైకి తీసుకురానున్నారు. జాతరలోని పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్లు వేణుగోపాల్, శ్రీజ, ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్, అడిషనల్ ఎస్పీ సదానందం, డీసీపీ మురళీధర్, తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు కోరెగట్ల లక్ష్మణ్‌రావు, ఏటూర్‌నాగారం తహసీల్దార్ ఖాజా సిదరొద్దీన్, సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కలం వీరులు

'సిరికింజెప్పడు, శంఖుచక్రయుగముం చేదోయి సం ధింప'డనేదీ గజేంద్ర మోక్షంలో ఒక శ్లోకం. విష్ణువు గజేం ద్రుని కాపాడే తొందరలో లక్ష్మీదేవికి కూడా జెప్పక, శంఖు చక్రం లాంటి ఆయుధములను జేపట్టక బయలు దేరెనని ఆ శ్లోకం సారాంశం. వాస్తవానికి విష్ణువు అలా వెళ్లాడో లేదో మనకు తెలియదు గానీ... ఏదైనా ఒక సంఘటన జరిగిందని తెలిసిన మరుక్షణం... ఆగ మేఘాల మీద ఆ సంఘటనా స్థలికి చేరేవాడు జర్నలిస్టు. కలం పట్టిన సైనికుడు జర్నలిస్ట్. కలం పట్టినా, కెమెరా పట్టినా బాధితుల పక్షాన నిలుస్తాడు, అక్షరాలను తూటాల్లా పేల్చుతాడు. విధి నిర్వహణలో తన ప్రాణాలను సైతం ఫణంగా పెడతాడు. విత్తును మొలకెత్తించడానికి రైతు ఎంత శ్రమిస్తాడో... ఒక వార్తను ప్రపంచానికి తెలియజెప్పడానికి జర్నలిస్టూ అంతే శ్రమపడతాడు. ఒక్కోసారి సర్వశక్తులూ ఒడ్డి పోరాడ తాడు. రైతుది బతుకు పోరాటమైతే, జర్నలి స్టుది మంచిని బతికించాలనే ఆరాటం. మొన్ననే 'వీక్షణం' వేణుగోపాల్‌పై ఎన్ఐఏ వేధింపులు, ఆయన సెల్‌ఫోన్ గుంజుకున్నారు. కర్నూల్‌లో ఆంధ్రజ్యోతి విలేకరిపై రాజ కీయశక్తులు దాడి, హైదరాబాద్‌లో తులసీచందుపై సంఘ్‌పరివార్ ట్రోలింగ్. ప్రజల పక్షాన నిలబడే జర్నలి స్టులకు వేధింపులు కొత్తగాకపోయినా నేడు తీవ్రమైన విషయం అర్థమౌతూనే ఉంది.

> వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 2020లో 180 దేశాలలో 142వ స్థానంలో ఉంటే, 2023లో అది 161వ స్థానానికి దిగజారింది. ఇదీ మోడీ ప్రభుత్వంలో మీడియాకు దక్కిన గౌరవం. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభమైన మీడియాను ఎంతగా నరుకుతున్నారో కేంద్ర ప్రభుత్వ వైఖరిని చూస్తేనే అర్థమవుతుంది.లక్కింపూర్‌ఖేరీలో ఫొటో జర్నలిస్టు జీవితాన్ని బీజేపీ కేంద్రమంత్రి పుత్రరత్నం చిదిమేసిన ఘటన చూశాం. భాష్పవాయుగోళాలను ఎదిరించి ముందుకు సాగే రైతాంగ డిమాండ్లలో ఒక కీలక డిమాండు ఆ కిరాతకుడ్ని శిక్షించాలనేది.


గత మూడు దశాబ్దాలుగా జర్నలిజం ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో ఒకటిగా మారిం దని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. ఈ కాలంలో విధి నిర్వహణలో 1600 మంది జర్నలిస్టులు మరణించారని యునెస్కో నివేదిక వెల్లడించింది. అంత ర్జాతీయ చట్టం, ఇతర ఒప్పందాల ప్రకారం జర్నలిస్టులకు వ్యతిరేకంగా జరిగే నేరాలను పూర్తిగా విచారించి బాధ్యు లను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవడంలో దేశాలు వైఫల్యాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కనుకనే జర్నలిస్టులపై దాడులను యుద్ధ నేరాల కింద పరిగణించాల్సిందేనని ఐరాస స్పష్టం చేసింది. నేడు జర్నలిస్టుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. గతేడాది ప్రపంచ వ్యాప్తంగా 120 మంది జర్నలిస్టులు



హత్యగావించబడ్డారని అంతర్జాతీయ జర్నలిస్టుల ఫెడరే షన్ (ఐఎఫ్‌జె) వెల్లడించింది. గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె)' సమాచారం ప్రకా రం... దశాబ్ద కాలంలో 2023 జర్నలిస్టులకు ఘోరమైన సంవత్సరం. ఈ ఏడాదిలో 99 మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో చనిపోయారు. ఇందులో 77 మంది గాజాపై ఇజ్రాయిల్ నరమేధాన్ని రిపోర్టింగ్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోవటం గమనార్హం. తాజా లెక్కల ప్రకారం ఇజ్రాయిల్-గాజా యుద్ధంలో మరణించిన జర్నలిస్టుల సంఖ్య 88కు పెరిగిందని సిపిజె తన ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం డజన్ల కొద్ది జర్నలిస్టులను ఉద్దేశ పూర్వకంగానే చంపిందన్నది నిజమైతే అది 'యుద్ధ నేరం'గా పరిగణించ బడుతుంది.

గాజాపై ఇజ్రాయిల్ దాడిలాంటిదే.. భారతదేశం లోనూ జర్నలిస్టులు, మేధావులపై నిరంకుశదాడి జరుగు తోంది. మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వందలాది జర్నలిస్టులపై దేశద్రోహం, 'ఉపా' చట్టం కేసులు పె ట్టింది. 'న్యూస్ క్లిక్ పోర్టల్'పై కేసులు నమోదు చేయిం చింది. అందులో పనిచేసే జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు పెట్టించింది. పెగాసస్ స్పైవేర్‌తో 40మంది జర్న లిస్టులపై కేంద్రం పెట్టిన నిఘా కూడా బయట పడింది. అనేకమందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎంతోమంది మహిళా జర్నలిస్టులపైనా, వారి కుటుంబ సభ్యులపైనా, వారి ఇండ్లపైనా భౌతిక దాడులు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత దేశం 2020లో 180 దేశాలలో 142వ స్థానంలో ఉంటే, 2023లో అది 161వ స్థానానికి దిగజారింది. ఇదీ మోడీ ప్రభుత్వంలో మీడియాకు దక్కిన గౌరవం. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభమైన మీడి యాను ఎంతగా నరుకుతున్నారో కేంద్ర ప్రభుత్వ వైఖరిని చూస్తేనే అర్థమవుతుంది. లక్కింపూర్‌ఖేరీలో ఫొటో జర్నలిస్టు జీవితాన్ని బీజేపీ కేంద్రమంత్రి పుత్రరత్నం చిదిమేసిన ఘటన చూశాం. భాష్ప వాయుగోళాలను ఎదిరించి ముందుకు సాగే రైతాంగ డిమాం డ్లలో ఒక కీలక డిమాండు ఆ కిరాతకుడ్ని శిక్షించాలనేది.

జూలియన్ అసాంజే, ఎడ్వార్డ్ స్నోడెన్ వంటి సామ్రాజ్యవాద దాష్టీకానికి బలౌతున్న స్థితి నేడు మనం చూస్తున్నాం.అల్‌జజీరా జర్న లిస్టులు ఇజ్రాయిల్ బాంబ్ దాడిలో మరణి స్తున్న తీరు చూస్తున్నాం. అయినా గన్నులకు పెన్నులు వణకవని, వెనక్కి తగ్గవని రుజువవు తూనే ఉంది. రుజువు చేయడమే జర్నలిస్టు కర్తవ్యం. 'యుద్ధ రంగంలో నిలబడి/ కవిత్వం రాయడం గొప్ప ఆనందా న్నిస్తుంది' అంటాడో కవి. నిరంకుశత్వం పెరిగేకొద్దీ జర్నలిస్టు కలం, కెమెరా కూడా తన వాడి పెంచుతుందే తప్ప వెనక్కి తగ్గదు.



'ఎర్ర పుస్తకం' వర్ధిల్లాలి

ప్రతీ అక్షరం ఓ చైతన్యం
ప్రతీ పదం ఓ ప్రజ్వలనం
ప్రతీ పాదం ఓ ఉద్దీపనం
ప్రతీ భావం ఓ ఉత్ప్రేరకం
అదే విప్లవించే ఎర్ర పుస్తకం

కార్మిక కర్షక శ్రామికులకు
పోరు పాఠం ప్రబోధిస్తుంది
కష్టజీవులు కర్మవీరులకు
రణ తంత్రం మంత్రిస్తుంది
తాడిత పీడిత వర్గాలకు
విప్లవ దారి చూపిస్తుంది

మూగబోయిన గళాలకు
ధిక్కార శృతి నేర్పిస్తుంది
సామాజిక అసమానతల
దొంతరలను పూడ్చేందుకు
సాహసాన్ని నూరిపోస్తుంది
అంధకారమైన బతుకుల్లో
క్రాంతి దీప్తిలా ప్రభవిస్తుంది

సామ్రాజ్యవాద పోకడలపై
నిరసన స్వరమై గర్జిస్తుంది
పెట్టుబడిదారుల గుండెల్లో
రగల్ గునపమై దిగుతుంది
మహా వీరుల జీవితగాథల
కళ్లెదుట సాక్షాత్కారం చేసి
సమ సమాజ నిర్మాణానికి
సబ్బండవర్గాల కదిలిస్తుంది
మరో మహోదయం దిశగా
మానవాళిని మళ్లిస్తుంది

విముక్తి చిహ్నమా !
ఎర్రెర్రని పుస్తకమా ..!!
శ్రామిక పోరాటాల వందనం
విముక్తి ఉద్యమాల సెల్యూట్

(ఫిబ్రవరి 21 "రెడ్ బుక్స్ డే" సందర్భంగా)

- కోడిగూటి తిరుపతి
9573929493

మూడో ఏడాదిలోకి ఉక్రెయిన్ సంక్షోభం!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక చర్య మూడో ఏడా దిలోకి ప్రవేశించింది.2022 ఫిబ్రవరి 24న దాడులు ప్రారంభ మైనప్పటికీ 21వ తేదీనే వ్లదిమిర్ పుతిన్ అధికారికంగా ఆదేశాలు జారీ చేశాడు. ఉక్రెయిన్ సరిహద్దుల వైపు రష్యా దళాల అసాధారణ కదలిక ఉన్నట్లు 2021 నవంబరు పదవ తేదీన అమెరికా వెల్లడించింది. ఒకవేళ దాడికి దిగితే బలమైన ఆర్థిక, ఇతర చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుం దని డిసెంబరు ఏడున అమెరికా అధినేత జో బైడెన్ బెది రించాడు. నాటో కూటమిలో ఉక్రెయిన్ చేరకుండా నిషే ధం విధించాలని పుతిన్ డిసెంబరు 17న ప్రతిపాదిం చాడు. దాన్ని జెలెన్‌స్కీ తిరస్కరించాడు. జనవరి 17న తన మిత్రదేశమైన బెలారస్‌తో సైనిక విన్యాసాలు జరిపేందుకు రష్యా ఆరువేల మంది సైనికులు, 60 జెట్ విమానాలను పంపింది. తన దళాలను సన్నద్ధం చేసినట్లు జనవరి 24న నాటో ప్రకటించింది. ఫిబ్రవరి 10న పది రోజుల పాటు సాగే మిలిటరీ విన్యాసాలు 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియా, ఉక్రెయిన్ సరిహద్దులో ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్యం ప్రకటించుకున్న రెండు తూర్పు ప్రాంతాలపై ఫిబ్రవరి 17న ఉక్రెయిన్ మిలిటరీ విరుచుకుపడింది. అదే నెల 21న పుతిన్ సైనిక చర్యకు ఉత్తరులు ఇవ్వటంతో పాటు రెండు ఉక్రెయిన్ తిరుగు బాటు ప్రాంతాలు డాటెస్క్, లుహాన్స్కలకు స్వతంత్ర దేశాలుగా గుర్తిం పు ఇస్తున్నట్లు కూడా ప్రకటించాడు, 24వ తేదీన దాడులు ప్రారం భమయ్యాయి.

> కొందరు కొరియా నమూనాలో పోరు ముగియవచ్చని చెబుతున్నారు. 1950 దశకంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి ఒకే దేశంగా ఉండాల్సిన కొరియా రెండు భూభాగాలుగా ఉంది తప్ప సాంకేతికంగా యుద్ధ విరమణ ఒప్పందం ఇప్పటికీ లేదు. దక్షిణ కొరియా రక్షణకు హామీ ఉన్నట్లుగా ఉక్రెయిన్‌కు నాటో రక్షణ హామీని రష్యా ఎట్టి పరిస్థితిలో అంగీకరించదు గనుక అది కూడా జరగకపోవచ్చన్నది మరో వాదన. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైన తరువాత చైనా -రష్యా సంబంధాలు మరింత బలపడటమే గాక రెండూ దగ్గరయ్యాయి.

రెండేండ్ల ఈ సంక్షోభాన్ని స్థూలంగా చూసినపుడు ఉక్రెయిన్‌పై రష్యా పట్టు మరింత బిగిసింది. భారీ ఎత్తున ఆయుధాలు ఇచ్చిన పశ్చిమ దేశాలు ప్రచారం చేసిన మాదిరి ఉక్రెయిన్ ఎదురుదాడులు ఎలాంటి ఫలితాన్నివ్వలేదు. రెండు వైపులా ఎందరు మరణించిందీ ఇంతవరకు విశ్వసనీయమైన ఆధారాల్లేవు.లక్షల్లో ప్రాణ నష్టం ఉం టుందని భావిస్తున్నారు. రష్యా మీద ప్రకటించిన ఆర్థిక, ఇతర ఆంక్ష లు దేనికీ కొరగాకుండా పోయాయి.ఈ సంక్షోభం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో తెలియదు.ఉక్రెయిన్ ఎక్కువ కాలం ప్రతిఘటన సాగించలేదని, పశ్చిమ దేశాల్లో వైరుధ్యాల గురించి పుతిన్, రష్యా గురించి పశ్చిమ దేశాలు వేసుకున్న తొలి అంచనాలు తప్పాయి. పశ్చిమ దేశాలకు ధీటుగా రష్యా కూడా ప్రచారదాడులతో జవాబి చ్చింది. దీంతో జనాల బుర్రలు ఖరాబు అయ్యాయి. తమ నేతలు చెప్పిన అంశాలు, పలికిన ప్రగల్భాల గురించి పశ్చిమ దేశాల జనాల్లో అనుమానాలు, సందేహాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అటు అమెరికా, ఇటు రష్యాలోనూ ఎన్నికల్లో ఇది ఒక ప్రధాన అంశంగా మారనుంది. దీంతో రెండింటికీ ఈ సంక్షోభం ప్రతిష్టాత్మకంగా మారింది. రానున్న రోజుల్లో అనూహ్య పరిణామాలు సంభవిస్తే తప్ప అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి మరింతగా ఆయుధాలు, ఆర్థిక సాయం అందించటం తప్ప దళాలను ప్రత్యక్షంగా దించే అవకాశాలు కనిపించటం లేదు. ఇవేవీ ఇంతవరకు రష్యాను వెనుకడుగు వేయించలేకపోయాయి. ఈ సంక్షోభానికి ఎప్పుడు,ఎలా తెరపడుతుంది అన్న చర్చ జరుగుతున్నది.

తాజా పరిణామాలను చూద్దాం. తూర్పు ఉక్రెయిన్‌లోని అడీవికా ప్రాంతాన్ని రష్యన్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. జన నష్టాన్ని నివారించేందుకు తామే ఖాళీ చేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించుకుంది. గతేడాది మే నెల తరువాత రష్యన్లకు ఇది పెద్ద విజ యంగా చెబుతున్నారు. తగిన సంఖ్యలో మిలిటరీ, ఉన్న వారి దగ్గర మందుగుండు లేకనే ఇది జరిగిందని వార్తలు. అడీవికా పతనం కాగానే తమ వద్ద ఉన్న శతఘ్నులను మొత్తం ఇస్తామని డెన్మార్క్ ప్రకటించింది. మీరు ఇచ్చినా వాటిని వెంటనే వినియోగించే స్థితిలో లేమని ఉక్రెయిన్ చేతులెత్తేసింది. గత రెండు రోజులుగా రష్యా మరిన్ని దాడులకు పూనుకుంది. మ్యూనిచ్ నగరంలో జరుగుతున్న భద్రతా సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందని దయ చేసి మమ్మల్ని అడగకండి, మిమ్మల్ని మీరు ప్రశ్నించు కోండి, పుతిన్ ఇప్పటికీ కొనసాగించటానికి ఎలా వీలవు తున్నదో చూడండి అని ఐరోపా సమాఖ్యతో అన్నాడు. ఈ సంక్షో భంలో తాము తటస్థంగా ఉన్నామని చైనా మరోసారి స్పష్టం చేసింది. అన్ని స్థాయిల్లో చైనాతో సంబంధాలు కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ ప్రకటించింది. ఐరోపాకు రష్యా ముప్పుకొనసాగుతూనే ఉందని, అది కొన్ని నెలలు, సంవత్సరాలు, ఒక తరం వరకు ఉండవచ్చని బ్రిటన్ లేబర్ పార్టీ నేత డేవిడ్ లామీ అన్నాడు. ఉక్రెయిన్ ఇప్పుడు జీవన్మరణ స్థితిలో ఉందని, దాని విధిని నిర్ణయించేది తామేనని పుతిన్ ప్రకటిం చాడు.తాము మద్దతు ఇస్తున్నప్పటికీ ఉక్రెయిన్‌తో ఆహార ధాన్యాలు, ట్రక్కుల రవాణా సమస్యలు ఉన్నట్లు పోలాండ్ మంత్రి సికోరిస్కీ చెప్పాడు. ఉక్రెయిన్‌కు భద్రత ఉండాలంటే తమ సభ్యత్వం ఇవ్వాలని ఐరోపా యూనియన్ ప్రతినిధి జోసెఫ్ బోరెల్ అన్నాడు. మరో పద్దె నిమిది నెలల పాటు ఉక్రెయిన్ పౌరులకు వీసాలను పొడిగిస్తున్నట్లు బ్రిటన్ తెలిపింది.దీన్ని బట్టి పశ్చిమ దేశాలకు ఈ సమస్య పరిష్కారం పట్ల ఆసక్తి లేదన్నది స్పష్టమౌతోంది.

రెండేండ్ల తరువాత రష్యాను శత్రుదేశంగా చూస్తున్నప్పటికీ ఐరోపాలో యుద్ధ ఆయాసం కనిపిస్తోంది. ఉక్రెయిన్‌కు రానున్న రోజు ల్లో విజయాలు సంభవిస్తే ఫరవాలేదు లేకుంటే మరింత నీరసం, దాన్నుంచి ఎందుకీ తలనొప్పి అనే భావం కూడా తలెత్తవచ్చు. మొత్తమ్మీద ఎన్ని మల్లగుల్లాలు పడినా నాటో కూటమి ఐక్యంగానే ఉంది. ఫిన్లండ్ కొత్తగా చేరగా స్వీడెన్ ఆ బాటలో ఉంది. ఉక్రెయిన్‌లో రష్యా గెలిస్తే అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థ వైపు తిరిగే మలుపు పశ్చిమ దేశాల ప్రయోజనాల ఫణంగా జరుగుతుందని భావిస్తు న్నారు. బాల్టిక్ దేశాలు ఉక్రెయిన్‌కు గట్టి మద్దతు ఇవ్వాలని కోరుతుం డగా నాటోలోని హంగరీ, స్లోవేకియా పెదవి విరుస్తున్నాయి. నెదర్లాండ్స్,స్లోవేకియాలో గతేడాది జరిగిన ఎన్నికలు నాటో ఐక్యత మీద ప్రశ్నలను ముందుకు తెచ్చాయి. జెలెన్‌స్కీకి మిలిటరీ మద్దతులో కోత పెట్టాలనే నినాదంతో పోటీ చేసిన పచ్చిమితవాద ఫ్రీడమ్ పార్టీ నెదర్లాండ్స్‌లో గెలిచింది.రష్యాకు అనుకూలంగా ఉండాలన్న వైఖరితో ఉన్న స్లోవాక్ సోషల్ డెమోక్రసీ పార్టీ 22.9శాతం ఓట్లతో పెద్ద పార్టీగా అవతరించింది. అయితే ఈ రెండు చోట్లా ఈ పార్టీలకు సంపూర్ణ మెజారిటీ లేదు. ఉక్రెయిన్‌కు యాభై నాలుగు బిలియన్ డాలర్ల అదనపు సాయం అందించాలన్న ప్రతిపాదనను అడ్డుకొ నేందుకు హంగరీ ప్రయత్నించింది. ఇప్పటి వరకు చూస్తే జెలెన్‌స్కీ దళాలకు తాము ఇచ్చిన ఆధునిక ఆయుధాలను ఉపయోగించటంలో నాటో దేశాలు శిక్షణ ఇస్తున్నాయి తప్ప ముందే చెప్పినట్లు ప్రత్యక్షంగా పాల్గొనటం లేదు. అంతర్జాతీయ వేదికల మీద రాజకీయ మద్దతు, రష్యాను ఒంటరి చేసేందుకు చేయాల్సిందంతా చేస్తున్నాయి.



డోనాల్డ్ ట్రంప్ గతంలో అధికారంలో ఉన్నపుడు మా నుంచి రక్షణ పొందేది మీరు, దానికయ్యే ఖర్చును కూడా మేమే భరించాలా? కుదరదు మీ కేటాయింపులు పెంచాలని తెగేసి చెప్పాడు. ఇప్పుడు అమెరికా ఎన్నికల్లో ఇది కూడా ఒక సమస్యగా ముందుకు వచ్చింది. ఐక్యతకే ముప్పు తెచ్చేదిగా ఉందని కొందరు చెబుతున్నారు. అవస రాలకు అనుగుణ్యంగా నిధులు కేటాయించని దేశాలకు రక్షణ ఇవ్వాల నుకోవటం లేదని ఇటీవల ఎన్నికల ప్రచారంలో ట్రంప్ చెప్పాడు.ఈ అంశంలో బైడెన్-ట్రంప్ వైఖరిలో చాలా తేడా ఉంది. అది కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే అనే వారు కూడా లేకపోలేదు. ఎవరేం మాట్లా డినా అంతిమంగా అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారు. నాటో దేశాలు పైకి బింకంగా కనిపిస్తున్నప్పటికీ ఉక్రెయిన్ సంక్షోభం నుంచి ఎలా బయటపడాలో వాటికి తోచటం లేదు.నష్టదాయకమైన షర తులతో రష్యాతో రాజీకి అంగీకరించటమా లేక పోరును పొడిగించి ఓటమిని మూటగట్టుకోవటమో ఏదో ఒకటి జరుగుతుందని అనేక మంది నమ్ముతున్నారు.ఏది జరిగినా ప్రపంచ రాజకీయాల్లో అమెరికా, దాని మిత్ర దేశాలకు ప్రతికూలత మరింత పెరుగుతుంది.

కొందరు కొరియా నమూనాలో పోరు ముగియవచ్చని చెబుతున్నారు. 1950 దశకంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి ఒకే దేశంగా ఉండాల్సిన కొరియా రెండు భూభాగాలుగా ఉంది తప్ప సాంకేతికంగా యుద్ధ విరమణ ఒప్పందం ఇప్పటికీ లేదు. దక్షిణ కొరియా రక్షణకు హమీ ఉన్నట్లుగా ఉక్రెయిన్‌కు నాటో రక్షణ హామీని రష్యా ఎట్టి పరిస్థితిలో అంగీకరించదు గనుక అది కూడా జరగక పోవచ్చన్నది మరో వాదన. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైన తరువాత చైనా -రష్యా సంబంధాలు మరింత బలపడటమే గాక రెండూ దగ్గ రయ్యాయి. అంటే ప్రచ్ఛన్న యుద్ధకాలంలో మాదిరి రెండు శిబి రాలుగా ప్రపంచం చీలిందని సూత్రీకరించేవారు కూడా లేకపోలేదు. తటస్థంగా ఉన్నా, ఆయుధాలను సరఫరా చేయకున్నా, పశ్చిమ దేశాల ఆంక్షల ప్రభావం నుంచి తప్పించేందుకు చైనా ఇటీవలి కాలం లో రష్యా నుంచి తన దిగుమతులను పెంచుకొన్నది.ఈ పరిణా మంతో అట్లాంటిక్ ప్రాంత దేశాలు వీటికి వ్యతిరేకంగా దగ్గర అవుతు న్నాయి. రక్షణ బడ్జెట్లను, మిలిటరీని పెంచుతున్నాయి.గత ప్రచ్ఛన్న యుద్ధానికి ఇప్పటిదానికి చాలా తేడా ఉన్నది. సోవియట్-చైనా బంధం కంటే ఇప్పుడు చైనా-రష్యా బంధం ఎంతో ప్రాధాన్యత కలిగింది.నాడు చైనా ఆర్థికంగా మిలిటరీ రీత్యా నేటి మాదిరి బలం కలిగి లేదు. గతంలో సోవియట్-చైనా మధ్య ఉన్న విబేధాలను అమెరికా వినియోగించుకుంది, ఇప్పుడు అలాంటి అవకాశం లేదు.

> ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే ఏ పక్షమూ గెలిచే లేదా ఓడిపోయే స్థితి లేదని మరికొంతకాలం కొనసాగుతుదంటున్నవారు కొందరు. గతేడాది ఆర్భాటం చేసి ప్రారంభించిన ఎదురుదాడిలో మొత్తంగా చూసినపుడు ఉక్రెయిన్‌కు మరిన్ని నష్టాలు, కొత్త ప్రాంతాలను కోల్పోవటం, ఆత్మరక్షణలో భారీ సంఖ్యలో ప్రాణాలను బలిపెడుతున్నది. మరోవైపు రష్యా కూడా ప్రాణాలను పెద్ద సంఖ్యలో కోల్పోవటంతో పాటు యుద్ధ సామగ్రిని కూడా భారీగా నష్టపోతున్నది. రానున్న ఎన్నికల కారణంగా పెద్ద సంఖ్యలో మిలిటరీ రిక్రూట్‌మెంట్లు కూడా చేసే పరిస్థితి లేదు. జనాభా రీత్యా తక్కువ సంఖ్య ఉన్న ఉక్రెయిన్‌కు ఇంకా కష్టం.

ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే ఏ పక్షమూ గెలిచే లేదా ఓడిపోయే స్థితి లేదని మరికొంతకాలం కొనసాగుతుదంటున్న వారు కొందరు. గతేడాది ఆర్భాటం చేసి ప్రారంభించిన ఎదురుదాడిలో మొత్తంగా చూసినపుడు ఉక్రెయిన్‌కు మరిన్ని నష్టాలు, కొత్త ప్రాంతాలను కోల్పోవటం, ఆత్మరక్షణలో భారీ సంఖ్యలో ప్రాణాలను బలిపెడుతున్నది. మరోవైపు రష్యా కూడా ప్రాణాలను పెద్ద సంఖ్యలో కోల్పోవటంతో పాటు యుద్ధ సామగ్రిని కూడా భారీగా నష్టపోతు న్నది. రానున్న ఎన్నికల కారణంగా పెద్ద సంఖ్యలో మిలిటరీ రిక్రూట్‌మెంట్లు కూడా చేసే పరిస్థితి లేదు. జనాభా రీత్యా తక్కువ సంఖ్య ఉన్న ఉక్రెయిన్‌కు ఇంకా కష్టం. పశ్చిమ దేశాలు ఊహించినదానికి భిన్నంగా పుతిన్ తనకు కావాల్సిన ఫిరంగి గుండ్లు ఇతర వాటిని ఇరాన్, ఉత్తర కొరియా నుంచి పొందుతున్నాడు. ఉక్రె యిన్‌కు నాటో సరఫరాలు సరేసరి. ఉక్రెయిన్ లొంగు బాటు తప్ప మరే చర్చలు లేవని పుతిన్ తెగేసి చెప్పాడు. పదేండ్ల నాడు కోల్పోయిన క్రిమియాతో సహా అన్ని ప్రాంతాలను తిరిగి తమకు అప్పగిస్తే తప్ప రాజీ లేదని జెలెన్‌స్కీ చెప్పటం, ఈ ఏడాది నవం బరులో అమెరికా ఎన్నికలు ఉన్నందున ఏడాది పొడవునా పోరు కొనసాగవచ్చు.

> రెండేండ్ల ఈ సంక్షోభాన్ని స్థూలంగా చూసినపుడు ఉక్రెయిన్‌పై రష్యా పట్టు మరింత బిగిసింది. భారీ ఎత్తున ఆయుధాలు ఇచ్చిన పశ్చిమ దేశాలు ప్రచారం చేసిన మాదిరి ఉక్రెయిన్ ఎదురుదాడులు ఎలాంటి ఫలితాన్నివ్వలేదు. రెండు వైపులా ఎందరు మరణించిందీ ఇంతవరకు విశ్వసనీయమైన ఆధారాల్లేవు.లక్షల్లో ప్రాణ నష్టం ఉంటుందని భావిస్తున్నారు. రష్యా మీద ప్రకటించిన ఆర్థిక, ఇతర ఆంక్షలు దేనికీ కొరగాకుండా పోయాయి.ఈ సంక్షోభం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో తెలియదు.ఉక్రెయిన్ ఎక్కువ కాలం ప్రతిఘటన సాగించలేదని, పశ్చిమ దేశాల్లో వైరుధ్యాల గురించి పుతిన్, రష్యా గురించి పశ్చిమ దేశాలు వేసుకున్న తొలి అంచనాలు తప్పాయి.

మోడీ ఇచ్చే 'మోడీ గ్యారంటీ'

- కర్లపాలెం భాస్కర్‌రావు
9676457732

జనవరి 22న అయోధ్యలో రాములల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమం దేశ ప్రధానిగా ఉన్న మోడీ చేతుల మీదుగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయటంలో అయోధ్య రామ మందిరం నిర్వాహకులే కాకుండా ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వాధి నేతలు మోడీ అనుకూల మీడియా ఛైకూన్లు 'యమ' పోటీపడ్డారు. స్వాతంత్ర్యం తరువాత మనం రాసుకొని, మనం మనకే అంకితమిచ్చుకున్న రాజ్యాంగంలో 'సెక్యులర్' అన్న పదమే లేనట్టుగా వీరు ప్రవర్తించారు. 1947 ఆగస్టు 15 ఎర్రకోటపై జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ జెండాను ఎగరేసిన రోజుతో సమానంగా ఈ కాషాయ జెండా కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటి మీద కాషాయ జెండాలు ఎగురవేయమన్నారు. ప్రతి గుడిలోను పూజలు చేయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆఫీసులకు, స్కూళ్లు కాలేజీలకు రోజు సగం సెలవు, పూర్తి సెలవు ప్రకటించారు. ఊరూరా రాముడి శోభాయాత్ర ఊరేగింపులు నిర్వహించారు.

నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవెయ్యరు అనే విమర్శకు సమాధానంగా ఇకముందు దేశంలో మేమున్నంతకాలం ఎగరబోయేది కాషాయ జెండానే అని ఈ కార్యక్రమాలు సూచిస్తున్నట్టుగా లేదూ? హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, కలిసిమెలసి జీవిస్తున్న ఈ భారతదేశంలో ఇటువంటి ఒక కార్యక్రమంలో పాల్గొనటం కోసం ప్రధాని ఉపవాస దీక్ష చేపట్టటం, గుళ్లు గోపురాలు సందర్శించడం, ఆలయాల పరిసరాలు శుభ్రం చేయటం - ఇవన్నీ దానికి సూచనలే కదా. ప్రభుత్వం ప్రత్యక్షంగా నిర్వహిస్తున్న ఈ మత కార్యక్రమాన్ని వామపక్షాలతో పాటు అనేక ప్రతిపక్ష నేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిష్కరించారు. అంటే వీరెవరికి దేశంలో మతసామరస్యం అక్కరలేదా అనే సందేహం చాలామందికి కలిగింది. వారంతా ప్రాణ ప్రతిష్ట తర్వాత దేశంలో ఎటువంటి మతకల్లోలాలు జరగవనే ఆశలో ఉన్నారు.

ప్రాణప్రతిష్ట తర్వాత జరిగిన ప్రసంగంలో మోడీ చెప్పింది ఏమిటి? రామ మందిరం శాంతికి, సహనానికి, సామరస్యానికి, సమన్వయానికి చిహ్నం అని కదా చెప్పింది. రాముడు వివాదం కాదు సమాధానం అని కూడా అన్నారు. ప్రజలలో ఆశలు ఏర్పడడానికి మోడీ ప్రసంగం ఒక కారణం. కొన్ని మీడియా సంస్థలు అయితే ఏకంగా రామరాజ్యమే ప్రతిష్ఠాపనమైనట్లు ప్రకటించాయి. బాబ్రీ మసీదు వివాదంపై కోర్టు తీర్పు సహేతుకంగా లేదని న్యాయనిపుణులు విమర్శించినా, రామ మందిర నిర్మాణంతో ఈ వివాదం ముగిసినట్లేనని, ప్రజల మధ్య మళ్లీ శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తాయని అన్ని మతాలవారు, దేశ ప్రజలు ఆశించారు. తీర్పు కూడా అటువంటి భావననే కలిగించింది.కానీ జరిగిందేమిటి?

మోడీ తన ప్రసంగంలో ఏమి చెప్పినా, ప్రతిష్ట అనంతరం జరుగుతున్న సంఘటనలు ఇంతకు మునుపు జరిగిన వాటికి కొనసాగింపుగానే ఉన్నాయి.ప్రాణ ప్రతిష్టకు ముందు రోజు అనేక చోట్ల హిందూత్వ సంస్థలు ఊరేగింపులు తీశాయి. కొన్ని ప్రాంతాలలో మసీదుల మీద బలవంతంగా కాషాయ జెండాలు ఎగరవేశారు. హైదరాబాద్‌లో ఒక రెస్టారెంట్‌లో ఆనంద పట్వర్ధన్ ' రామ్ కె నామ్' డాక్యుమెంటరీని సినీఫిలిస్ వారు ప్రదర్శించారు. ఆ ప్రదర్శన సగం కూడా కాకుండానే హిందుత్వ మూకలు ఆ రెస్టారెంట్లోకి చొరబడి, తెరను చించేశాయి. ప్రదర్శించటానికి వీలులేదని నిర్వాహకులతో ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసి ప్రదర్శన నిర్వాహకులను నలుగురిని అరెస్ట్ చేశారు. అల్లరి మూకను మాత్రం వదిలేశారు. నిషేధించబడని డాక్యుమెంటరీని ప్రదర్శించడం కూడా తప్పు అయిపోయింది. అరెస్ట్ అయిన నిర్వహకులు తమ లాయర్లను కలవడానికి కూడా పోలీసులు అనుమతించలేదు.

మరో పెద్ద సంఘటన ముంబై శివారులోని మీరా రోడ్‌లో జరిగింది. ప్రాణ ప్రతిష్ట ముందు రోజున హిందూ మూకలు తీసిన ఊరేగింపుపై దాడి జరిగిందనే నెపంతో ముస్లింలపై, వారి దుకాణాలపై దాడి జరిగింది. ఇది జనవరి 21 నుంచి 25 దాకా సాగింది. హిందువులు, ముస్లింలు పరస్పరం కేసులు పెట్టుకొన్నారు. హిందూత్వ వాదులు పెట్టిన కేసులపై ముస్లింలను అరెస్ట్ చేశారు కానీ, ముస్లింలు పెట్టిన కేసుల్లో పోలీసులు ఎటువంటి అరెస్టులు లేవు. ఆ తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముస్లింల పేరుతో ఉన్న షాపులపై బుల్డోజర్ నడిపారు. దుకాణాల నేమ్ బోర్డులను తొలగించారు. మీరా రోడ్‌లో జరిగిన సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లోనే బీజేపీ ఎమ్మెల్యే నితీష్ రాణే తనకు అనుకూలంగా వుండే విలేకర్లతో పత్రికా సమావేశం నిర్వహించారంటే పోలీసుల వైఖరేమిటో అర్థమవుతుంది. ఇక్కడ ఉన్నది 'డబుల్ ఇంజన్' సర్కారే అన్నది మర్చిపోకూడదు.



> పరిశీలనగా చూస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఇటువంటి మతపరమైన దాడులు, వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతేకాదు ఈ దాడులు, వేధింపులలో రాష్ట్ర ప్రభుత్వాల చురుకైన మద్దతు ఉండటం మరింత విషాదం కలిగిస్తుంది. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఇటువంటి ఘటనలు తక్కువగా జరగడమే గాక, హిందుత్వం మూకలను కట్టడి చేయడానికి ఆ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. పార్లమెంట్ లోపలా, బయట బహిరంగ సభలోనూ 'మోడీ గ్యారంటీ' గురించి మోడీ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. దేశంలో జరుగుతున్న ఘటనలు పరిణామాలు చూస్తుంటే మోడీ గ్యారంటీ అంటే, మైనార్టీల ప్రాణాలు, ఆస్తులు, బతుకుదెరువులపై దాడులు, వేధింపులు తప్ప మరొకటి కాదు, రామరాజ్యం అసలే కాదు.

మీరా రోడ్డు ఘటనను మించిన మరొక సంఘటన 'డబుల్ ఇంజిన్' ఏలుబడిలో ఉన్న ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీలో ఫిబ్రవరి 8న జరిగింది. అక్రమంగా ఆక్రమించిన స్థలంలో మసీదు, మదరస కట్టారనే ఆరోపణపై వాటిని కూల్చడానికి బుల్డోజర్లతో మున్సిపల్ అధికారులు వచ్చారు. మసీదు, మదరసా కట్టిన స్థలం వివాదం అప్పటికే కోర్టు పరిధిలో ఉంది. అయినా కూల్చడానికే అధికారులు సిద్ధమయ్యారు. ముస్లిం ప్రజానీకం తిరగబడ్డారు. పోలీసులు ఇండ్లల్లోకి చొరబడి మహిళలని కూడా చూడకుండా అందర్నీ కొట్టారు. ఘర్షణలో ఆరుగురు ముస్లింలు చనిపోయారు. దాదాపు 30 మందిని అరెస్ట్ చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో కూల్చివేతలయితే ఆగినాయిగానీ, ఈ దాడికి భయపడి అనేక కుటుంబాలు ఇండ్లు విడిచిపోయాయి.'ఉత్తరాఖండ్ దేవ భూమి అని, ఇక్కడ ఇతర మతస్తులకు చోటు లేదని' సాక్షాత్తు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రకటించడం కూడా ఇతర మతస్తుల ఉనికిని ప్రమాదంలో పడేసింది.

ఈ సంఘటనలే కాదు ఇటువంటి అనేకం ప్రతిరోజు జరుగుతున్నట్లు పేపర్లు వార్తలు ఇస్తున్నాయి. మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న వస్తే, జైపూర్‌లోని హవా మహల్ అసెంబ్లీ నుంచి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే బాల ముకుంద్ ఆచార్య అనే స్వామి వారు జైపూర్ వీధుల్లో ముస్లిం దుకాణాలన్నీ మూసివేయాలని హుకుం జారీ చేశాడు. పైగా ఇది కరాచీ కాదు, మాకు ఇష్టమైన కాశీ అని కూడా అన్నాడు. క్షత్రియుడైన రాముడు మాంసం తిన్నాడో లేదో అనేది వేరే విషయంగానీ, రామరాజ్యంలో ప్రజలు మాంసం తినకుండా ఉన్నారా? మోడీ తెచ్చిన రామరాజ్యంలో మాంసాహారం నిషేధం. హిజాబ్ ధరించినందుకు కర్నాటకలో ముస్లిం విద్యార్థినులను వేధించినట్టుగానే, రాజస్థాన్ బిజెపి ప్రభుత్వం కూడా ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి కూడదనే నిబంధన పెట్టాలని భావిస్తున్నట్టు పత్రికలు రాశాయి.త్రిపురలో ఒక క్రైస్తవ మైనారిటీ పాఠశాలయిన డాన్ బాస్కో స్కూల్లో సరస్వతీ పూజ చేయాలని హిందూ జాగరణ మంచ్ ఆ స్కూల్ ప్రిన్సిపాల్ పై ఒత్తిడి తెచ్చింది. గత్యంతరం లేక ఆ స్కూల్ ప్రిన్సిపాల్ హిందూ మూకల నుంచి రక్షణకోసం పోలీసులను ఆశ్రయించాడు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే. మోడీ ప్రచారం చేసుకునే 'డబులింజన్' ప్రభుత్వాలే.

ఇటువంటి సంఘటనలు రోజూ వార్తాపత్రికలలో దర్శనమిస్తూనే ఉన్నాయి. పరిశీలనగా చూస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఇటువంటి మతపరమైన దాడులు, వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతేకాదు ఈ దాడులు, వేధింపులలో రాష్ట్ర ప్రభుత్వాల చురుకైన మద్దతు ఉండటం మరింత విషాదం కలిగిస్తుంది. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఇటువంటి ఘటనలు తక్కువగా జరగడమే గాక, హిందుత్వం మూకలను కట్టడి చేయడానికి ఆ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. పార్లమెంట్ లోపలా, బయట బహిరంగ సభలోనూ 'మోడీ గ్యారంటీ' గురించి మోడీ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. దేశంలో జరుగుతున్న ఘటనలు పరిణామాలు చూస్తుంటే మోడీ గ్యారంటీ అంటే, మైనార్టీల ప్రాణాలు, ఆస్తులు, బతుకుదెరువులపై దాడులు, వేధింపులు తప్ప మరొకటి కాదు, రామరాజ్యం అసలే కాదు. ఇటువంటి భారతదేశాన్ని మనం కోరుకుందామా? రాజకీయాలను, మతాలను వేరుగా వుంచే భారతదేశాన్ని కోరుకుందామా?

రైతులపై అణచివేత

ఎలక్టోరల్ బాండ్లలో అవినీతిని బహిర్గతం చేయాలి

మోడీ ప్రభుత్వ రాతపూర్వక హామీని అమలు చేయాలి : వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-ముషీరాబాద్

రైతులపై అణచివేత కొనసాగుతోంది.. మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఎలక్టోరల్ బాండ్‌లపై సుప్రీం కోర్టు తీర్పు ద్వారా వెల్లడైన కార్పొరేట్ అవినీతిని బహిర్గతం చేయాలి.. అని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. దేశ రాజధాని సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న రైతుల ఉద్యమానికి మద్దతుగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ నిరసనలో వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, జక్కుల వెంకటయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడారు.

సంయుక్త కిసాన్ మోర్చాతో 9 డిసెంబర్ 2021న కేంద్రంతో జరిగిన చర్చల్లో.. చట్టబద్ధంగా పంటల సేకరణ, సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లు, లఖింపూర్ ఖేరీలో రైతుల ఊచకోతకు ప్రధాన కుట్రదారు హెూంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను తొలగించడం, ప్రాసిక్యూట్ చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. వాటి అమలు కోసం తిరిగి ఆందోళన నిర్వహిస్తున్న రైతులపై పంజాబ్ సరిహద్దులో అణచివేత కొనసాగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, అణచివేత, నియంతృత్వ వైఖరిని ఖండించాలన్నారు. కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు, లేబర్ కోడ్‌లు, విద్యుత్ చట్టం సవరణలు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లు, లాభదాయకమైన పబ్లిక్ సెక్టార్ల విక్రయాలు, ఇలాంటి అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని చెప్పారు. ప్రభుత్వ వనరులన్నింటినీ కార్పొరేట్ కుబేరులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలక్టోరల్ బాండ్‌లపై సుప్రీం కోర్టు తీర్పు ద్వారా వెల్లడైన కార్పొరేట్ అవినీతిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అవినీతిని చట్టబద్ధం చేసి, పార్టీ ఫండ్‌గా వేల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం పోగు చేసిందని ఆరోపించారు. బీజేపీ అవినీతిని చట్టబద్ధం చేయడం ద్వారా వేల కోట్లను కూడబెట్టిందన్నారు. విరాళాల జాబితాలో బీజేపీ, ఇతర పార్టీలకు జమ అయిన మొత్తాన్ని తప్పనిసరిగా బహిరంగపరచాలని, రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహారావు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ చిత్రపటానికి వినతి

సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మోడీ చిత్రపటానికి మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఆకుల పాపయ్య, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

వారం రోజులుగా ఢిల్లీ పరిసర ప్రాంతంలో, హర్యానాలో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. గత రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోండి

- అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ ఉద్యోగాలకు సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని అభ్యర్థులను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కోరింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని పోస్టులకు సంబంధించి ఇప్పటికే జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటించామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అందుకవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈడబ్ల్యూఎస్, బీసీలు నాన్ క్రీమిలేయర్, వికలాంగులు, విద్యా సంబంధమైనవి, నివాస ధ్రువీకరణ పత్రం, రిజర్వేషన్ ఉన్న వారు అందుకు సంబంధించినవి, విద్యార్హతలు, తత్సమాన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.

ఆత్మగౌరవ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమం

వికలాంగులకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలి : ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు



నవతెలంగాణ - ముషీరాబాద్

రాజ్యాంగ పరిరక్షణ, ఆత్మగౌరవ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు అన్నారు. వికలాంగులకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయం వద్ద ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో పౌరులం దరూ సమానమే, ఎలాంటి వివక్షతలూ పాటించ రాదు.. సమాన అవకాశాలు, హక్కులు ఉన్నాయని పేర్కొన్నా వికలాంగులకు సమాన హక్కులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలనే కుట్రను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల చట్టాలను మార్చడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. 2015లో ప్రధాని మోడీ మన్‌కి బాత్ కార్యక్రమం ద్వారా వికలాంగులను దివ్యాంగు లని ప్రకటించాలని, కానీ పదేండ్ల కాలంలో వికలాంగులకు అదనంగా చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 12.2 శాతం వికలాంగులు ఉన్నారని, వీరిలో 2024 జనవరి నాటికి 5,14,422 మందికే ఆసరా పింఛన్లు వస్తున్నాయని తెలిపారు. ఎన్‌పీఆర్‌డీ పోరాటాల ఫలితంగా వికలాంగులను ప్రభుత్వం గుర్తించే పరిస్థితి వచ్చిందన్నారు. యూనివర్సిటీలో చదివే వికలాంగ విద్యార్థులకు లాప్‌టాప్, ఫోర్‌జి స్మార్ట్ ఫోన్స్, అడ్మిషన్స్‌లో రిజర్వేషన్స్ అమలు చేయాలని పోరాడి సాధించుకున్నామని వివరించారు. ఉపాధి హామీ చట్టంలో ప్రత్యేకంగా వికలాంగులకు 150 రోజుల పని దినాలు కల్పించాలని పోరాడి సర్క్యులర్ సాధించామని చెప్పారు. మహిళా వికలాంగుల సాధికారత, భద్రత కోసం కూడా పోరాటాలు చేస్తున్నామన్నారు.

ఫిబ్రవరి 21నుంచి 28వరకు సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర నాయకులు యూసఫ్, శివశంకర్, రాజు, గంగమ్మ, నర్సింగ్ రావు, వరప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలపీరు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

జగజ్యోతికి రిమాండ్

- ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు



(ఫైల్)

నవతెలంగాణ-మెహిదీపట్నం

కాంట్రాక్టర్ నుంచి రూ. 84 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిన ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగ జ్యోతికి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం రిమాండ్ విధించింది. రెండ్రోజుల కిందట ఆమెను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కోర్టుకు తీసుకొని వెళు ్తండగా తనకు గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అక్కడి వైద్యులు ఆమెకు చికిత్స అందించి ప్రమాదం ఏమీ లేదని చెప్పారు. దాంతో ఆమెను బుధవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ముందు హాజరు పరిచారు. అయితే ఆమెను అరెస్టు చేసిన 24 గంటల లోపల ఎందుకు హాజరు పరచలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఏసీబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివరించి దీనికి సంబంధించి కోర్టులో ముందుగానే మెమో దాఖలు చేసినట్టు తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం అధికారులు ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ఆమె ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు జరిపి స్వాధీనపరుచుకున్న ఆస్తులు, బంగారం మార్కెట్ విలువ ప్రకారం రూ.15 కోట్లపైనే ఉంటుందని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు కూడా నమోదు చేయనున్నట్టు తెలిపారు.

జేఎన్టీయూహెచ్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ గూండాల దాడి

ఖండించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జేఎన్టీయూహెచ్ కూకట్ పల్లి క్యాంపస్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులపై ఏబీవీపీ గూండాల దాడిని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జేఎన్టీయూహెచ్‌లో విద్యార్థుల సమస్యలను తెలుకోవడానికి ఎస్ఎఫ్ఐ బృందం వెళ్లిందని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వస్తున్న సందర్భంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో ఏబీవీపీ నాయకులు దిలీప్‌తోపాటు ఇతరులు ఘర్షణకు దిగారని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌పై బూతులు తిడుతూ 12 మంది ఏబీవీపీ నాయకులు దాడిచేసి చొక్కా చించి గాయపరిచారని తెలిపారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. గతకాలంగా జేఎన్టీయూహెచ్‌లో ఏబీవీపీ ఆరాచకాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై ఓర్వలేక దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ దాడులకు పాల్పడ్డారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నికరంగా పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ ఎదుగుదలను చూసి ఓర్వలేక భౌతికంగా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏబీవీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు సమస్యలపై పోరాడాలని సూచించారు.

పోరాడే నాయకులపై భౌతిక దాడులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ దాడులకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు. ఇకనైనా దాడుల సంస్కృతిని ఏబీవీపీ మానుకోవాలనీ, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మోడీ సర్కారు క్రూరత్వం వల్లే...

శుభ్‌కరణ్‌సింగ్ మృతిపై తెలంగాణ రైతు సంఘం ఆవేదన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ రాజధాని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వ కాల్పులను తెలంగాణ రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ క్రూరత్వానికి బాధ్యులైన పోలీసు సిబ్బందిని తొలగించాలని డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఖనౌరీ సరిహద్దు సమీపంలో హర్యానా పోలీసుల చర్యలో మరణించిన 24 ఏండ్ల రైతు శుభ్ కరణ్ సింగ్ మృతికి వారు ఈ సందర్భంగా సంతాపం తెలపారు. పోలీసుల రబ్బర్ బుల్లెట్ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సింగ్ పాటియాలాలోని ప్రభుత్వ రాజేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అతని మరణానికి మోడీ సర్కారు క్రూరత్వమే కారణమని తెలిపారు. ఇప్పటివరకు ఆందోళన చేస్తున్న వారిలో ఇద్దరు రైతులు గుండెపోటుతో మరణించారని పేర్కొన్నారు. తమది రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పుకుంటూనే మోడీ తన క్రూరత్వాన్ని బయటపెట్టారని విమర్శించారు. హర్యానాలోని మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను శత్రు సైనికుల్లా చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అనాగరిక హింసకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్‌తో అనిల్‌కుమార్ భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన రేవంత్‌ను తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎంకు శాలువా కప్పి సత్కరించారు. చిన్న వయసులోనే పెద్దల సభకు వెళ్ళే అవకాశం కల్పించినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంతో బీజేపీ ఎమ్మెల్యే హరీష్ భేటీ



సీఎం రేవంత్‌రెడ్డితో బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో వారు ఆయన్ను కలిశారు. సీఎంను కలవడంతో వారు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జోరందుకున్నది.

శ్రీకాంతాచారి మరణానికి కేసీఆర్, హరీశే కారణం

- కాంగ్రెస్ నేత గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి మరణానికి కేసీఆర్, హరీశ్‌రావే కారణమని కాంగ్రెస్ సీనియర్ నేత గజ్జల కాంతం ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో యువతను వారు రెచ్చగొట్టడం వల్లే వందలాది బలిదానాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుని కేసీఆర్ అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. పదేండ్ల పాలనలో ఎంత మంది అమరవీర కుటుంబాలను ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కల్వకుంట్ల కుటుంబంలో ఎవరైనా చనిపోయారా? అని ప్రశ్నించారు.

వక్ఫ్‌బోర్డు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన అజ్మతుల్లా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మెన్‌గా అజ్మతుల్లా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్‌గాంధీతో కాంగ్రెస్ నేత ప్రవీణ్ చింత భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నేత ప్రవీణ్ చింత కలిశారు. భారత్ జోడో న్యాయ యాత్రలో ఉన్న రాహుల్‌ను ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో కలిసి సంఘీభావం తెలిపారు. అమెరికా, యూకే, కెనడా, జర్మనీ, సింగపూర్ నుంచి వచ్చిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు కూడా రాహుల్‌ను కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అమెరికా శాఖ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్జియన్, ఏఐసీసీ కార్యదర్శి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఆరతి క్రిష్ణ తదితరులను కూడా ప్రవీణ్ ఈసందర్భంగా కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ (ఎస్సీ) లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ టికెట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు.

పసుపు బోర్డు తేలే...షుగర్ ఫ్యాక్టరీ తెరవలే..

- ఎంపీ అరవింద్‌పై అన్వేష్‌రెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
బీజేపీ నేత, ఎంపీ అరవింద్‌కుమార్ గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గెలిచారని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి విమర్శించారు. ఆ తర్వాత ఐదేండ్లలో నిజామాబాద్ రైతులకు పసుపుబోర్డు తీసుకరాలేదనీ, నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవలేదని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని అరవింద్, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. పసుపు రైతుల సమస్యలను పరిష్కరించకుండా అరవింద్ మోసం చేశారని విమర్శించారు. ఆ పంటపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అవగాహన లేదంటూ మాట్లాడం సరైందికాదన్నారు. మరోసారి ప్రభుత్వంపైగానీ, మంత్రిపైగానీ విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ ఆరో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆధునిక పద్ధతుల్లో వెన్నుముక, మోకాళ్ల నొప్పులకు చికిత్స : డాక్టర్ శివ ప్రసాద్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వెన్నుముక, మోకాళ్ల నొప్పులకు తమ ఆస్పత్రిలో నాణ్యమైన చికిత్స అందిస్తున్నట్టు డాక్టర్ శివ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని'అడ్వాన్స్ స్పైన్ అండ్ నీ' ఆస్పత్రి 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఆర్పీ చికిత్సతో మోకాళ్ల నొప్పులకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గతంలో మోకాళ్ల నొప్పి ఉండి పీఆర్పీ ఇంజెక్షన్ తీసుకున్న వారంతా ఐదేండ్ల నుంచి ఎలాంటి నొప్పులు లేకుండా తమ పనులు తాము చేసుకోగలుగుతున్నారని తెలిపారు. 2015 నుంచి 37 వేల మందికిపైగా ఆపరేషన్‌తో పని లేకుండా, మోకాలు, నడుము, భుజము తదితర మొండి నొప్పులకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, స్టెరాయిడ్స్ వాడకుండా కూల్డ్ ఆర్ ఎఫ్, పీఆర్పీ చికిత్స అందించినట్టు తెలిపారు. ఇన్సూరెన్స్ ఉన్న వారికీ వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. వాట్సప్‌లో తమ రిపోర్టులను పంపించే వారికి నెల రోజులపాటు ఉచిత కన్సల్టేషన్ సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. చికిత్స వివరాల కోసం 63090 90900, 91004 99070లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు పలువురు పేషెంట్లు మీడియాతో తమ అనుభవాలను పంచుకున్నారు.

జీవో 3 పునరుద్ధరణ కోసం ఆర్డినెన్స్ తేవాలి

- బస్సుయాత్ర పేరుతో ఆదివాసీలపై బీజేపీ కపటప్రేమ : టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువతకు ఉద్యోగాల్లో వందశాతం రిజర్వేషన్ కల్పించే జీవో నెంబర్ మూడును పునరుద్ధరించేందుకు రాష్ట్రపతి ద్వారా ఆర్డినెన్స్‌ను జారీ చేయించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు దేశంలోని అడవిని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్న బీజేపీ మరోవైపు ఆదివాసీలపై ప్రేమ ఉన్నట్టు కొమురం భీం పేరుతో ఎన్నికల యాత్ర చేస్తే తాము నమ్మాలా?అని ప్రశ్నించారు. సహజ వనరులను దోపిడీ చేస్తూ కొన్ని వందల ఏండ్ల నుంచి బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం ఈ పదేళ్ల పాలనలో కాలరాసిందని విమర్శించారు. ఎన్నికల బస్సుయాత్రకు కొమురం భీం పేరు పెట్టే అర్హత బీజేపీకి లేదన్నారు. నూతన అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించడన్ని ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఆదివాసీలకు వేసవిలో పని కల్పించే ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని కల్పించి కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ విడుదల చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ వేయాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు తొడసం భీంరావ్, బండారు రవి కుమార్, సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, పొలం రాజేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోరెంగా మాలశ్రీ, ఉయిక విష్ణు, ఆత్రం తనుష్, మడవి నాగోరావ్, లంక రాఘవులు, కోట శ్రీనివాస్, గొంది రాజేష్, సూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

- విద్యాశాఖ కమిషనర్‌కు అభ్యర్థుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను బుధవారం హైదరాబాద్‌లో అభ్యర్థులు మఠం శివానంద స్వామి, శశిధర్, హరీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ రాకముందే డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించాలని కోరారు. త్వరలో ఉద్యోగ విరమణ ద్వారా అయ్యే ఖాళీలనూ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పీఈటీ, లైబ్రరియన్, ఆర్ట్, క్రాఫ్ట్ ఖాళీలనూ చేర్చాలని సూచించారు.

ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం 2014 వరకు బీఈడీ, డీఈడీలో ప్రవేశం పొందిన వారికి డిగ్రీ, ఇంటర్‌లో వచ్చిన మార్కుల పర్సెంటేజీతో సంబంధం లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్‌లో అర్హత కల్పించాలని తెలిపారు. రాతపరీక్షలను ఏప్రిల్ లేదా మేలో నిర్వహించాలని కోరారు.

గ్రూప్-1లో తెలుగు అర్హత పరీక్ష నిర్వహించాలి

గ్రూప్-1 మెయిన్స్‌లో తెలుగు అర్హత పరీక్షలను నిర్వహించాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం వారు బహిరంగ లేఖ రాశారు. గ్రూప్-1 మెయిన్స్‌లో ఇంగ్లీష్‌కు మాత్రమే అర్హత పరీక్షను నిర్వహించి మాతృభాష తెలుగును విస్మరించడం సరైంది కాదని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లోని అభ్యర్థులు తెలుగు మాధ్యమంలో చదువుతారనీ, వారినీ పరిగణనలోకి తీసుకుని ఇంగ్లీష్‌తోపాటు తెలుగుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్
రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని బీఆర్ఎస్ కోరింది. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు. ఎండాకాలంలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో అందుకు తగినట్టు ఓటర్లకు సదుపాయాలు కల్పించాలనీ, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఒక కుటుంబంలో సభ్యులందరికీ ఒకే బూత్‌లో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకటే ఎపిక్ నెంబర్‌తో రెండు రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉన్న వాటిని సరిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ దాడుల నుంచి ప్రతిపక్ష పార్టీల నేతలకు భద్రత కల్పించాలనీ, సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాలని ఎన్నికల అధికారులను కోరారు.

సుప్రీం తీర్పు...బీజేపీకి చెంపపెట్టు

- ఆప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఛండీగడ్ మేయర్ ఎన్నిక విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంపపెట్టు అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఆ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి కుల్దీప్ కుమారను విజేతగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ దుష్ట చర్యల నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఆ పార్టీ దుర్మార్గపు చర్యల కారణంగా సుప్రీం కోర్టు గదిలో మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరపాల్సి వచ్చిందని తెలిపారు. బీజేపీ దిగజారుడు రాజకీయాలు, అవకతవలకు పాల్పడి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యనికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారీ, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు మందుల అమ్మకం

- నకిలీ క్లినిక్‌లో ఔషధాల నిల్వ
- డీసీఏ దాడులు...స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా అధిక ధరలకు అమ్ముతున్న మందులను గుర్తించి సీజ్ చేశారు. అదే విధంగా అర్హత లేకుండా క్లినిక్ నడుపుతున్న వాటిపై దాడి చేసి అక్కడ నిల్వ ఉన్న ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. మెరోంప్ 1000 ఇంజక్షన్‌ను నిబంధనల ప్రకారం రూ.952.68కు ధరను నిర్ణయించారు. జీఎస్టీ 12 శాతం కలుపుకున్నా... రూ.1,067కు మించకూడదు. అయితే దానిపై రూ.2,433 అదనంగా అంటే రూ.3,500గా లేబుల్ పెట్టి అమ్ముతుండగా హైదరాబాద్ యూసుఫ్‌గూడలో పట్టుకున్నారు. అదే విధంగా ఇట్రాడోల్ -200 ఎంజీ క్యాప్సుల్స్‌ను ఒక దాన్ని రూ.22.12కు మించకుండా అమ్మాలి. జీఎస్టీ 12 శాతంతో కలుపుకున్నా రూ.24.77కు అమ్మకం జరపాలి. అయితే దీనిపై లేబుల్ పై మాత్రం 10 క్యాప్సుల్స్ కు రూ.375 అంటే ఒక్కో దానికి రూ.37.50గా నిర్ణయించి అమ్ముతున్నట్టు రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో గుర్తించారు.

ఖమ్మం, సంగారెడ్డి జిల్లాల్లో నకిలీ క్లినిక్‌లపై దాడి

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం, గాడెపాడు గ్రామం డోర్ నెంబర్ 4-18లో నకిలీ వైద్యులు ఎండీ. ఇస్మాయిల్ నడుపుతున్న క్లినిక్‌పై దాడి చేశారు. అదే విధంగా సంగారెడ్డి జిల్లా పటానుచెరు మండలం, పాశమైలారం గ్రామం డోర్ నెంబర్ 4-24 లో నకిలీ వైద్యులు జి.నాగేశ్వర్ రావు క్లినిక్ నడుపుతున్నట్టు తెలిసి దాడి చేశారు. వీరద్దరు రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్లుగా చెప్పుకుంటూ అర్హత లేకుండా మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు గుర్తించారు. వీరిద్దరి దగ్గర నుంచి రూ.2.30 లక్షల విలువైన 150 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు.

చార్మినార్ ట్రోఫిని గెలవడం అభినందనీయం

- అలిండియా పోలీస్ ట్రోఫి విజేతలకు డీజీపీ సత్కారం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ చార్మినార్ ట్రోఫిని రాష్ట్ర పోలీసులు కైవసం చేసుకోవడం అభినందనీయమని రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవిగుప్తా కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు డ్యూటీ మీట్‌లో పతకాలు సాధించిన వారికి డీజీపీ రవిగుప్తా శాలువాలు కప్పి, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్పోర్ట్స్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర, ఏఐజీ రమణారావు, పోలీస్ డ్యూటీ మీట్ కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రానికి చెందిన పోలీసులు అన్ని విభాగాల్లో ప్రతిభను కనబర్చి తెలంగాణ ప్రతిష్టను ఇనుమడింపజేశారని తెలిపారు. వివిధ పోటీల్లో ఐదు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలు, ఫొటోగ్రఫీలో ఆలిండియా ఛాంపియన్‌షిప్‌ను, వీడియోగ్రఫీలో రన్నర్ సాధించుకోవడం సంతోషకరమని తెలిపారు. పోలీసుల్లో నిగిడీకృతమైన దర్యాప్తు అంశాలను రాటుదేల్చడానికి ఈ పోలీస్ డ్యూటీ మీట్‌లు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని పోలీస్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్‌లలో మరింత ప్రావీణ్యతను సాధించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రజలకు మేడారం జాతర శుభాకాంక్షలు

- ఆదివాసీ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక : మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
మేడారం జాతరను పురస్కరించుకుని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. మేడారం జాతర ఆదివాసీ ఆత్మగౌరవానికి, తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ వీరోచిత పోరాటం చేసి, వీరమరణం పొందినా తెలంగాణ ప్రజల గుండెల్లో సదా జీవించే ఉన్నారని తెలిపారు. ఆత్మగౌరవమే ఆభరణంగా బతుకుతున్న తెలంగాణ బిడ్డలకు సమ్మక్క, సారక్కలే స్ఫూర్తి ప్రధాతలని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ గొప్ప సంకల్పబలంతో పోరాటం చేసి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడారని కొనియాడారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరగా నిలవడం తెలంగాణ ఖ్యాతిని, జాతర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నదని పేర్కొన్నారు. జాతరకు సంబంధించి తమ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసిందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు 24 గంటలు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మేడారం జాతరకు జాతీయ హోదా తేలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ హోదా తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ, గుండెల నిండా భక్తితో అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇండ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కర్నాటకను నిలువరించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
కర్నాటకలోని రాయచూర్ జిల్లాలో చిక్కమంచిలి వద్ద మరో రిజర్వాయర్ నిర్మాణానికి అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దీన్ని అడ్డుకోవాలనీ, ఇందు కోసం అక్కడి ప్రభుత్వం మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నల్లమల బిడ్డనని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు నీళ్లు రాని పరిస్థితి ఏర్పడకుండా చూసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్థన్‌తో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 90 శాతం పనులను పూర్తయ్యాయనీ, ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీతో వచ్చే పనులు అపిన కాంగ్రెస్ సర్కార్ కొత్త ప్రాజెక్టులను చేపట్టిందని విమర్శించారు. రూ.2,900 కోట్లతో చేపట్టిన ఆయా ప్రాజెక్టులతో లక్ష ఎకరాలకు మాత్రమే సాగునీరు వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ కాలయాపనతో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చే విషయంలో మోసం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు మీద భారం మోపొద్దంటూ ఆంధ్రా నేతలు చేస్తున్న ప్రచారంతో జూరాల మీద భారం మోపడం సరికాదని తెలిపారు. ఉద్దండాపూర్ నుండి కరివేన వరకు వెంటనే కాలువలు తవ్వాలని డిమాండ్ చేశారు. తద్వారా అతి తక్కువ ఖర్చులో సాగు నీళ్లు వస్తాయని సూచించారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా తెచ్చిన దొంగ జీవోను అవగాహనారాహిత్యంతో రేవంత్ సర్కార్ అమలు చేస్తున్నదని దుయ్యబట్టారు. కరివెన వరకు నీళ్లు రావడానికి ప్రస్తుతానికి అవకాశం ఉందన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితకు మరోసారి సీబీఐ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) సమన్లు జారీ చేసింది. ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ లోని ఆమె ఇంటి అడ్రస్‌కు ఈ నోటీసులు అందినట్టు తెలిసింది. అలాగే మెయిల్ ద్వారా కూడా మరో సెట్ నోటీసులు అందించినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. అయితే ఏ సెక్షన్ కింద కవితకు సీబీఐ నోటీసులు పంపిదనేది తెలియాల్సి ఉంది. దీనిపై కవిత సైతం స్పందించాల్సి ఉంది. కాగా 2022, జూలై తరువాత మద్యం కుంభకోణం బహిర్గతం కాగా... దాదాపు ఐదు నెలల తరువాత డిసెంబర్ లో తొలిసారి సీబీఐ కవితకు నోటీసులు జారీ చేసింది. అనంతరం ఇప్పుడు దాదాపు మరో ఏడాది తరువాత తాజా సమన్లు ఇచ్చింది. అయితే సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు ఈ కుంభకోణం విచారణ చేస్తుండగా... 2022 డిసెంబర్ 11న తొలిసారి సీబీఐ కవితను హైదరాబాద్ లోని ఆమె నివాసంలో విచారించింది. సీఆర్పీసీ 160 ప్రకారం సాక్షిగా సుమారు ఏడు గంటలకు పైగా ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అనంతరం సీఆర్పీసీ 91 కింద ఈ కేసుకు సంబంధించిన ఏవైనా ఆధారాలు ఉంటే సమర్పించాలని కోరుతూ నోటీసులు ఇచ్చింది.

నాలుగు నెలల తరువాత ఈడీ ఎంట్రీ...

సీబీఐ నోటీసులు ఇచ్చిన సరిగ్గా నాలుగు నెలల తరువాత గతేడాది మార్చి మొదటి వారం ఈ కేసులో కవితకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసుల్లో భాగంగా తొలిసారి మార్చి 11న మొదటిసారి కవిత ఈడీ అధికారుల ముందు హాజరయ్యారు. ఢిల్లీ అబ్దుల్ కలాం రోడ్ లోని ప్రవర్తన్ భవన్ లో (ఈడీ ప్రధాన కార్యాలయం) తొలిరోజు సుదీర్ఘంగా విచారించిన అధికారులు 16న హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు.

కరెంట్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. బుదరవారం రాత్రి వారు రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి, ఆ మేరకు వినతి పత్రం సమర్పించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డిని బదిలీ చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.16 కోట్ల సబ్సిడి నిధులు జాప్యం అవుతాయని తెలిపారు. రెడ్కో నుంచి కేంద్ర ప్రభుత్వంతో సబ్సిడి నిధులను రాబట్టేందుకు ఆయనే సమన్వకర్తగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ వివిధ దశల్లో జరుగుతున్న పనులను కూడా ఆయనే సమన్వయం చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్య ఘర్ యోజన పథకం, పీఎం కుసుమ్ అమలులో సైతం జాప్యం కలిగే అవకాశం ఉన్నందున కనీసం మూడు నెలలైనా బదిలీని నిలిపివేయాలని కోరారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఆసోసియేషన్ జనరల్ సెక్రటరీ చారుగుండ్ల భవాని సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఇంద్రసేనారెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మోరంపూడి ప్రసాద్, సత్య, శ్రీకాంత్, ఆశోక్, గణేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాదిగలకు 12 రిజర్వేషన్ కోసం మాదిగల జోడో యాత్ర

- మంత్రి పొంగులేటి ఆవిష్కరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి కోరారు. మాదిగల జోడో యాత్ర పేరుతో ఆయన చేపట్టబోయే వాల్ పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ రాజకీయ వేదిక చైర్మెన్ ఒక్కలగడ్డ సోమచంద్రశేఖర్, నరేష్ పాల్గొన్నారు.

ఏఐసీసీ అగ్రనేతలకు ఎంపీ రేణుకాచౌదరి కృతజ్ఞతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రేణుకాచౌదరి బుధవారం అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి నుంచి నియామకపత్రం అందుకున్నారు.అనంతరం గాంధీభవన్‌లో పార్టీ నేతలు సంపత్ కుమార్, సుజాతపాల్, బక్క జడ్సన్‌తో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. తనను రాజ్యసభకు ఎన్నిక చేసినందుకు ఈ సందర్భంగా ఆమె ఏఐసీసీ అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల కోసం రాహుల్‌గాంధీ న్యాయ యాత్ర చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ మహిళా పక్షపాతి అనీ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, త్వరలోనే మహిళలకు రూ.500కే ఉచిత గ్యాస్ సిలిండడర్ అందించబోతున్నట్టు తెలిపారు

ఆధ్యాత్మిక పరవశంలోకి "ఆత్మ గౌరవ ప్రతీక"

- సమ్మక్క-సారలమ్మ మహాసంకలనాన్ని ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
మేడారం సమ్మక్క, సారలమ్మ ప్రాశస్త్యం, మహా జాతరపై వెలువరించిన "ఆత్మ గౌరవ ప్రతీక" మహా సంకలనాన్ని బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఆ పుస్తకానికి సంపాదకత్వం వహించిన ఖమ్మం నగరానికి చెందిన కవయిత్రి బండి ఉషను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మేడారం జాతర తెలుగు ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతిలో ముఖ్యమైన పండుగ అన్నారు. ప్రకృతిని నమ్ముకున్న సామాన్య ప్రజలకోసం ప్రకృతి శక్తులుగా మారి, బలవంతులపై వీరోచిత పోరు సాగించిన సమ్మక్క, సారలమ్మలు కోట్లాది మంది ప్రజల పూజలను అందుకుంటున్నారని కొనియాడారు. తెలంగాణ సంస్కృతికి దర్పణం పడుతూ తేటతెలుగులో అత్యంత సరళంగా ఉన్న కవితలు, గేయాలు, పద్యాలు మనస్సుకు బాగా హత్తుకుంటాయన్నారు. 535 మంది కవులు, కవయిత్రుల రచనలతో ఈ సంకలనం వెలువరించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మహా సంకలనం సంపాదకులు బండి ఉష, సాహితీ వేత్త మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

'ట్రాఫిక్'లో భిక్షాటనపై సర్కారు ప్రత్యేక దష్టి

- డిప్యూటీ సీఎం ఆదేశంతో 25 మంది తల్లి, పిల్లల బృందం రెస్క్యూ హోం కు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ట్రాఫిక్ జంక్షన్‌లలో పసికందులను మోసుకెళ్తూ భిక్షాటన చేస్తున్న మహిళలపై దృష్టి సారించాలని బడ్జెట్ సమావేశాల సమయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన ఆదేశాలతో అధికారులు కదిలారు. 25 మంది తల్లి, పిల్లల బందాన్ని వారు మంగళవారం స్టేట్ రెస్క్యూ హోంకు తరలించి పునరావసం కల్పించారు. రెడ్ సిగ్నల్ పడగానే చేతిలో చంటి బిడ్డలతో మహిళలు భిక్షాటన చేయడం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు నగరాల్లో షరా మామూలైంది. చంటి బిడ్డలు మత్తుగా నిద్రపోతూ... ఎండకు, కాలుష్యానికి గురవుతూ ఉంటారు. ఈ అమానవీయ కార్యక్రమాన్ని నియంత్రించాలని డిప్యూటీ సీఎం ఇటీవల మహిళా శిశు సంక్షేమ, పోలీసు అధికారులను కోరారు. పసికందులను ఉపయోగించుకుని కొన్ని అంతర్రాష్ట్ర ముఠాలు సులభంగా జీవిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని అధికారులకు డిప్యూటీ సీఎం తెలిపారు. చంటి బిడ్డలను, అభాగ్య మహిళలను మత్తులో ఉంచడానికి మత్తు మందులు ఉపయోగిస్తున్నట్టు వివిధ మార్గాల ద్వారా తనకు సమాచారం ఉందని భట్టి తెలిపారు. ఇలాంటి చిన్నారులపై, నిరుపేద మహిళల దుస్థితిపై దృష్టి సారించాలని ఆయన కోరారు. వారిని సంరక్షించి పునరావాస కేంద్రాలకు తరలించాలనీ, మరోసారి అటువైపుగా వారు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాచక రాకెట్ల గురించి గతంలో స్వచ్ఛంద సంస్థలు, బాలల హక్కుల కార్యకర్తలు కూడా తన దృష్టికి తీసుకువచ్చినట్టు అధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం 25 మంది తల్లి పిల్లల బృందాలను పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. ఈ సహాయక చర్యలను నిరంతరం కొనసాగిస్తామని స్త్రీ మహిళా శిశు సంక్షేమ, పోలీస్ అధికారులు డిప్యూటీ సీఎంకు చెప్పారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా భూపతి బాధ్యతలు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇనిస్పెక్టర్‌గా టి.భూపతి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డిఅన్నారం

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎంఎల్ఆర్ గుప్త



నవతెలంగాణ - చైతన్యపురి

గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎంఎల్ఆర్ గుప్తను బుధవారం గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం సమావేశంలో కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఎంఎల్ఆర్ గుప్త అధ్యక్షుడిగా కొనసాగుతారని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, పూర్వాధ్యక్షులు, సంఘ సభ్యులందరూ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ గుప్త మాట్లాడుతూ గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'తెలుగు జాతి

చరిత్ర, సాహితీ, సంస్కృతులను పరిరక్షించాలి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు జాతి చరిత్ర, సాహితీ, సంస్కృతులను పరిరక్షించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు భాషను అధికార భాషగా ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో తెలుగు అధికార భాషగా అమలుకు నోచుకోలేదన్నారు. గతంలో దివంగత ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం హయాంలో ట్యాంక్ బండ్ పై తెలుగు సాహితీ వైభవానికి ప్రతిరూపంగా కళామ తల్లికి, తెలుగు జాతికి సేవలు చేసిన వారి విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందని గుర్తుచేశారు. తెలుగు వెలుగుల కళామూర్తుల ప్రాంగణాలను నిర్మించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఆలనా పాలన లేక ఈరోజు అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంతవరకు ఏ విధమైన చర్యలు చేపట్టలేదన్నారు. సుమారు పది కోట్ల మందికి పైగా తెలుగు మాట్లాడే ప్రజలు దేశ విదేశాలలో ఉన్నారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడిన ఆ తెలుగు వెలుగుల కళాప్రాంగణాలను శుభ్రపరిచి ఒక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుటకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

తెలుగు సాహితీ సంస్కృతులకు ఊపిరులూదిన స్వర్గీయ ఎన్టీ రామారావు ఘాట్ కూడా పర్యవేక్షణ లేక పెచ్చులూడి శిథిలావస్థకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దాన్ని కూడా మరమ్మతులు చేసి, తెలుగు కోసం పాటుపడిన ఆయన ఆస్మృత్యర్థం నిర్మించిన ఎన్టీఆర్ ఘాటును పరిరక్షించాలన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా సాహితీవేత్తలైన దాశరథి రంగాచార్య, కాళోజీ, డాక్టర్ సి.నారాయణరెడ్డి మొదలైన వారిని స్మరించుకుంటూ, వారి పేర్లమీద స్మారక అవార్డులను తెలుగు బాష కోసం పాటుపడి, సేవ చేసిన సాహితీ మూర్తులకు అవార్డుమను ప్రదానం చేయాలని సాయిబాబా విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

- ధరణి పేరుతో తిరిగి భూ రిజిస్ట్రేషన్‌కు వస్తే క్రిమినల్ కేసులు
- డబుల్ లే అవుట్ లో డీటీసీపీ,హెచ్ఎమ్‌డీఏ లే అవుట్ అంటూ ప్రజలను మోసం చేయొద్దు
- డబుల్ లే అవుట్ లపై నిఘా
- ఆర్డీవో అనంత రెడ్డి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు అని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి హెచ్చరించారు. గత కొంతకాలంగా భూ సమస్యలు పెచ్చు మీరుతుండడంతో రెవెన్యూ అధికారులు భూప్రక్షాళన చేపట్టారు. అందులో భాగంగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మండలంలోని కుంట్లూర్ సర్వేనెం.174, 175, 176 లలో లే అవుట్‌లోని ప్లాట్స్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆర్డీవో అనంత రెడ్డి మాట్లాడుతూ భూదాన్, వక్ఫ్, ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో భూములు అమ్ముకొని లే అవుట్ చేసి, తిరిగి ధరణి సాకుతో భూ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే భూముల్లో డబుల్ లే అవుట్ చేస్తూ హెచ్ఎండీఏ, డీటీసీపీ లే అవుట్‌లు అంటూ ప్రజలను మభ్యపెడుతూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అలాగే ఆ లే అవుట్ లో భూ రిజిస్ట్రేషన్‌లు జరగకుండా, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు రద్దు చేయమని హెచ్ఎండీఏను కోరుతామన్నారు. గతంలో చేసిన లే అవుట్లు తిరిగి లే అవుట్ లు చేసి అమ్ముతున్న భూములను పున:పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీటీసీపీ హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయంటూ ప్రజలను మభ్య పెట్టి అమ్ముతున్న లే అవుట్ ల వివరాలను హెచ్ఎండీఏ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కుంట్లూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం.174, 175, 176 లో పిర్జీ పూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం 17, 51, బండరావిరాల గ్రామ రెవెన్యూ సర్వే నెం. 293లో గతంలో ప్లాట్ లు చేసిన భూముల్లో తిరిగి లే అవుట్ లు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ సర్వే నెంబర్లపై పూర్తి విచారణ చేపట్టి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్బీనగర్ జోనల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ముకుంద రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ ఇంచార్జి కమిషనర్‌గా ముకుంద రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న పంకజం సెలవుపై వెళ్లడంతో కాప్రా డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న ముకుంద రెడ్డిని ఎల్బీనగర్ జోనల్‌కు ఇంచార్జి కమిషనర్‌గా నియమించారు. గతంలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్‌గా ముకుంద రెడ్డి పని చేశారు. ముకుంద రెడ్డికి నిజాయితీ గల అధికారిగా మంచి పేరు ఉంది. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ గా రావడానికి అనేకమంది అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. ప్రభుత్వం నిజాయితీ గల అధికారిని నియమించాలని ఆలోచనలో ఉన్న నేపథ్యంలో సమర్థవంతమైన అధికారిగా పేరున్న ముకుంద రెడ్డిని ఇంచార్జి కమిషనర్ గా నియమించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ నిబంధన ప్రకారం నడుచుకుంటానని అన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేస్తానన్నారు. అధికారుల, ప్రజల సహాయ సహకారాలతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా రాజు



నవతెలంగాణ - సంతోష్‌నగర్

మలక్‌పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఆకుల రాజును నియమించారు. ఈ మేరకు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మమ్మద్ మూస ఖాసీం జారీ చేసిన నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ బుధవారం ఆకుల రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, సి.నారాయణ రెడ్డి, సేవా గౌస్ పాల్గొన్నారు.

క్వాలిటీ థాట్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, అన్ అకాడమీ

మధ్య భాగస్వామ్య ఒప్పందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సాఫ్ట్‌వేర్ శిక్షణ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న క్వాలిటీ థాట్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, దేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫారమ్ అన్ అకాడమీ హైదరాబాద్‌లో ఇంటర్-కాలేజ్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టడానికి భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాయి. ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్, నీట్ కోసం ఒత్తిడి లేని విద్యనే లక్ష్యంగా నగరంలో నూతన అకాడమీని ప్రారంభించనున్నాయి. ఈ సందర్భంగా క్వాలిటీ థాట్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు రమణ భూపతి మాట్లాడుతూ 'డాక్టర్ రవికిరణ్, ప్రభాకర్ రెడ్డి, ఖాజా ఇబ్రహీం వంటి నిపుణులతో అన్ అకాడమీతో మా సహకారాన్ని ప్రకటించినందుకు సంతోషిస్తున్నాను. ఈ భాగస్వామ్యం ద్వారా మేం ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్, నీట్ కోసం ప్రత్యేక కోర్సులను అందించగలం. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో అనాకాడెమీ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం. విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని మా సంయుక్త ప్రయత్నాలు అందించగలం' అని తెలిపారు.

కార్మికుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి



- మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం కోహెడ వార్డు కార్యాలయంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారిలు విధులు నిర్వహించేటప్పుడు తప్పకుండా రక్షణ పరికరాలు వాడాలని కోరారు. మురికి కాల్వలు శుభ్రపరిచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి అనుబంధమైన నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని పథకాలు, సబ్సిడీలు పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.

సమాజంలో సఫాయి కర్మచారిల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. వారికి రావాల్సిన అన్ని సదుపాయాలు, హక్కులను కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ హరీష్, మున్సిపాలిటీ సిబ్బంది భానుమతి, రోజా, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన జ్యోతి జైపాల్ నాయక్



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో బుధవారం కాలనీ అధ్యక్షులు నేనావత్ జ్యోతి జైపాల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైమ్ ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.15లక్షల ప్రత్యేక నిధులను కార్పొరేటర్ మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేటర్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. తర్వాత ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రీసెర్చ్ మెథడాలజీ అంశంపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో రీసెర్చ్ మెథడాలజీ అంశంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామావత్ రవి మాట్లాడుతూ వాణిజ్య విభాగం విద్యార్థులు కొత్త కొత్త అంశాలపై ఆలోచనలు చేయాలని సూచించారు. విద్యార్థుల మనోవికాసానికి అతిథుల ఉపన్యాసాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారుకి, డాక్టర్ ఈ. శంకర్, డాక్టర్ ఎస్. ధనరాజ్, డాక్టర్ ఎస్. సుబ్రహ్మణ్యం, డాక్టర్ జి. సునీత పాల్గొన్నారు.

'సమగ్ర కుల గణన హర్షించదగ్గ విషయం'



నవతెలంగాణ - హయత్ నగర్

అసెంబ్లీ సమావేశంలో సమగ్ర కుల గణన చేపట్టాలని ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీర్మానాన్ని ప్రవేశపెట్టి, ఆమోదింపజేసిన సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనా బీసీల సమగ్ర కుల గణన జరగలేదన్నారు. దేశ సంపద, రాష్ట్ర సంపద అన్ని వర్గాలకు అందాలని దశాబ్ద కాలంగా పోరాడుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన మీద అసెంబ్లీలో తీర్మానం చేయడం మూలంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉద్యోగాలలో బీసీ కులాల జీవితాలలో వెలుగులు నింపిన వారు అవుతారని హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేర కోట్ల రూపాయలు ఖర్చు చేసి, కులాల జనాభా లెక్కలు తీయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలలో విద్య, ఉద్యోగ సామాజిక రంగాలలో ముందుకు దూసుకెళుతుందని కొనియాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో 17 పార్లమెంటు సీట్లకు 17ను గెలిపించి..సీఎంకు కానుకగా ఇస్తామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి కుల గణన చేపట్టి, చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి ఖాజామియా, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేపల్లి కుమార్, ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌కు సన్మానం



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ బోర్డు మెంబర్‌గా నియమితులైన సంకేపల్లి సుధీర్‌రెడ్డికి బుధవారం ఆర్కేపురం డివిజన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి ఉన్నతమైన పదవులు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం సుధీర్ రెడ్డిపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పజెప్పిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్కే మహమ్మద్, రామాచారి, సోమేశ్వరరావు, ఎం డి హైమద్, రఫిక్ బాబా పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారిగా రమేష్



నవతెలంగాణ-తుర్కయంజాల్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన బచ్చిగళ్ళ రమేష్‌ను బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారిగా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సేవలందించినట్టు తెలిపారు. తన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారిగా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం తనకు బాధ్యతలు అప్పగించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బీజేపీ రంగారెడ్డి జిల్లా రథసారథి బొక్క నర్సింహా రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యే నారాయణ రెడ్డిని కలసిన

ఆలయ కమిటీ సభ్యులు



నవతెలంగాణ - సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని సుబ్రహ్మణ్యం కాలనీ సాయిబాబా ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని బుధవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్ రావు, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ చారి, ట్రెజరర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు

నవతెలంగాణ - చైతన్యపురి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి, కార్యవర్గ సభ్యులు బుధవారం శ్రీనివాసరావును దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అవకాశాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని శ్రీనివాసరావును కోరారు. అంతేకాదు ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనరసింహారావు, ఆర్.కే. దేశ్ ముఖ్, మంత్రి సునీల్, సీనియర్ జర్నలిస్టు అక్కినేపల్లి పురుషోత్తమరావు, దేవులపల్లి అశోక్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

నాగారం పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి : చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులోని సింహపురి కాలనీలో 15వ ఆర్థిక సంఘం రూ.6.40 లక్షలతో చేపట్టుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొట్టే దివ్య దయాకర్‌రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పిట్టల బస్తీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి బుధవారం డ్రయినేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'లెనిన్.. ఓ విప్లవ ఆయుధం' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

రెడ్ బుక్ డే సందర్భంగా 'లెనిన్ ఓ విప్లవ ఆయుధం' అనే పుస్తకాన్ని సీపీఐ(ఎం) పార్టీ కమలానగర్ ఆఫీస్‌లో ఆవిష్కరించినట్లు సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ ఆలోచన నేటి సమాజానికి సజీవమన్నారు. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి రచించిన మానవాళి విముక్తి కోసం సాగే 'విప్లవ ప్రగతికి ధ్రువ నక్షత్రం లెనిన్' అనే వ్యాసాన్ని చదివారు. సోవోజ్ జిజెక్ లెనినిజం వర్గ చైతన్యం, ప్రభాత్ పట్నాయక్ కార్మిక, కర్షక మైత్రి, అశోక్ దావలె వ్యాసాలను సామూహికంగా పఠించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు, నాయకులు సిహెచ్ ప్రసాద్, జి. యాదగిరి, ఎంఎస్ రావు, ఎన్. శ్రీనివాస్, ఉన్నికృష్ణ, వెంకట్, జి వి.రావు, పోతురాజు, డీకే.దుర్గయ్య, జయరాజు, ప్రసాద్ బాబు, రుక్కయ్య, సఫియా, శారద, గౌసియా, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణలో మీడియా పాత్ర కీలకం



- అభివృద్ధి, సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణలో వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ భూముల పరిరక్షణలో మీడియా పాత్ర కీలకమైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధ వారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఉన్న లోపాలతోనే ప్రభుత్వం మారిందన్నారు. ప్రజలు కోరుకున్న మార్పునకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మీడియా పరిస్థితులు మారాయని, మారిన పరిస్థితులను అనుగుణంగా జర్నలిస్టులు పనిచేయాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యతను జర్నలిస్టులు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. కార్పొరేషన్లు, మండల కేంద్రాలలో శాశ్వత ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్యారి ఎల్లయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి నివేదిక సమర్పించాడు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, టీయూడబ్ల్యూజే - ఐజేయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల్‌రాజు గౌడ్, డీ.వెంకట్ రాంరెడ్డి, బోడుప్పల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సీపీఐ(ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి ఎస్.సృజన, కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, యుత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్, కార్పొరేటర్లు ఎంపల్ల అనంత్ రెడ్డి, కొత్త చందర్ గౌడ్, వెంకటేష్ యాదవ్, జంగయ్య యాదవ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు బ్రహ్మన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, పులకండ్ల జంగారెడ్డి,ఎంసీపీఐ నాయకులు మూడి మార్టిన్, కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకురాలు దుర్గా, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారు వీఎస్ఎన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళలతో కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా స్త్రీనిధి పథకం, ఇతర పథకాల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కోఆర్డినేటర్ వెంకటేష్, ఊర్మిళ, స్వయం సహాయక సభ్యులు ఉన్నారు.

ఘనంగా శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

ప్రముఖ శాస్త్రవేత్త శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతిని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సామాజిక ఉద్యమ నాయకురాలు శారద, జయరాజు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..శాంతి స్వరూప్ భట్నాగర్ కొలాయిడ్ కెమిస్ట్రీలో గొప్ప పరిశోధనలు చేశారని తెలిపారు. చమురు రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆయన పరిశోధనలు ఉపయోగపడ్డాయని చెప్పారు. ఆయన కృషి ఫలితంగా సీఎస్ఐ ఆర్ లాంటి పరిశోధన సంస్థలు ఏర్పాటు అయ్యాయని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు అందజేసిందని తెలిపారు. అనేక పరిశోధనలో విశిష్ట కృషి చేసిన వారికి శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులను భారత ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. ప్రసాద్‌బాబు, యాదగిరిరావు మాట్లాడుతూ.. ప్రముఖ విజ్ఞాన వేత్త దేవరాజ్ మహారాజ్ పుట్టినరోజు సందర్భంగా శాస్త్రీయ దృక్పథంతో అనేక పుస్తకాలు తెచ్చి ప్రజలలో చైతన్యం తేవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భట్నాగ ర్ చిత్రపటానికి సభికులందరూ పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, శారద, గౌసియా, సఫియా, శ్రీనివాసరావు, శ్రీనివాస్, శ్రీనివాస్, ఉన్నికృష్ణ, రుక్కయ్య, ప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంపీ ల్యాండ్స్‌తో నియోజకవర్గాల్లో చేపట్టిన పనుల్లో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఎంపీ లాండ్స్‌తో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో (సీడీపీ, ఎంపీ, ఎస్‌డీఎఫ్, సీబీఎఫ్)తో చేపట్టిన పనుల పురోగతిపై జిల్లా ప్రణాళికా అధికారి మోహన్ రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని, ఎక్కడా పనులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలన్నారు. జిల్లా నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్సిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ఫండ్స్, సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (మెంబెర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్, ఎంపీ ల్యాడ్స్) క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, ఎస్డీఎఫ్)కు సంబంధించి జిల్లాలోని రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, అటవీ శాఖ, జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులందరూ సమన్వయంతో పని చేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయగలరని సూచించారు. ఎంపీ ల్యాండ్స్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయని, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయని, రద్దు చేసినవి ఎన్ని, తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎన్ని పనులు పూర్తి చేశారు? ఇంకా ఎన్ని పనులు ఏఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా క్యాన్సల్ అయినవి ఎన్ని అనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని తెలిపారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన యూటిలైజేషన్ సర్టిఫికెట్‌లను సీపీఓకు పంపాలన్నారు. తదుపరి సమావేశానికి అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

పేద రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలోని ఎస్వీ నగర్ కాలనీలో నివసించే కొక్కొండ ఆగిరెడ్డి వెరికోస్ వేన్స్ వ్యాధికి గురై నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుకున్న స్థానిక కౌన్సిలర్ కోమిరెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డిల సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి రూ.90వేల ఎల్‌వోసిని కౌకుట్ల చంద్రారెడ్డి బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి వరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోమిరెల్లి అనితా సుధాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ వర్గం సభ్యులు



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇటీవల అవిశ్వాసం నెగ్గిన డిప్యూటీ మేయర్ తన వర్గం కార్పొరేటర్లతో జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ రొడ్డి శెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు శాంతి కోటేష్ గౌడ్, నవీన్ కుమార్, చిత్ర సుబ్రహ్మణ్యం, లలిత యాదవ్, మనోధర్‌రెడ్డి, సాయి కుమార్, రాజ్ కుమార్, బాబు, నాయకులు కృష్ణ, సతీష్ గౌడ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

స్వచ్ఛ్ జవహర్ నగర్‌గా తీర్చిదిద్దుదాం



- అభివృద్ధిలో రాజీపడేది లేదు
- కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, ప్రజల భాగస్వామ్యంతో జవహర్ నగర్‌ను స్వచ్ఛ జవహర్ నగర్‌గా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శానిటేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

శానిటేషన్ పనుల నిర్వహణ వివరాలను, వారి సమస్యల అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ్ జవహర్ నగర్‌గా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో కమాన్ ఏర్పాటు అభినందనీయం



- కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-కీసర

దాతల సహకారంతో కమాన్ (ఆర్చ్) ఏర్పాటు అభినందనీయమని నాగారం మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈస్ట్ గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మ వారి దేవస్థానం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో (దాదాపు మూడున్నర లక్షల వ్యయంతో) ముఖ్య రహదారుల నుంచి కాలనీలోని పోచమ్మ గుడికి వెళ్లే రోడ్ నెంబర్ 6 ,రోడ్ నెంబర్ 9 ఎంట్రన్స్‌లలో నిర్మించిన కమాన్‌లను, సైన్ బోర్డులను ఆలయ కమిటీ ప్రెసిడెంట్, కాలనీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, స్థానిక కౌన్సిలర్ శ్రీ మాదిరెడ్డి వెంకటరెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గౌరక్క సత్యం సాగర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. కిష్టారెడ్డి, జనరల్ సెక్రటరీ వంకోజు శ్రావణ్ కుమార్, రాపోల్ ప్రవీణ్, అడ్వైజర్ మూర్తి, హన్మంతురెడ్డి, డేవిడ్ రాజు, కమిటీ సభ్యులు లింగారెడ్డి, జస్వంత్ సింగ్, వెంకటరమణ, రాజిరెడ్డి, వినోద్, బాలమల్లేష్, భూపతిరెడ్డి, ఖాజా, నరేష్ గౌడ్, సుదర్శన్, వి.మల్లేష్ గౌడ్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీసీరోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి డివిజన్ పరి ధిలోని చాణక్యపురిలో రూ.28 లక్షల వ్యయంతో నిర్మిస్తు న్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగి రి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, గుత్తేదారు రవి, కాలనీవాసులు వినోద్, అబ్రహం, చైతన్య, రవి, మూర్తి, సుబ్బారావు, సురేష్ సింగ్ పాల్గొన్నారు.

దేవేందర్ ప్రసాద్‌ను అభినందించిన డీజీపీ రవిగుప్తా



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్ ప్రసాద్ ఇటీవల లక్నోలో నిర్వహించిన పోలీస్ ఫోటోగ్రఫీ విభాగంలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా తన కార్యాలయంలో బుధవారం దేవేందర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మాజీ సీపీ స్టీఫెన్ రవీంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి భవన నిర్మాణం వద్ద హైడ్రామా



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఏడుగుళ్ల సమీపంలోని జాతీయ రహదారి 44 పక్కన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి భారీ ఎత్తున బహుల అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. కాగా బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో హెచ్ఎండీఏ అధికారులు అట్టి నిర్మాణాన్ని కూల్చి వేస్తున్నారని లీకులతో హల్‌చల్ అయ్యింది. సమాచారం తెలుసుకున్న మల్లారెడ్డి తనయుడు మహేందర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. దాదాపుగా రెండు గంటలపైగా అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు. చివరికి హెచ్ఎండీఏ అధికారులు నాలా కన్వర్షన్, ఇతర ఫిర్యాదులు పరిశీలించడానికి రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన పాల ట్యాంకర్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-శామీర్‌పేట

పాల ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందగా వెనకాల కూర్చున్న మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెస్ట్ మారెడుపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు శామీర్‌పేట నుంచి మారేడుపల్లికి తమ స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన పాల ట్యాంకర్ స్కూటీని ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న లింగప్ప అలియాస్ (విక్కీ) (24) అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైక్ వెనక కూర్చున్న వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు 108కు సమాచారం ఇవ్వడంతో కీసర 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్, ఆంజనేయులు వైష్ణవిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉండదు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉండదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అర్బన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోడీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ మీదుగా సాగుతుందని తెలిపారు. జిల్లా అర్బన్ అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలో కాంగ్రెస్‌లో చేరుతారన్నారు. మీడియా, ప్రజాస్వామ్యవాదుల పట్ల కేసీఆర్ క్రూరంగా వ్యవహరించారన్నారు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌కు చేసిందేమీ లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను పట్టించుకోవద్దన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ ఆర్.కె.శ్రీనివాస్, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ విజిత్‌వర్మ, జిల్లా సెక్రటరీ పప్పు పటేల్, డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు



నవతెలంగాణ-కీసర

స్పా సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని ఎస్‌వోటీ పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌వోటీ సీఐ జానయ్య, ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... నాగారంలో ఓ మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో దాడి చేసి ముగ్గురు మహిళలను, ఇద్దరు కస్టమర్లు, ఒక ఆర్గనైజర్ ను అదుపులోకి తీసుకున్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలి



- మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వేసవి కాల దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న వాటర్ వర్క్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. బుధవారం వాటర్ వర్క్స్ బోర్డ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ ని వారి కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు కలిసి బాలాజీనగర్ డివిజన్‌లో తాగునీటి సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో మంజూరై పెండింగ్‌లో ఉన్న వాటర్ వర్క్స్ పనులు వేసవి కాల దృష్ట్యా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆయనను కోరగాదానికి మేనేజర్ సానుకూలంగా స్పందించారు.

నామినేషన్ దాఖలు చేసిన రవీందర్ రెడ్డి



- కార్పొరేటర్ సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత మొట్టమొదటిసారిగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ కొత్త కౌన్సిల్‌తో పాలక మండలిని త్వరలో కొలువుతీరానుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బీఆర్ఎస్ పార్టీ బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జీహెచ్ఎంసీ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ విషయాన్ని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రతిపాదించి, బలపరిచారు.

ఓర్వలేకనే ఎస్ఎఫ్ఐ నాయకులపై ఎబీవీపీ మూక దాడి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శి కార్తీక్, రాథోడ్ సంతోష్
- నేడు జిల్లా వ్యాప్తంగా ఏబీవీపీ దిష్టి బోమ్మ దగ్ధానానికి పిలుపు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐపై ఓర్వలేక ఎబీవీపీ నాయకులు దాడులు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శి కార్తీక్, రాథోడ్ సంతోష్ లు తెలిపారు. కూకట్‌పల్లి జెఎన్టీయుహెచ్‌లో విద్యార్థులు సమస్యలు తెలుకోవడానికి ఎస్ఎఫ్ఐ బృందం వెళ్ళింది. విద్యార్థులతో మాట్లాడి వస్తున్న సందర్భంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో ఎబీవీపీ నాయకులు దిలీప్, కోంతమంది ఘర్షణకు దిగ్గారు. ఈ సందర్భంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ పై దాడి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్, కూకటప్‌పల్లి మండల అధ్యక్షుడు సుమంత్‌కి బూతులు తిడుతూ 10 నుంచి 20 మంది ఎబీవీపీ నాయకులు దాడి చేసి చోక్కా చించి గాయపరిచారు. ఈ సందర్భంగా ఈ చర్యలను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా జెఎన్టీయుహెచ్‌లో ఎబీవీపీ ఆరాచకాలకు పాల్పడుతుంద న్నారు. గతంలో సంగారెడ్డి, కరీంనగర్, మహబుబ్‌నగర్ జిల్లాలో దాడులు పాల్పడ్డారని, విద్యార్థులలో నికరంగా పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ ఎదుగుదల ఓర్వలేక భౌతికంగా దాడులు చేస్తున్నారన్నారు. నిజంగా ఎబీవీపీకి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు సమస్యలపై పోరాడాలని భౌతికంగా దాడులు చేస్తే సహించమని హెచ్చరించారు. ఈ దాడులను నిరసనగా రేపు జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దగ్దానికి పిలుపునిచ్చారు. ఇకనైనా దాడుల సంస్కృతి ఎబీవీపీ మానుకోవాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.

ఇంటర్, 'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఈఓ విజయకుమారి, డీఐఓ కిషన్, సంబంధిత అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. వసతులు, లైటింగ్, ఫ్యాన్స్, తాగునీరు, టాయిలెట్స్ లాంటి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 65,965 మంది, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఇందుకు 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌకర్యాలు కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, తిరిగి పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్‌ను తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదన్నారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, రాచకొండ, సైబారబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



- సీపీఐ(ఎం) పార్టీ డిమాండ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ శోభన బస్ స్టాప్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కూకట్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సి. హెచ్. కృష్ణయ్యకు సీపీఐ(ఎం) పార్టీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేలా బాలానగర్‌కు వచ్చిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఫిరోజ్ గూడలో ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరుపయోగం ఉందన్నారు. శోభన బస్ స్టాప్‌లో రోజుకు ఒక్కరు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటి వరకు అధికారికంగా 6 మంది చనిపోయారని, అనేక మంది రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారని అన్నారు. ఫతేనగర్, గౌతమ్ నగర్, శోభన కాలనీ నుండి రాజుకాలనీ ప్రభుత్వ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం పొంచి ఉందని, ఓ పక్కన రోడ్డుకు ఇరువైపులా వైపుల వైన్ షాపులు, కల్లు కాంపౌండ్ ఉంటడంతో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలిపారు. ఈవిషయమై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని లేకుంటే జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయాన్ని, ప్రజా ప్రతినిధుల ఇండ్లను అధికారులు సమన్వయంతో పనిచేయాలి:ముట్టడిస్తామని రాజశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పి. శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రవిప్రకాశ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగుల జేఏసీ చైర్మెన్, టీఎన్జీవోస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ 53వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఈశ్వర్, జిల్లా కార్యదర్శి-కోశాధికారి భరత్-గిరికాంత్, ఉపాధ్యక్షులు హరి, సంయుక్త కార్యదర్శి చాంద్, ఈసీ సభ్యులు కార్తీక్, మల్కాజిగిరి యూనిట్ అధ్యక్షులు రాంచందర్, మినిస్టరియల్ ఫోరమ్ అక్షయ్, యూనియన్ అడ్వైజర్ సంజయ్ సింగ్ పాల్గొని రవి ప్రకాష్‌ను శాలువా-గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇమాజిన్ హబ్'ల్యాబ్‌లను ప్రారంభించిన ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ పరిధి లోని భారతదేశంలోని ఇంటర్నేషనల్ కె12 గొలుసు స్కూళ్లలో, ఒకటి అయిన ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ దాని అకడెమిక్ ఎక్సెన్స్ ఇన్నోవేషన్ అందించడానికి రొటీనుకి భిన్నమైన 'ఇమాజిన్ హబ్' ల్యాబ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈ స్టేట్-ఆఫ్- ద-ఆర్ట్ ల్యాబ్‌ను ముఖ్య అతిథులుగా బి. భారతి లఖ్పతీ నాయక్ ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ డిపార్ట్‌మెంట్‌లో స్పెషల్ సెక్రటరీ ఐఎఎస్ అధికారి, ఆర్ ప్రదాస్ నాయక్, చైర్మెన్ ఎస్టీ విభాగం, రవి నాయక్ , జోనల్ హెడ్ హైదరాబాద్ ఆర్కిడ్స్ ద ఇంటర్నేషనల్ స్కూల్, డాఎం కవితా నాగపాల్, వైస్ ప్రెసిడెంట్ అకడెమిక్స్- బౌరాంపేట్ ఆర్కిడ్స్ ప్రిన్సిపాల్ తబస్సుమ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సాటిలేని అవకాశాలను అందించడానికి చేసే విశేషమైన కంట్రిబ్యూషనుకి ఈ ప్రీమియం ఫెసిలిటీలు ప్రతీకలు అన్నారు. విభిన్నమైన అరేలు కలిగిన డిసిప్లిన్లను హాండ్స్-ఆన్ నేర్చుకోవడానికి ఎక్స్ప్లోర్ చేయడానికి ఈ అవకాశాలు దోహద పడతాయని తెలిపారు. అలాగే ఆర్కిడ్స్ లంగర్ హౌస్ క్యాంపసులో కూడా ఈ ఇమాజిన్ హబ్ ల్యాబ్స్ లభ్యతలో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిల్లో ఆస్ట్రోనామీ, రోబోటిక్స్, ఎంఎసి కోడింగ్, టింకరింగ్, డాన్స్, థియేటర్, మ్యూజిక్, నేత (వీవీంగ్) ముద్రణ (ప్రింటింగ్), పోటరీ, పెయింటింగ్ అనే ఫీచర్లు అందించబడతాయి. ఈ ఇమాజిన్ హబ్ ల్యాబ్లను హెూమ్ లేన్ అనే ఇన్నోవేటివ్ ఇంటీరియర్ డిజైన్ కంపనీ తయారు చేసింది. కాంప్రిహెన్సివ్ ఎండ్-టు-ఎండ్ ఇంటీరియర్ పరిష్కారాలను అందించడానికి ఈ కంపనీ టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. ఈ సందర్భంగా డాఎం కవితా నాగ్పాల్, వైస్ ప్రెసిడెంట్ అకడెమిక్స్ ఆర్కిడ్స్ ద ఇంటర్నేషనల్ స్కూల్ , "విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్పోజరుని సమకూర్చడానికీ, వారికి ల్యాబ్-ఆధారిత విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడానికీ దానిని అమలుపర్చడానికీ ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కృషి పట్ల మేము గర్విస్తున్నామన్నారు జాతీయ విద్యా పాలిసీ (ఎన్ఇపి) 2020 విజన్ జాతీయ కరికులం ఫ్రేమ్ వర్క్ (ఎన్సిఎఫ్) 2023తో ఈ ఎక్స్పోజర్ అనుసంధానములో వుంటుందని తెలిపారు.. ఇది విద్యార్థులను భవిష్యత్తు కెరీర్ల కొరకు తయారు చేయడానికి కీలక పాత్రను పోషిస్తుంది." తబస్సుమ్ జైదీ, ప్రిన్సిపాల్ ఆఫ్ ఆర్కిడ్స్ ద ఇంటర్నేషనల్ స్కూల్- బాచుపల్లి ఇలా అన్నారు, "ఇమాజిన్ హబ్ ల్యాబ్లను ఆవిష్కరించడానికీ మా విద్యార్థులకు అందిస్తుంది. ఈ అనుభవాలలో భవిష్యత్తులో ఎస్టిఈఎం, ఆటలు, టెక్నాలజీ , పర్ఫార్మింగ్ ఆర్ట్స్ వుంటాయి. ఈ ఇమాజిన్ హబ్ ల్యాబ్లు అనేవి ఆర్కిడ్స్ వద్ద నేర్పించే విద్యలోని కొత్త శకమును సూచిస్తాయి. మా స్కూలులో ఇన్నోవేషన్ మరియు సృజనాత్మకత అనేవి మా విద్యా ఫిలాసఫీలో ఎప్పుడూ అగ్రస్థానములో ఉంటాయని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాజీ ఎంపీపీ కొలను హనుమంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం గాజులరామారం డివిజన్ పరిధి బీఎస్ఆర్ సెల్లర్‌లో మురుగు, వర్షపు నీళ్ల రావడంతో ఇబ్బందులు పడుతున్నామని దీంతో పాటు రాంకీ,ఏఆర్‌కే.40 ఫీట్ల రోడ్డు, నుంచి మల్లారెడ్డి నగర్ ఫేస్ 2,ద్వారకా నగర్ ఫేస్ 2, వరకు పెండింగ్లో ఉన్న మరమ్మత్తుల పనులు పూర్తి చేయాలని ఉప కమిషనర్ మల్లారెడ్డి ఆదేశిస్తూ, కాలనీవాసులతోతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కోలను మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. ప్రజలు పూర్తిస్థాయిలో విశ్వసించి తమకు పాలన అప్పచెప్పారన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి పబ్బం గడుపుకున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డితోపాటు ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధికారులను ఆదేశించారు. బుధవారం డివిజన్ పరిధివాక్షిత్ ఎంక్లేవ్ కాలనీ హెచ్.పీ గ్యాస్ గోడౌన్ వద్ద గల డ్రయినేజీ వాటర్ స్టాగ్నేషన్ నాలా స్తంభించిపోయి పొంగిపొర్లడంతోపాటు మురుగునీరు స్తంభించుకోవడంతో దుర్గంధం వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సంబంధిత జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, జలమండలి, అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి కార్యచరణ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా డివిజన్ ప్రజల సహకారాలతో వారి సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నానని తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



- ప్రొఫెసర్ కట్టా నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహా రెడ్డి అన్నారు. ఇంటర్ యూనివర్సిటీ ఫెస్ట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని మల్లా రెడ్డి యూనివర్సిటీలో జరిగిన స్పోర్ట్స్ ఫెస్ట్‌లో జేఎన్టీయూ యూనివర్సిటీ కాలేజీ విద్యార్థులు ఖో ఖో లో మొదటి స్థానంలో నిలిచారు. బుధవారం స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కట్టా నర్సింహా రెడ్డి బహుమతి గెలుచున్న క్రీడాకారులను అభినందనలు తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడచాలా ముఖ్యం అన్నారు. మానసిక ఎదుగుదలకు, ఎప్పుడు ఉల్లాసం సంగా ఉండాలి అన్న విద్యార్థులు విధిగా క్రీడాకారులుగా ఉండాలి అన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్‌లో అనేక సౌకర్యాలు ఉన్నాయి. పూర్వ కాలంలో శిక్షణ కూడ ఉండేది కాదు ఇప్పుడు మీకు అనుభవం గల స్పోర్ట్స్ సెక్రటరీ దిలీప్, అదే స్థాయిలో శిక్షణ ఇచ్చే స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ అందుబాటులో ఉన్నారన్నారు. వారిని మీరు తప్పకుండా ఉపయోగంలోకి తీసుకోని మంచి క్రీడాకారులులా పేరు తెచ్చుకొని, యూనివర్సిటీ పేరు తేవాలి అన్నారు. ఉత్తమ శిక్షణ ఇచ్చి పోటీలో మొదటి బహుమతి యూనివర్సిటీ దక్కేలా శిక్షణ ఇచ్చిన స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌ను వైస్ ఛాన్సలర్ ప్రత్యేకంగా అభినందనలు తెలియ చేశారు. అదే విధంగా రిజిస్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు విద్యార్థులుకు శుభాకాంక్షలు తెలియచేశారు.

సమస్యలు యూనివర్సిటీ అధికారులతో చర్చించి, మంచి వాతావరణంలో పరిష్కరించుకోవాలి...

రాబోయే అకాడమీ సంవత్సరంలో అడిమిషన్ విషయమై మీ మీ సమస్యలు యూనివర్సిటీ అధికారులతో చర్చించి మంచి వాతావరణంలో పరిష్కరించకోవాలని యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి అన్నారు. బుధవారం జేఎన్టీయూ యూనివర్సిటీలో గల గోల్డెన్ జూబ్లీ హాల్‌లో రాష్టంలో ఉన్న పలు ప్రయివేటు ఆటానమస్ కాలేజీల యూనివర్సిటీల ప్రిన్సిపాల్, చైర్మెన్స్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు రెక్టర్ డాక్టర్ కె.విజయ కుమార్ రెడ్డి, రిజిస్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్ రావు, డాక్టర్ ఎస్.తార కళ్యాణి, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ పి.ప్రసన్నలు పాల్గొన్నారు. రెక్టర్ డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇండియాలో మొదటి టెక్నాలజీ యూనివర్సిటీ జేఎన్టీయూ అన్నారు. యూనివర్సిటీ అధికారులు అందురు కూడ మీకు అందుబాటులో ఉంటారన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టా నరసింహ రెడ్డి మాట్లాడుతూ తాను భాద్యతలు చెప్పట్టిన తరువాత ఆఫీయేషయ్ విషయంలో చాల సులభ తరం చేశాను అన్నారు. మీ మీ కాలేజీలో ఉన్న సదుపాయాలు సౌకర్యాలు మాకు వివరంగా ఇవ్వడం మీరు తప్ప సమాచారం ఇవ్వడం వల్ల మీరు ఇబ్బంది పడుతున్నారన్నారు. వారం పది రోజుల్లో యూనివర్సిటీ టీం వారు వెళ్లి అన్ని కాలేజీ లను, హాస్టల్ ను పరిశీలన చేయడం కోసం ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. ఆఫీలీయేషన్ సిస్టమ్‌ను జాగ్రత్తగా నింపి యూనివర్సిటీకి ఇవ్వాలి అన్నారు. నేషనల్ ఎడ్యుకేషనల్ ఆథార్టీ వారు చాలా మార్పులు చేస్తూ అదే విధంగా జేఎన్టీ యూ కూడ అనేక మార్పులు చేసి, నిబంధనకు లోబడి ప్రయివేటు కాలేజీల వారికి అండ ఉండాలి అన్నారు. జేఎన్టీయూకి వైస్ ఛాన్సలర్‌గా కట్టా నర్సింహా రెడ్డి వచ్చిన తరువాత ప్రయివేటు కాలేజీ పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. వైస్ ఛాన్సలర్ వివరణ ఇస్తూ యూనివర్సి టీ ఎక్కడ కూడ కాలేజీ పరీక్షల విషయం లో కానీ మేము జోక్యం కలిగించుకోవడం లేదు అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మేము కాలేజీలకు చాలా అనుకులం గానే నడుచుకుంటూ ఉన్నామని తెలిపారు. సమావేశంలో పాలొగొన్న అనేక మంది కాలేజీ చేర్మెన్ లు ప్రిన్సిపాల్స్ వీసీ ప్రవేటు కాలేజీల పట్ల యూనివర్సిటీ చూపుతున్న స్నేహం భావం అందిస్తున్న యూనివర్సిటీ అధికారులకు ధన్యవాద ములు తెలియ చేశారు. ఈ సమావేశంలో ప్రవేట్ కాలేజీ ప్రిన్సిపాల్స్ చైర్మెన్ లు యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న కాలేజీ వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహా రెడ్డి, విసి బాధ్యతలు చేపట్టిన తరువాత యూనివర్సిటీ లో జరిగిన అనేక అభివృద్ధి పనులు వివరించారు.



మాదిగలకు రిజర్వేషన్ ఇవ్వకపోతే బీజేపీని ఓడిస్తాం



- జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బుదాల బాబురావు,
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, లేనిఎడల పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఓడించి తీరుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం హైదరాబాద్ అమీర్ పేట్ హరిజనవాడలో మాదిగల జోడోయాత్ర ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల పంతం బీజేపీ అంతమే ప్రధాన నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ పార్టీ 10 సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు వర్గీకరణ చేయకుండా మాదిగలను కేవలం ఓటు బ్యాంకుకు మాత్రమే బీజేపీ వాడుకుంటుందని తెలిపారు. వర్గీకరణ చేస్తామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణలో స్వయంగా దేశ ప్రధాని మోడీ హామీ ఇచ్చి చివరి పార్లమెంటు సమావేశంలో వర్గీకరణ చేయకుండా కమిటీలతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం కేవలం 10 శాతం ఉన్న అగ్రవర్ణాల కోసమే పనిచేస్తుందని, 9శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల గురించి ఏ నాడు ఆలోచించలేదని, అణగారిన వర్గాలను బీజేపీ పార్టీ తీరని అన్యాయం చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీకి పుట్టగతులు లేకుండా చేయకుండం కోసం మాదిగ జేఏసీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగల జోడయాత్ర ఉమ్మడి పది జిల్లాలలో మాదిగలను బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రామస్థాయికి తీసుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజ్జల మల్లికార్జున్, నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బూదాల బాబురావు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షులు ఒక్కల గడ్డ చంద్రశేఖర్, మహా ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగం నరసింహారావు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులు ప్రారంభం



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట్ సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు ప్రణాళి కాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. బుధవారం రూ. 20 లక్షలతో సమతానగర్‌లో కమ్యూనిటీ హాల్ రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేకమైన దృష్టితో ఫతేనగర్ డివిజన్‌కు అధిక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఫతేనగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలలో బస్తీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు భాగ స్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజేందర్, జనరల్ ప్రధాన కార్యదర్శి నరసింహా, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా తానింకి కిషోర్ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తానింకి కిషోర్ యాదవ్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈ సందర్భంగా విద్యా నగర్‌లోని బీసీ భవన్‌లో కిషోర్ యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం తానింకి కిషోర్ యాదవ్ మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య చేపడుతు న్నటువంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వెనుకబడిన బీసీ జాతి అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకంకి సహకరించిన డాక్టర్ ర్యాగ రిషి అరుణ్ కుమార్ - జాతీయ సమన్వయకర్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఉస్మానియా ఆస్పత్రికి ట్రాలీలు, వీల్ చైర్ విరాళం..



నవతెలంగాణ-ధూల్ పేట్

పేద రోగుల వైద్య సహాయార్థం చౌదరి కుటుంబం దివంగత రామ్‌దత్ చౌదరి జ్ఞాపకార్థం, రోగి సహాయ ట్రస్ట్ ద్వారా మహావీర్ వికలాంగ కేంద్రం, కింగ్ కోటి ద్వారా నాలుగు ట్రాలీలు, నాలుగు చక్రాల కుర్చీలు అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్. బి.త్రివేణి ఆర్ఎంఓలతో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్.బి.నాగేందర్ మాట్లాడుతూ.. పేద రోగుల ప్రయోజనం కోసం ఆసుపత్రిలో రవాణా సంరక్షణ సజావుగా సాగడం కోసం ఎంతో ఉపయోగ పడతా యన్నారు. ఇటువంటి విరాళాలు ఆసుపత్రిలో ఇప్పటికే ఉన్న సేవలను బలోపేతం చేయడానికి, నాణ్య మైన రోగుల సంరక్షణను అందించడానికి దోహదపడతాయన్నారు ఆసుపత్రి విరాళం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ముషీరాబాద్‌లో డ్రయినేజీ వ్యవస్థను ఆధునికరిస్తాం

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రయినేజీ సమస్య ఎక్కువగా ఉందని పూర్తి స్థాయిలో ఆధునికరిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్‌లోని సూర్యనగర్‌లో రూ.18 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ రవి చారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థ శిథిలా వ్యవస్థకు చేరడంతో తరచూ డ్రైనేజీ లీకేజ్‌తో రోడ్ల పైన మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. ప్రతి బస్తీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఎప్పటికప్పుడు నాలా పూడిక తీత పనులు చేపట్టి డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్ . మోజస్, శంకర్ ముదిరాజ్, ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్, కేశవపురం అరుణ్, జనార్ధన్, టీవీ రాజు, ప్రవీణ్ రాజ్, జనార్ధన్, సునీల్, సాబీర్, బస్తీ వాసులు, రవి, ప్రవీణ్, శ్రీనివాస్ పివి శ్రీనివాస్, చిత్తయ్యా, వీర కుమార్, రాహుల్ సింగ్, సుమన్ మధు, జలమండలి అధికారి మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లావ్యాప్తంగా మొత్తం 361 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 76,575 మంది విద్యార్థులు
- విద్యాశాఖ, సంబంధిత శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాసేలా భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో పది పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. వచ్చేనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, జిల్లాలో 76,575 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 361 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, పరీక్ష కేంద్రాలను అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, తగిన ఏర్పాట్లు, కావాల్సిన సిబ్బందిని నియమించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ప్రథమ చికిత్స సదుపాయం కల్పించాలని, అందుకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలను నియమించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఆయా రూట్లలో బస్సులను సకాలంలో నడిపించాలని, అందుకు రీషెడ్యూల్ చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తగినంత పోలీసు సిబ్బందిని నియమించి నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని పోలీసు శాఖ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలన్నారు.

పది పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి గంటముందుగానే ఎగ్జామ్స్ సెంటర్లకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతించారని, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జె.నర్సింగ్ రావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. నరసింహ, ఆర్టీసీ డీఎం జరీన్ హుస్సేన్, డీహెచ్ఎంహెచ్‌వో పీవో డాక్టర్ సుధా మాధవి, శ్రీనివాస్ రెడ్డి, బాపురావు, కె. విద్యాసాగర్ జి.రవి ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి తక్షణం ఆదుకోని సహాయం చేసేవాడు నిజమైన కామ్రేడ్

- మెట్ల మీద నుంచి జారిపడ్డ సీపీఐ(ఎం) గోషామహల్ కన్వీనర్ నాగేశ్వర్
- వెంటనే ఆదుకున్న ఆటో నాయకుడు ఎం.డి.అజీజ్ బాబా



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆపదలో ఉన్న వ్యక్తికి తక్షణం ఆదుకొని సహాయం చేసేవాడు నిజమైన కామ్రేడ్ అని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు, గోషా మహల్ కన్వీనర్ పి నాగేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సాధారణ కార్మికుడి సమస్య పరిష్కారానికై నాంపల్లిలోని హైదరబాద్ ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లి వస్తుండగా మెట్లు దిగే క్రమంలో ఆయన కుడి కాలు స్లిప్ అయి మెట్లపై నుండి క్రింద పడిపోయాడు. ఉస్మానియా ఆస్పత్రో చికిత్స పొందిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీఓ కార్యాలయం వద్ద కింద పడి తీవ్రనొప్పితో బాధ పడ్తుండగా సమాచారం తెలుసుకున్న సీఐటీయూ ఆటో యూనియన్ నాయకుడు ఎం.డి. అజీజ్ బాబా పది నిమిషాల్లో అక్కడకు చేరుకుని, ఆయన ఆటోలో వెంటనే ఉస్మానియాకు తరలించి వైద్య చేయించాడన్నారు. కాలు కు తగిలిన గాయం నుండి నాగేశ్వర్ త్వరగా కోలుకుని ప్రజాజీవితంలో లోకి వస్తారని సీఐటీయూ గోషా మహల్ జోన్ కన్వీనర్ కే.జంగయ్య ఆకాంక్ష వ్యక్తం చేశారు. కొంత సేపటికి నాగేశ్వర్ దగ్గరి బంధువులు కే. శ్యామ్, కీర్తి కుమార్‌లు వచ్చి ఆయనను ఇంటికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో 108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులకు జీవీకే ఈఎంఆర్ మేనేజ్మెంట్ 1,50,000 బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం 108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగులు ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2016 నుండి 108 అంబులెన్స్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఇ.ఎమ్.టి పైలట్లకు జీవీకే ఇయంఆర్ మేనేజ్మెంట్ జూలై 2023 వరకు ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం చెల్లించిన డబ్బుల్లో 1,50,000 ఇవ్వాల్సి ఉందన్నారు. వీటిపై ప్రభుత్వం టెండర్లకు పోక ముందే ఎన్హెచ్ఎమ్ స్పాన్సర్లు ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, వైద్య ఆరోగ్యశాఖ సెక్రెటరీ అన్ని ఆధారాలతో వినతి పత్రాలు అందజేసిన కనీసం స్పందన లేదన్నారు. జీవీకే ఈఎంఆర్ మేనేజ్మెంట్ తరఫున రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఎలాంటి కార్మిక చట్టాలను అమలు చేయకుండా జీవీకే ఈఎంఆర్ సంస్థ దొంగ లెక్కలు చూపిస్తూ ప్రభుత్వం అధికారులను మోసం చేస్తుందన్నారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ ధర్నాలో ఉద్యోగులు నరసింహ, రాజు ,పాష, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్ బాబా సభా ధ్యక్షతన 2024 సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభ నిర్వహించారు. బుధవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకట స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వెన్నల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... డాక్టర్. అంబేద్కర్ జీవిత చరిత్రను, బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే తదితర మహనీయుల జీవిత చరిత్రను బహుజనులకు ఉపయోగపడే అనేక చట్టాలను, శాసన సభ్యుల వివరాలను, అనేక జీవోలను ఒక్క దగ్గర పొందు పరచి అత్యంత సుందరంగా సభ్యులు రూపొందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌సిఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వర్ రావు, ఎస్.నర్సింహా రావు, ఎస్‌సిఆర్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్ బాబు, ప్రధాన కార్యదర్శి దాసరి రవీందర్, రుద్రారం శంకర్, కె.వినోద్ కుమార్, ఏపి రాష్ట్ర ఎస్‌సిఆర్‌పిఎస్ అధ్యక్షులు కె.చెన్నకేశవ రావు, దాసరి యాదగిరి, డి.శంకర్, గుంటి విజయ్ బాబు, కుర్మ మహేందర్, వీణ, స్టాలిన్, క్రిష్ణవేణి, ఏసిపి నవీ న్, బట్టు క్రిష్ణ, మల్లేష్, ఎల్లం కుమార్, డి.థామస్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా జీహెచ్ఎంసీ పుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

జీహెచ్ఎంసీ సిబ్బంది పుట్‌పాత్ ఆక్రమణలను కూల్చివేశారు. పుట్‌పాత్ ఆక్రమణలో కూల్చివేతల్లో భాగంగా బుధవారం బొగ్గులకుంట ప్రధాన రోడ్డులో జీహెచ్ఎంసీ సిబ్బంది పుట్‌పాత్ ఆక్రమణలు చేపట్టారు. ఆక్రమణల కూల్చివేతల్లో భాగంగా అక్కడే ఉన్న గణేష్ మండపాన్ని కూల్చేవేశారు. గణేష్ మండపాన్ని కూల్చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు దశాబ్దాలుగా యువక్ సంఘ్ నేతృత్వంలో స్థానికులు గణేష్ ఉత్సవాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాల కోసం వినియోగిస్తున్న గణేష్ మండాపాన్ని కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ యువక్ సంఘ్ ఆధ్వర్యంలో బస్తీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువక్ సంఘ్ అధ్యక్షులు పిఎల్ రాబ్సన్, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డిఎల్ జ్ఞానేశ్వర్ శివానంద్, క్యారిల్ జేమ్స్‌లు మీడియాతో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ సిబ్బంది నేలమట్టం చేసిన గణేష్ మండపాన్ని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ముఖేష్ జై స్వాల్ అనే వ్యక్తి బొగ్గులకుంటలో 4 అంతస్తుల భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖేష్ జైస్వాల్ నిర్వహించే హాస్టల్ భవనానికి పుట్‌పాత్ ఇనుపమెట్లు పుట్‌పాత్ అక్రమంగా నిర్మించారని, బొగ్గులకుంటలో పుట్‌పాత్ ఆక్రమణలు కూల్చివేతలు చేపట్టిన జీహెచ్ఎంసీ సిబ్బంది పుట్‌పాత్ హాస్టల్ భవనానికి అక్రమంగా నిర్మించిన ఇనుప మెట్లను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. పుట్‌పాత్ అక్రమంగా నిర్వహిస్తున్న టీ దుకాణం, చెరుకు బండి, కొబ్బరి బొండాం, కూరగాయ నిర్వాహకుల నుండి ప్రతి రోజూ ఒక్కొక్కరి నుండి రూ. 200ల చొప్పుల వసూలు చేసేవారని ఆరోపించారు. పుట్‌పాత్ ఆక్రమణలను నేలమట్టం చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది అక్రమంగా నిర్మించిన ఇనుప మెట్లను మాత్రం కూల్చకుండా వివక్ష పాటించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ముఖేష్ జైస్వాల్ కుమ్మక్కై చిరు వ్యాపారుల కుటుంబాలను రోడ్డుపడేశారని ఆరోపించారు. ఈ విషయమై డిప్యూటీ మున్సిపల్ కమీషనర్‌తో పాటు జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కూల్చిన గణేష్ మండపాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువక్ సంఘ్ ప్రతినిధులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారాలి

తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం అధ్యక్షుడు కొవ్వూరు భాస్కర్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట:

బీసీ శక్తి రాజకీయ శక్తిగా మారి అన్ని వర్గాలను కలుపుకుని రాబోయే రోజుల్లో అధికారం చేపట్టాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం అధ్యక్షుడు కొవ్వూరు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్. వీ. మహేందర్ కుమార్, ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం కొవ్వూరు బాస్కర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కొవ్వూరు భాస్కర్ రావు నేతృత్వంలో త్వరలోనే రాజకీయాలకు అతీతంగా బీసీ ప్రముఖుల అందరిని ఒకే వేదికపైన ఘనంగా సత్కరించి బీసీల సత్తా చాటేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడం హర్షించదగిన పరిణామమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు కేటాయించాలని, బీసీ వర్గాలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. త్వరలోనే రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి బీసీల ఐక్యతా సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలి పారు. దేశ జనగణనలో కులగణన చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బీసీలందరూ సంఘటితంగా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతిని ధులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి సంస్కృతం ప్రతిబింబం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రాచీన కాలం నుండి సంస్కృత భాష మన సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిందని సంస్కృత అకాడమీ సంచాలకులు ఆచార్య కాశొజ్జుల నీలకంఠం అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు బుధవారం ఆయనకు ప్రముఖ సంస్కృత పండితుడు, విద్యాలంకార ముదిగంటి గోపాల్ రెడ్డి పురస్కారం ప్రదానం చేసింది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రాచీన రాతప్రతుల గ్రంథాలయం పూర్వ సంచాలకులు ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం, గోపాల్‌రెడ్డి సతీమణి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డిల చేతుల మీదుగా నీలకంఠాన్ని 25 వేల రూపాయల నగదు, జ్ఞాపిక శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆధునిక కాలంలో సంస్కృత భాషా ప్రాధాన్యం పై ప్రత్యేక ప్రసంగం చేస్తూ సంస్కృతాన్ని అధ్యయనం చేస్తే పలు శాస్త్రాలలో అవగాహన ఏర్పడుతుందన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షో పన్యాసం చేస్తూ సంస్కృతానికి మన దేశం పుట్టినిల్లు అయినా మనకంటే విదేశీయులే ఎక్కువగా సంస్కృతాన్ని అధ్యయనం చేస్తున్నా రని తెలిపారు. ఇతర భాషలతో పాటు సంస్కృతాన్ని ఎక్కువగా అక్కున చేర్చుకున్నది తెలుగు భాషే అన్నారు. గ్రామీణ ప్రాంతంలో జన్మించిన ముదిగంటి గోపాల రెడ్డి సంస్కృత భాషా సాహిత్యాల్లో ప్రపంచ ప్రసిద్ధుడైన పండితునిగా పేరు పొందారని శివారెడ్డి కొనియాడారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగతం పలికారు.

మెడికల్ అండ్ హెల్త్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం

రాష్ట్ర టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర టేబుల్ క్యాలెండర్-2024 ను ఆవిష్కరిస్తున్న డిహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్, సలహాదారులు జె డి శశిశ్రీ, అధ్యక్షురాలు రామలక్ష్మి ,ప్రధాన కార్యదర్శి సుజాత రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎమ్ ఎస్ మూర్తి, ఉపాధ్యక్షులు బి రత్నంరాజును, అనసూర్య, విజయనిర్మల,ఆమని ,చంద్రకళ, లలిత, ఐఎన్‌టీయుసీ నాయకులు వెంకటేశ్వర్లు రెడ్డి, వేణుగోపాల్, మచ్చ గిరి ,రాబర్ట్ బ్రుస్ తదితరులు పాల్గొన్నారు.

మారం జగదీశ్వర్ కుమార్తె వివాహానికి హాజరైన టీఎన్జీవోస్ నేతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కుమార్తె వివాహం బుధవారం కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని రాజశ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) దంపతులు, సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, ఉపాధ్యక్షులు పర్వతాలు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శస్త్ర హాజరై నూతన వధూవరులు సాహితీ, కళ్యాణ్ కుమార్‌లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసీ మెంబర్లు శంకర్, శ్రీధర్, న్యాయ సలహాదారు సంఘం టీపే యూనిట్ ప్రెసిడెంట్ అరుణ్, సెక్రటరీ పవన్, సుదర్శన్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ మహ్మద్, చౌష్ నూతన వధువరులను ఆశీర్వదించారు.

సహజ జననమా..? సిజేరియనా..?



నవతెలంగాణ-సిటీబ్యూరో

తల్లిదండ్రులు తమ పిల్లల రాక కోసం సిద్ధమవుతున్నప్పుడు వారు ఎదుర్కొనే అతి పెద్ద సమస్య, తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల్లో ఒకటి సహజ జననం, సిజేరియన్ విభాగం (సి-సెక్షన్) మధ్య ఎంచుకోవడం అని డాక్టర్ చందన గాలిదేవర, కన్సల్టెంట్ ఒబెస్ట్రిషన్, గైనకాలజిస్ట్, హై-రిస్క్ ప్రెగ్నెన్సీ, ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్ట్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్ తెలిపారు. సహజ జననం, సి-సెక్షన్ మధ్య ఉత్తమమైనది ఎంపిక చేసుకునేటప్పుడు పరిగణాంచాల్సిన ప్రాథమిక అంశాల్లో ఒకటి తల్లి, బిడ్డ ఇద్దరి వైద్య పరిస్థితి.. రక్తపోటు, మధుమేహం లేదా గుండె జబ్బులు వంటి ప్రసూతి ఆరోగ్య పరిస్థితులు స్త్రీ జననేంద్రియాలు ద్వారా డెలివరీ అను కూలతను ప్రభావితం చేయవచ్చు. ప్లాసెంటా ప్రెవియా, కాంట్రాక్టేడ్ పెల్విక్, ఫీటల్ డిస్ట్రెస్ లేదా బ్రీచ్ ప్రెజెంటేషన్ వంటి ప్రసూతి సంబంధ సమస్యలకు సి-సెక్షన్ అవసరం కావచ్చు అని తెలిపారు.

శానిటేషన్ మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ సిటీబ్యూరో

శానిటేషన్ మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ స్వచ్ఛ భారత్, రాంకీ ప్రతినిధులతో పాటు శానిటేషన్ అడిషనల్ కమిషనర్ తో కలిసి కమిషనర్ రోనాల్డ్ రోస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రాథమిక దశలో ఇంటింటికీ చెత్త సేకరణ సక్రమంగా జరుగుటలేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇక నుండి ఎలాంటి ఆరోపణలు రాకుండా డీసీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదులు రాకుం డా డీసీలు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో కేటాయించిన ఇండ్లకు రోజు లక్ష్యం మేరకు సేకరణ పూర్తి చేస్తున్నారో లేదో గమనించాలని కమర్షియల్ కాంప్లెక్స్ మాల్స్ హోటల్, ఫంక్షన్ హాళ్లల వద్ద ఏర్పడిన వ్యర్థాలను సకాలంలో తీసుకొకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్వీపింగ్ మిషన్లపై కూడా నిఘా పెట్టాలని నిర్దేశించిన సమయం వరకు స్వీపింగ్ చేయించాలన్నారు. బస్తీ ఆక్షన్ ప్లాన్ బస్తీ స్థాయిలో వ్యర్థాలను సేకరించేందుకు ట్రై సైకిల్ ఏర్పాటు చేయాలని బస్తీవాసులకు ఈ విషయంలో అవగాహన కల్పించాలన్నారు.


వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న దొంగలు అరెస్ట్



నవతెలంగాణ-ముషీరాబాద్

వరుస బైక్ దొంగతనా లకు పాల్పడుతున్న దొంగలను దోమలగూడ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీ పట్నం ఇందిరానగర్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ సమీర్, డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరం కాలనీకి చెందిన షేక్ అల్తాఫ్ విద్యార్థి, మహమ్మద్ ఒమేర్ విజయ నగర కాలనీ, వృత్తిరీత్యా పంచర్ షాప్ నిర్వహిస్తున్నాడు. మలక్‌పేట్‌కు చెందిన శేఖర్ స్క్రాప్ షాప్ నడుపుతు న్నాడు. ఈ నలుగురు ఒక ముఠాగా ఏర్పడి దోమలగూడలోని ఏజీఎస్ బైక్ సర్వీస్ పాయింట్, అప్పర్ ట్యాంక్ బండ్ నందు గ్యారేజ్ తాళం పగుల్లగొట్టి ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీగిరి శ్రీకాంత్‌లు క్రైమ్ టీంతో కలిసి చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారు. విచారించగా ఐదు ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. వాహనాలను భాగాలుగా విడదీసి స్క్రాబ్ చేసి అమ్ముతున్నారు. సుమారు 2 లక్షల ఉంటు oదని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరల ప్రకారం దోమలగూడ లోని ఒక్క హోటల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (55) గత కొన్ని రోజులుగా బిక్షటన చేస్తూ రోడ్డుపైన జీవి స్తున్నాడు. అతను తీవ్ర అనారోగ్యానికి గురై ఫుడ్ పాత్ పై పడి ఉండడం గమనించిన చుట్టుపక్కల వారు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గమనించగా అప్పటికి ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి మృతుడి వివరాలకు దర్యాప్తు చేపట్టారు.

డిజిటల్ వాలెట్ అమేజాన్ పే బ్యాలెన్స్..

నవతెలంగాణ-సిటీబ్యూరో

సౌకర్యవంతమైన డిజిటల్ అమేజాన్ పే బ్యాలెన్స్ అందుబాటులోకి వచ్చింది. దీంతో పేమెంట్ యాప్స్ మధ్య మారడం, వివిధ చెల్లింపు పద్ధతులను వినియోగించడం, చెల్లింపు వివరాలు నమోదు చేయడం, ప్రతి లావాదేవీ కోసం ఓటీపీలు, చెక్ అవుట్ గేట్ వేస్ సమయం ముగియడానికి ముందు లావాదేవీలు పూర్తి చేయడానికి హడావిడి పడటం వంటి ఆందోళనలకు ఇక వీడ్కోలు చెప్పవచ్చు. అన్ని రకాల డిజిటల్ చెల్లింపుల అవసరాలకు ఇది ఏకైక పరిష్కారంగా నిలుస్తుంది. ఒకసారి లోడ్ చేసుకొని రోజువారీ చెల్లింపు అవసరాలు కోసం వాడవచ్చు. ఇక అకౌంట్ స్టేట్మెంట్‌లో బహుళ ఎంట్రీస్ ఉండవు. 1-క్లిక్ చెల్లింపులు, వేగవంతమైన, సురక్షితమైన, నమ్మకమైన, బహుమాన పూర్వకమైన చెల్లింపు నిరంతరంగా చేసుకోవచ్చు.

హైదరాబాద్ డీపీఆర్ఓగా అబ్దుల్ కలీం బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా(డీపీఆర్ఓ) అబ్దుల్ కలీం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్లౌకోమా ఆప్టిక్ నాడిని దెబ్బ తీస్తుంది



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్లౌకోమా కంటి పరిస్థితుల సమూహం అని, ఇది ఆప్టిక్ నాడిని దెబ్బ తీస్తుందని కూకట్‌పల్లి మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ గ్లౌకోమా అండ్ క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ హర్షిత తెలిపారు. గ్లౌకోమా దూరదృష్టి నష్టానికి దారి తీస్తుందని, చికిత్స చేయకపోతే అంధత్వానికి సైతం దారి తీస్తుందని తెలిపారు. దాని ప్రాబల్యం, తీవ్రమైన పరిణామాలు ఉన్నప్పటికీ, గ్లౌకోమా అనేక అపోహలతో చుట్టుముట్టబడిందని తెలిపారు. దీన్ని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడంలో ఆటంకం కలిగిస్తుందని, ఈ అపోహలను తొలగించడం ద్వారా, వారి దృష్టిని కాపాడటంలో తాము వ్యక్తులను శక్తివంతం చేయొచ్చు అని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమాజిగూడ విద్యార్థులకు ది ఇండియన్ హెడ్ ఇంజురీ ఫౌండేషన్, హీరో మోటో కార్పొరేషన్ ఆర్గనైజేషన్ వారి సాకారంతో ఎస్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లా డుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ట్రాఫిక్ రూల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్ చేతులమీదుగా విద్యార్థులకు కిడ్స్ హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ హెడ్ ఇంజురీ ఫౌండేషన్ సిబ్బంది అనురాధ ప్రసాద్, మారుతి ప్రసాద్, ఎస్ సేవ ఫౌండేషన్ అధినేత ఎమ్.ఎ. బైగ్, చంద్రశేఖర్, రియాన్ మక్విట్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | ఫిబ్రవరి 22, 2024 | www.navatelangana.com

'సమతా నగర్ కాలనీలో మొదలైన నీటి ఇబ్బంది'

నవతెలంగాణ-సిటీబ్యూరో

పాత బోయినపల్లి సమతా నగర్ ఆర్బీఐ కాలనీలో నెల రోజుల నుంచి మంచినీటి సరఫరా సమృద్ధిగా జరగకపోవటం వలన కాలనీవాసులు మంచినీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని కాలనీ అసోసియేషన్ కార్యదర్శి గొట్టిపాటి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో అన్నారు.. వేసవికాలం రాకముందే నీటి కటకట మొదలైందని, కేటాయించిన సమయం ప్రకారంగా నీటి సరఫరా చేస్తున్నా.. తక్కువ స్థాయిలో సరఫరా ఉంటున్నదని తెలిపారు. ఫలితంగా నీరు ఒక్క రోజుకు కూడా సరిపోవడం లేదని చెప్పారు. ఒకే సమయంలో నీరు సరఫరా చేయకపోవడంతో ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లేవారు నీరు నిల్వ చేయలేకపోతున్నారన్నారు. ఫలితంగా తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో గ్రేటర్ హైదరాబాద్ నీటి సరఫరా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం అని ఆరోపించారు. సమతా నగర్ కాలనీ ఎత్తు ప్రదేశంలో ఉండడంతో కూడా నీటి సరఫరా అత్యంత తక్కువగా ఉంటుందని కావున సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకొని మెరుగైన నీటి సరఫరా చేయాలని కోరారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన డీసీ



నవతెలంగాణ-ఓయూ

నూతనంగా సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన సుభాష్ రావు బుధవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డిలను తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.



ఓయూ తెలుగు శాఖ హెడ్‌గా ప్రొ. సాగి కమలాకర శర్మ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఓయూ

తెలుగు భాషా, సాహిత్యాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులుగా ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మాజీ హెడ్ ప్రొ. సి. కాశీం బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా కమలాకర శర్మ మాట్లాడుతూ వందేండ్లు పూర్తి చేసుకున్న తెలుగు శాఖకు అధ్యక్షున్ని కావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలుగు శాఖ ఔన్నత్యాన్ని చాటే విధంగా భాషా, పరిశోధనలను ప్రోత్సహిస్తూ, నిరంతర అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన అన్న అంశాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామని అన్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధన పట్ల శ్రద్ధ వహించి ఉత్తమమైన పరిశోధన సిద్ధాంత గ్రంథాలను సమర్పించాలని సూచించారు. విద్యార్థులకు, పరిశోధకులకు శాఖ తరఫున అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. చింతా గణేష్, ప్రొ. సూర్య ధనుంజయ్, డా. ఎస్ రఘు డా. విజయలక్ష్మి, ఇమ్మిడిమహేందర్,కె.వెంకట్, క్రాంతి నాయక్ పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



మూడో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 3వ వార్డులో ఎమ్మెల్యే లాస్యనందిత బుధవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మడ్‌ఫోర్డ్ గాంధీ నగర్‌లో దక్షిణ కాళీమాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వాటర్ పైపు లైన్‌తో పాటు కొత్త బోర్ వెల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, పలువురు సీనియర్ నాయకులు, యువ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ జాయింట్ సెక్రటరీగా ప్రొ. వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల బిఓఎస్ సీనియర్ ప్రొఫెసర్ ప్రొ.ఎన్.వెంకటేశ్వర్లు యూజీసీ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. గతంలో లా కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, లా విభాగం హెడ్, శాతవాహన, మహాత్మాగాంధీ, ఓయూ యూనివ ర్సిటీ బిఓఎస్ చైర్మెన్ గా, లీగల్, ఎస్టేట్ సెల్ డైరెక్టర్, అడిషినల్ కంట్రోలర్ గా ఆయన పనిచే శారు. పాలమూరు యూనివర్సిటీ డీన్ గా పని చేస్తున్న సందర్భంలో అక్కడ న్యాయ కోర్సులు ప్రవేశ పెట్టడంలో కీలకమైన ప్రత్యేక పాత్ర పోషించారు. 20 పీహెచ్డీలు పూర్తి చేశారు. యూజీసీ రిసెర్చ్ అవార్డ్‌తో పాటు ఓయూ వీసీ అవార్డ్ పొందారు. సౌత్ ఇండియాలో కార్పోరేట్ అండ్ సెక్యూరిటీస్ లా నైపుణ్యం కలిగిన ఉన్నారు. ప్రస్తుతం బషీర్ బాగ్ లా కళశాల ప్రిన్సిపాల్‌గా పనిచే స్తున్నారు. ఓయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు, సహకరించిన వారికి ఆయన కృతజ్ఞత లు తెలియజేశారు. పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఓయూ రావాల్సిన గ్రాంట్స్, ప్రాజెక్టు విషయం లో ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు చెప్పారు.



విరంచి ఆస్పత్రి సౌజన్యంతో మేడారాం జాతరలో ఉచిత మెడికల్ క్యాంప్

- లతామా ఫౌండేషన్ మాధవి లత కొంపెల్ల..

నవతెలంగాణ-బంజారాహిల్స్

మేడారం జాతరలో భారీ స్థాయిలో బీజేపీ మెడికల్ సెల్ నేతృత్వంలో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపును లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి లత కొంపెల్ల ఆధ్వర్యంలో విరించి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహిస్తోందని ఆమె తెలిపారు. వైద్యులు, మందులు,సిబ్బందిని అందుబాటులో ఉండి నిరంతరం ప్రజలకు ఉచిత వైద్య సదుపాయాన్ని అందించే నాలుగు అంబులెన్సులు, వాహనాలను బుధవారం బంజారాహిల్స్‌లో జెండా ఊపి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లతామా ఫౌండేషన్ వారు విరించి హాస్పిటల్ సౌజన్యంతో ఎన్నో ఉచిత మెడికల్ క్యాంపులను హైదరాబాదు పార్లమెంటు పరిధిలో పేదల కోసం నిర్వహిస్తోందని చెప్పారు. ఉచిత మెడికల్ క్యాంపులే కాకుండా అవసరమైన వారికి ఇతరత్రా వైద్య సహాయం కూడా లతామా ఫౌండేషన్ ద్వారా అందిస్తోందని వివరించారు. లక్షలాది మంది తెలంగాణా వాసులు హాజరయ్యే మేడారాం జాతరలో బీజేపీ మెడికల్ సెల్ నిర్వహిస్తోన్న ఈ ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తద్వారా సమ్మక్క, సారమ్మలను దర్శించే భక్తులకు సేవలను అందించగలు గుతున్నామని చెప్పారు.

బోరబండలో మహిళ అదృశ్యం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



మహిళ అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజ్ నగర్, రోజ్ బేకరీ వద్ద నివసిస్తున్న సాయి క్రాంతి, అదే ప్రాంతంలో నివసిస్తున్న మాధురి(25) మూడు సంవత్సరాల క్రితం ఇద్దరూ ఇష్టపడి ఇరు కుటుంబాలకు తెలియకుండా వివాహం చేసుకొని రాజ్ నగర్‌లో నివసిస్తున్నారు. అయితే ఏడు నెలల క్రితం సాయి క్రాంతి తల్లిదండ్రులు ఇద్దరికీ తిరిగి వివాహం చేస్తామని వారి కుమారుని ఇంటికి తీసుకుని వెళ్లారు. అప్పటినుంచి ఆమె కూడా తన పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో సాయి క్రాంతి మాధురితో మాట్లాడటం మానేశాడు. మనస్తాపంతో డిప్రెషన్‌కు వెళ్లిన మాధురి, ఈనెల 15న మెడికల్ షాప్ కు వెళ్లి టాబ్లెట్స్ తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదని అమ్మాయి తండ్రి సంసోను పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బోరబండ పీఎస్ నెంబర్ 8712665189కు కాల్ చేయాలని కోరారు. సీసీ కెమెరాలు పరిశీలించి త్వరలో మాధురి ఆచూకీ తెలుసు కుంటామని సబ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కుమార్ ఆమె కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

బస్సుల్లేక.. ప్రయాణికుల అవస్థలు..!

- గంటల తరబడి బస్టాప్‌లోనే వెయిటింగ్.. వచ్చినా బస్సు నిండా జనమే
- నగరంలో ఉద్యోగులు, విద్యార్థులు, బస్ పాస్ హెూల్డర్లు మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం
- ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ





నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసమని టీఎస్ఆర్టీసీ యాజ మాన్యం గ్రేటర్ జోన్‌లోని 80శాతంపైగా బస్సులను పంపించింది. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపో వడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మేడారం జాతర జరిగే నాలుగు రోజులు సర్దుకుపోవాలని సాధారణ ప్రజలను విజ్ఞప్తి చేసినప్పటికీ.. జనం మాత్రం టీఎస్ఆర్టీసీ తీరుపై మండిపడుతున్నారు. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లే మహిళలు, కార్మికులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఉదయం, సాయంత్రం గంటల తరబడి బస్టాపుల్లో గంటలకొద్దీ పడిగాపులు కాస్తున్నారు. మూడు రోజులుగా తమ గమ్యస్థానాలకు చేరేం దుకు నానా



తిప్పలు పడుతు న్నారు. ముఖ్యంగా బస్‌పాస్ హెూల్డర్స్, మహిళల పరిస్థితి దారుణం. ఆర్టీసీ బస్సు వస్తే తప్ప.. ఆటో, క్యాబ్‌లో వారు ఎక్కి వెళ్లే పరిస్థితి లేదు. ఏ గంటకో ఒక బస్సు వచ్చిన.. వాటిల్లోనూ పోటీలు పడీ ఎక్కుతుండడంతో అర్థంకాని పరిస్థితి. చాలామంది ప్రయా ణికులు ప్రమాదకర స్థితిలో ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్లు వద్దని చెప్పినా వినే పరిస్థితి లేదు. మొత్తానికి ఆర్టీసీ నిర్ల యంతో వందలాది ప్రయాణికులకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది.

ఒకటి రెండు స్టాపుల్లోనే ఫుల్

ఉదాహరణకు కొండాపూర్ టు సికింద్రాబాద్ రూట్‌లో నడిచే 10 నెంబర్ బస్సులు చూస్తే.. కొండాపూర్ నుంచి బయలుదేరి హైటెక్ సిటీకి వచ్చేలోపే బస్సు నిండిపోతోంది. ఆ తర్వాత వచ్చే మాదాపూర్, పెద్దమ్మగుడి స్టాపుల్లో జనాన్ని ఎక్కించుకున్నా.. నెక్స్ వచ్చే ఉషాకిరణ్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, ఎల్వీ ప్రసాద్, టీవీ9, పంజాగుట్ట ఇలా సికింద్రాబాద్ వరకు బస్సునిండా పబ్లిక్ కిక్కిరిసిపోతుం డడంతో తర్వాత స్టాపుల్లో అప్పటికే బస్సు కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న వారిని ఎక్కించుకునే పరిస్థితి లేదు. ఎవరైనా ప్యాసింజర్ దిగాల్సి ఉంటే డ్రైవర్ స్టాప్‌లో కాకుండా బస్సును ఎక్కడో ముందుకు తీసుకువెళ్లి ఆపాల్సిన పరిస్థితి ఉంది. ఆ బస్సు కోసం మహిళలు పరుగులు పెడుతున్నారు. గ్రేటర్ అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్న ఆటోలు, క్యాబ్‌లు..!

ఇదిలావుంటే నగరంలో సిటీ బస్సుల అరకొరగా నడుస్తుం డడంతో ఆటోలు, క్యాబ్‌లకు గిరాకీ పెరిగింది. గంటలకొద్దీ బస్టాపుల్లో ఎదురుచూస్తున్నవారు ఎంతకి బస్సుల రాకపోవడంతో ఆటో, కార్లను ఆశ్రయిస్తుండగా.. కొందరు మెట్రో రైళ్లలో తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇక ఇదే అదునుగా భావించి కొంతమంది ఆటోవాలాలు, క్యాబ్ డ్రైవర్లు రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సిటీ ప్రయాణికుల అవసరాలకు సరిపడా బస్సులను ఉంచి.. మిగతా బస్సులను జాతర భక్తుల కోసం నడిపిస్తే.. ఎవ్వరికి సమస్య ఉండేది కాదు. అలాకాకుండా 90 శాతం బస్సులనీ అక్కడికి పంపిస్తే.. డబ్బులు చెల్లించి బస్సు పాస్‌లు తీసుకున్నవారి పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి స్కీం అమలవుతున్నప్పటి నుంచి మహిళ ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు బాగులేదని పలువురు మహిళ ప్రయాణికులు ఫిర్యాదు చేయడం గమనార్హం.

బోర్లకు మీటర్లను ఏర్పాటు చేయవద్దు

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే నందిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో స్థానికుల ఇండ్లలో ఏర్పాటు చేసుకున్న బోరు పంపులకు మీటర్లు పెట్టి పన్నులు వసూలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే లాస్య నందిత కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ ను కోరారు . మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యుడు పాండు యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బుధవారం మధ్యాహ్నం కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓను ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఒక వినతి పత్రాన్ని బోర్డు సీఈఓకు వారు అందజేశారు. అనంతరం వారు సీఈఓతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇండ్లల్లో బోర్లకు మీటర్లకు బిగించి పన్నులు వసూలు చేయటం అమానుశమని చెప్పారు. రాష్ట్రంలో గతంలో కేసీఆర్ సర్కార్ ఉచితంగా మంచినీటి సరఫరా చేస్తే కంటోన్మెంట్ బోర్డు అధికారులు మాత్రం ఇప్పుడు బోర్లకు మీటర్లు పెట్టి పన్నులు వసూలు చేయడం సరికాదని ఈ విషయంపై ఆలోచించాలని వారు కోరారు. మీటర్ల ఏర్పాటు వల్ల వల్ల పేదలు అనేక ఇబ్బందుల కు గురవుతారని ఎమ్మెల్యే చెప్పారు. కంటోన్మెంట్ సీఈఓ స్పందిస్తూ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నందిత., ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డిలో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఇండ్లల్లో బోరు లకు మీటర్లు బిగించడం వల్ల నీటి పరిరక్షణ ఏమి జరగదని, పరిరక్షణ చేయటం ఈ పద్ధతి కాదని అన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి ఇంకా ఇతర పద్ధతుల ద్వారా నీటిని పరిరక్షించుకోవచ్చని ప్రజలు లక్షల రూపాయల ఖర్చుపెట్టి ఇండ్లలో వేసుకున్న బోరింగ్‌లకు మీటర్ ఏర్పాటు చేయటం ఎక్కడా లేదని అన్నారు.

పర్యావరణ రక్షణకు మార్చి 31న బహిరంగ సభ

- ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ బయో డీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చంద్ర శేఖర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పర్యావరణాన్ని రక్షించేందుకు, ప్రజలను చైతన్యం చేసేందుకు మార్చి 31న సికింద్రాబాద్ హరిహరకళా భవన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్, బయో డీజిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు చంద్ర శేఖర్ తెలిపారు. బుధవారం సంస్థ ప్రతినిధులతో కలిసి కంటోన్మెంట్ గార్డెన్‌లో వారు సమావేశంలో మాట్లాడారు. కాలుష్యం వల్ల పర్యావరణం కలుషితమైన మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ తమ సంస్థ రాజీలేని పోరాటం చేస్తున్నదని తెలిపారు. కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్య పాలై వారి కుటుంబాలు ఆర్థికంగా వెనుక పడుతున్నారని చెప్పారు. ప్రస్తుత పర్యావరణంపై ప్రభుత్వానికి ఓ నివేదిక ఇవ్వనున్నామన్నారు. బహిరంగ సభ లో విద్యావేత్తలు, లాయర్లు, నాయకులు,వివిధ సంఘాల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొంటారని వారు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు గందమాల యాదయ్యా ప్రతినిధులు మోత్కూరు మల్లేష్, కే బి నర్సింగ్ రావు, సి.అప్పారావు,బి.లక్ష్మణ్ రావు, పి.శ్యామ్యుల్, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ప్లానింగ్ బ్లూప్రింట్ టెక్నాలజీతో
షోల్డర్ జాయింట్ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్సలు



నవతెలంగాణ-బేగంపేట్

సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మెన్, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గురవారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి, షోల్డర్ సర్జన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా షోల్డర్ జాయింట్ రీప్లేస్మెంట్‌లో అధునాతన విధనాలు, టెక్నాలజీ, ఇంప్లాంట్స్ గురించి చర్చించారు. సదస్సుకు ప్యారిస్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షోల్డర్ సర్జన్ డాక్టర్ జీన్ గిమ్బ్లెర్గ్ హాజరయ్యారు. ఇప్పటివరకు టెక్నాలజీలో 100 మంది ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చారు. షోల్డర్ సర్జరీ విభాగానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ అండ్ షోల్డర్ శస్త్రచికిత్సా నిపుణులు డాక్టర్ బి.చంద్రశేఖర్, డాక్టర్ అనూష్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా హాస్పిటల్‌లో చేస్తున్నామని, షోల్డర్ జాయింట్ రీప్లేస్మెంట్ గురించి ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్నా గత దశాబ్ద కాలంగా షోల్డర్ సర్జరీలో అధునాతన అడ్వాన్మెంట్ పురోగతి వచ్చిందని, మోకాలు మార్పిడి శస్త్రచికిత్స లాగానే భుజం జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీల్లో కూడా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన "బ్లూప్రింట్ టెక్నాలజీ" ఉపయోగించి సర్జరీ ప్లానింగ్ నూతన జాయింట్ పొజిషన్, సైజ్ని ఆపరేషన్ కంటే ముందుగానే ఖచ్చితంగా నిర్ణయించవచ్చని తెలిపారు. ఈ టెక్నాలజీ ఉపయోగించి ఆపరేషన్ చేయడం వల్ల ఆపరేషన్ ఖచ్చితత్వం పెరగడంతో పాటు ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. దీంతో రోగులకి మంచి రిజల్ట్స్ ఇవ్వగలుగుతున్నామని సూచించారు. ఈ సందర్భంగా ఆధునిక టెక్నాలజీ గురించి ప్రఖ్యాతి గాంచిన షోల్డర్ సర్జన్ డాక్టర్ జీన్ గిమ్బ్లెర్గ్ వివరించారు.

థియేటర్ కార్మికులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మారన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

సినిమా థియేటర్ కార్మికులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మారన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ సుదర్శన్ సినిమా థియేటర్లో గాయపడిన కార్మికులను యూనియన్ రాష్ట్ర నాయకుల బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆకతాయిలు వర్షం సినిమా ప్రదర్శన సందర్భంగా సినిమా థియేటర్ కార్మికులపై కొంతమంది దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కార్మికులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మధ్యకాలంలో సినిమా హీరోల అభిమానులు వికృత చేష్టలతో థియేటర్‌ను నష్టపరుస్తూ కార్మికుల పైన దాడులు చేస్తున్న ఘటనలు కోకోలలుగా జరుగుతున్నాయని.. ఇలాంటి దాడులు జరగకుండా అభిమానులను సక్రమమైన దారిలో నడిపించవలసిన బాధ్యత సినిమా హీరోల అభిమాన సంఘాలకు ఉందని గుర్తు చేస్తున్నామన్నారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు మారన్న రాష్ట్ర కార్యదర్శి, అరుణ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లారావు,కమలాకర్, రామస్వామి, సుధాకర్ సతీష్ తదితరులు ఉన్నారు.

స్త్రీ జననేంద్రియ వ్యాధులపై అవగాహన అవసరం

- అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

స్త్రీ జననేంద్రియ వ్యాధులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. ఎండోమెట్రియోసిస్ అవేర్‌నెస్ నెలలో భాగంగా డాక్టర్ రూమ్ సిన్హాతో కలిసి పెయిర్ అకాడమీ అపోలో హాస్పిటల్స్ జూబ్లీహిల్స్ ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండోమెట్రియోసిస్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది మహిళలను ప్రభావితం చేసే ఒక ఆరోగ్య పరిస్థితి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ విషయంలో సహాయపడేందుకు ఎండో మార్చ్, ఎండోమెట్రియోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా, పెయిర్‌తో భాగస్వామ్యం కలిగి ఉన్నందుకు సంతోషిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆరోగ్య సమస్యలపై ఓపెన్ గా మాట్లాడేందుకు ఇవి ఎంతగానో ప్రోత్సహిస్తాయని చెప్పారు. ఎండోమెట్రియోసిస్ అనేది ఒక సాధారణ, దీర్ఘకాలిక, స్త్రీ జననేంద్రియ స్థితి అన్నారు. ఎండోమెట్రియోసిస్‌తో ప్రపంచంలో 247 మిలియన్లు, భారతదేశంలో 42 మిలియన్ల మంది ప్రభావితం అవుతున్నారని తెలిపారు. ఇది గర్భాశయం లైనింగ్ లాంటి కణజాలం గర్భాశయం వెలుపల పెరిగే పరిస్థితి అన్నారు. ఎండోమెట్రియోసిస్ ఉన్న స్త్రీలు దీర్ఘకాలిక కంటి నొప్పి, అలసట, నిరాశ, వంధ్యత్వానికి గురవుతారన్నారు. రోగ నిర్ధారణ 6 నుంచి 10 ఏండ్లు ఆలస్యం అవుతుందన్నారు. ఇది మహిళల జీవన నాణ్యతను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ఏడేండ్లుగా సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రూమా సిన్హా నేతృత్వంలో అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎండోమెట్రియోసిస్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, సమాజంలో 50 శాతం మంది మహిళలు ఉన్నారన్నారు. సమాజంతో పాటు కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎండోమెట్రియోసిస్ తో సంబంధం ఉన్న నొప్పి, వంధ్యత్వం వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఎండోమెట్రియోసిస్ అపోహలను తొలగించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని మాట్లాడుతూ మహిళలు వారి భావాలను వ్యక్తం చేయడానికి ముందుకు రావాలన్నారు. మన జీవితాల ద్వారా ఎదుటి వారి మనస్తత్వంలో మార్పు తీసుకురాగలమన్నారు. మహిళలు తగిన సంరక్షణ సకాలంలో అందుకోవడంలో సహాయపడగలమని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ గైనకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్, ఎండోమెట్రియోసిస్ స్పెషలిస్ట్ అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ డాక్టర్ రూమా సిన్హా మాట్లాడుతూ, మహిళలు సున్నితమైన సమస్యలపై చర్చించేందుకు ముందుకు రావడానికి ఇవి సహకరిస్తాయన్నారు. ఇది ముందస్తు రోగ నిర్ధారణ చేయడానికి అవకాశం ఇస్తుందన్నారు. ఎండోమెట్రియోసిస్ చికిత్సకు వైద్యం, శస్త్ర చికిత్సల కృషి అవసరమన్నారు. ఈ దీర్ఘకాలిక వైకల్యంతో ఉన్న మహిళలు తమ జీవితంలో క్రూయిజ్ చేయడంలో డైటీషియన్లు, ఫిజియో థెరపీ యోగా, మనస్తత్వ వేత్తలు అందించే సహాయం మరచిపోకూడదని అన్నారు. శస్త్రచికిత్స చేయమని సలహా ఇస్తే దయచేసి ఎందుకు? అని అడగండన్నారు.

డైరెక్టర్, పేషెంట్ అకాడమీ ఫర్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ డాక్టర్ రత్నా దేవి మాట్లాడుతూ, తీవ్రమైన లక్షణాలు, విపరీతమైన నొప్పిని ఎదుర్కొంటున్న మహిళలకు ఆలస్యమైన రోగనిర్ధారణ, చికిత్సలో సమస్యలను పరిష్కరించడానికి అవగాహన అవసరమన్నారు. అనేక ఇండ్లల్లో మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం ఉంటుందన్నారు. మహిళలు వారి అనుభవా లను బహిరంగంగా చర్చించుకోవడానికి, పరస్పరం సహకరించుకో వడానికి సహాయక వాతావరణం సృష్టించడం అత్యవసరం అన్నారు.స్త్రీ పరిస్థితిని బాగా అర్థం చేసుకోవడానికి స్త్రీ జననేంద్రియ నిపుణులతో కనెక్ట్ అయ్యేలా కమ్యూనిటీని శక్తివంతం చేయడానికి, వ్యక్తిగత అనుభవాలను వివరించే రోగుల కథల సమాహారమైన కాఫీ టేబుల్ బుక్ కూడా తిరిగి ప్రారంభిం చబడిందని తెలిపారు. డాక్టర్ కార్మాన్ నెజాట్, స్టాన్‌ఫోర్డ్ హెల్త్, శాన్ ఫ్రాన్సిస్కో వీడియో సందే శంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తం గా ఎండో మార్చ్, అపోలో హాస్పిటల్స్‌కు భారత కెప్టెన్‌గా డాక్టర్ రూమా సిన్హా గత కొన్నేండ్లుగా ఈ అవగాహన కల్పిం చడంలో చేతులు కలిపినందుకు అభినందనలు తెలిపారు.

నారి మాన్‌కు నివాళులు

నవతెలంగాణ-ఓయూ

ప్రముఖ న్యాయవాది ,పద్మభూషణ్, పద్మవిభూషణ్, మాజీ రాజ్యసభ సభ్యులు ఎఫ్. ఎస్. నారీమన్ మతి దేశ న్యాయవ్యవస్థకు తీరని లోటని ఓయూ జేఏసీ చైర్మెన్ గడ్డం అశోక్ అన్నారు. నరిమాన్ మతి చెందిన సందర్భంగా ప్రముఖ న్యాయవాది,పొలిటికల్ థింకర్ గడ్డం అశోక్ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అయన మాట్లాడుతూ దేశ న్యాయవ్యవస్థకు సేవలందించారని తెలిపారు. నేటి న్యాయ విద్యార్థులకు, న్యాయ వాదులకు నరిమాన్ ఆదర్శం అన్నారు. గడ్డం అశోక్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విప్‌ను పరామర్శించిన ఉప్పరి ఎల్లేష్

నవతెలంగాణ-ఓయూ



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూర్ లక్ష్మణ్ కుమార్‌ను మంగళవారం రాత్రి హైదరాబాద్ లోని యశోదా హాస్పిట ల్‌లో ఓయు మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్ పరామర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకు న్నారు. ప్రజలకు చేసిన సేవనే అడ్లూర్ లక్ష్మణ్ కుమార్‌ను కాపాడిందని, ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో ఉండాలని ఎల్లేష్ కోరారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

నృత్య నీరాజనానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కల్చరల్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీ నృత్య నీరాజనం పేరిట నృత్యం, గానం, సాధన ప్రదర్శనలు శ్రీ శివకాశి విశ్వ విశ్వేశ్వర విశాలాక్షి దేవాలయంలో నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ ఫణీంద్ర కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నృత్య నీరాజనంలో పాల్గొనే కళాకారులకు సర్టిఫికెట్స్ మెడల్స్ తో పాటు రూ. 1116/- నగదు బహుమతిని అందజేయనున్నట్టు చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక దర్శనం తో పాటు శివాభిషేకంలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7901400222 నెంబర్ ను సంప్రదించాలన్నారు.


మటన్‌తో వెరైటీలు...

నాన్‌వెజ్‌లో చాలా మంది మటన్ అంటే ఎంతో ఇష్టపడతారు. మటన్ లో అధికంగా ప్రొటీన్లుంటాయి. శరీరానికి అవసరమైన పోషక విలువలు కలిగిన మంచి పౌష్టికాహారంగా నిపుణులు సూచిస్తున్నారు. అయితే దీనిని మితంగా మాత్రమే తీసుకోవాలి. అధికమోతాదులో తీసుకోవటం వల్ల సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే మటన్‌తో గోంగూర మటన్, బెండకాయ మటన్, బిర్యానీ ఇలా అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. మటన్‌లో లివర్, గుండె, కాళ్లు, తలకాయ ఇలా వేరు వేరుగా వండుకుంటుంటారు. అయితే మటన్‌తో చేసుకునే కొన్ని వంటలు చూద్దాం...

బెండకాయ మటన్

కావాల్సిన పదార్థాలు : బెండకాయలు - అర కేజీ, మటన్ - అర కేజీ, నెయ్యి - రెండు చెంచాలు, జీలకర్ర - చెంచా, దాల్చినచెక్క - రెండు అంగుళాల ముక్క, నల్లయాలకులు - నాలుగు, మిరియాలు - పది, ఉల్లిపాయలు - రెండు, పచ్చిమిర్చి - నాలుగు, టొమాటోలు - రెండు, అల్లంవెల్లుల్లి పేస్టు - రెండు చెంచాలు, పసుపు - అర చెంచా, ధనియాలపొడి - రెండు చెంచాలు, నూనె - రెండు చెంచాలు, కారం - చెంచా, గరం మసాలా పొడి - చెంచా, కొత్తిమీర తురుము - నాలుగు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా

తయారుచేసే విధానం : బెండకాయలు కడిగి తొడిమలూ, చివర్లూ తీసేసి ఒకవైపున చీల్చినట్లుగా గాటు పెట్టాలి. ఓ బాణలిలో నూనె వేసి అరచెంచా జీలకర్ర వేసి వేగాక బెండకాయలు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. ప్రెషర్ కుక్కర్‌లో నెయ్యి వేసి కాగాక అర చెంచా జీలకర్ర, దాల్చినచెక్క, నల్ల యాలకులు, మిరియాలు, ఉల్లి ముక్కలు వేసి వేయించాలి. తర్వాత చీల్చిన పచ్చిమిర్చి, మటన్ ముక్కలు వేసి కలపాలి. ఇందులోనే అల్లంవెల్లుల్లి, ఉప్పు, పసుపు, ధనియాలపొడి వేసి కలపాలి. మంచినీళ్ల పోసి ఓ సారి కలిపి ఓ పది నిమిషాలు ఉడికించాలి. తర్వాత టొమాటో గుజ్జు, కారం, గరంమసాలా వేసి కలపాలి. ఇప్పుడు కొత్తిమీర తురుము, వేయించిన బెండకాయలు కూడా వేసి ఉప్పు సరిచూసి కుక్కర్ మూతపెట్టి ఓ విజిల్ రానివ్వాలి. మంట తగ్గించి సిమ్‌లో ఇరవై నిమిషాలపాటు ఉడికించి దించాలి.



పోషకాలు

మటన్‌లో బి1, బి2, బి3, బి9, బి12 విటమిన్లు ఉంటాయి. విటమిన్‌ఇ, కె, సహజ ఫ్యాట్స్, కొలెస్ట్రాల్, అమినోయాసిడ్స్, మాంగనీసు, కాల్షియం, జింక్, కాపర్, ఫాస్ఫరస్, సెలేనియం, పొటాషియం, సోడియం, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా6 ఫ్యాటీయాసిడ్స్ ఉంటాయి. మటన్‌లో ప్రొటీన్లు, న్యూట్రియంట్లు, బి12 బాగా ఉండడం వల్ల కొవ్వును కరిగించే సామర్థ్యం తోపాటు, ఎర్రరక్తకణాలు ఏర్పడటానికి, దెబ్బతిన్న కణాలు సరికావటానికి దోహదపడుతుంది. గర్భిణులు తమ డైట్‌లో మటన్‌ని కూడా తింటే పుట్టే బిడ్డలకు న్యూరల్ ట్యూబ్ వంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు. మటన్‌లో బీకాంప్లెక్స్, సెలినియం, కొలైన్ వంటివి క్యాన్సర్ బారిన పడకుండా దోహదపడతాయి. అధిక పొటాషియం, తక్కువ సోడియంలు ఉండడం వల్ల రక్తపోటు, స్ట్రోకు, మూత్రపిండాల సమస్యలు రాకుండా చూడవచ్చు. మటన్‌లో ఎక్కువగా ఉండే కాల్షియం ఎముకలకు, దంతాలకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. సొరియాసిస్, ఎగ్జిమా, వంటి చర్మ సమస్యలను తొలగిపోతాయి. చర్మం ఎంతో కాంతివంతంగా మారుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అధికంగా ఉన్న వారు మటన్ తినటం అంత శ్రేయస్కరం కాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ మరింత పెరగటంతోపాటు గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. ఇందులో అధికంగా ఉండే కొవ్వు పదార్థాలు షుగర్ లెవల్స్ పెరగటానికి కారణమౌతాయని పరిశోధనల్లో తేలింది. 40 సంవత్సరాలు పై బడిన వారు మటన్ అడపతడపా తప్ప అదేపనిగా మటన్ ను ఆహారంలో భాగం చేసుకోవటం మంచిదికాదు.

బిర్యాని

కావాల్సిన పదార్థాలు : బోన్‌లెస్ మటన్ - అర కేజీ, బాస్మతి బియ్యం - అర కేజీ, అల్లం వెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, ఉల్లిగడ్డ - ఒకటి, ధనియాల పొడి - రెండు చెంచాలు, గరం మసాలా - చెంచా, కారం - చెంచా, పచ్చిమిరపకాయలు - నాలుగు, లవంగాలు - ఐదు, దాల్చిన చెక్కలు - నాలుగు, కొత్తిమీర కట్ట - ఒకటి, నెయ్యి - రెండు చెంచాలు, పసుపు - చిటికెడు, ఉప్పు - తగినంత, నూనె - సరిపడా.

తయారుచేసే విధానం : ముందుగా బియ్యాన్ని కడిగి ఆరబెట్టుకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక ఉల్లిపాయ ముక్కలు, ఒక చెంచా అల్లంవెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, ఉప్పు, కారం, పసుపు వేసి బాగా వేగించాలి. తర్వాత మటన్ వేసి బాగా ఉడికించి దించేయాలి. తర్వాత మరో మందపాటి గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి ఒక టీ స్పూను అల్లంవెల్లుల్లి ముద్ద, పచ్చిమిరపకాయ ముక్కలు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి వేయించాలి. తర్వాత బియ్యం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలిపి వేయించాలి. ఓ ఐదు నిమిషాలు వేయించాక ఉడికించిన మటన్ వేసి మరో ఐదు నిమిషాలు వేయించాలి. బియ్యం కొలతకు సగం ఎక్కువగా నీళ్ల పోసుకుని ఉడికించి దించేయాలి. దించే ముందు కొత్తిమీర తురుము చల్లుకుని దించి, వేడివేడిగా వడ్డిస్తే సరి.



కొల్హాపురీ మటన్

కావాల్సిన పదార్థాలు : మటన్ - కేజీ, కారం - చెంచా, నూనె - కప్పు, టొమాటోలు - రెండు, ఉల్లిపాయలు - నాలుగు, కొత్తిమీర - కట్ట, అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు చెంచాలు, పసుపు - పావు చెంచా, ఉప్పు - తగినంత, నువ్వులు - రెండు చెంచాలు, యాలకులు - నాలుగు, కొబ్బరి - రెండు చెంచాలు, ఎండు కొబ్బరి తురుము - రెండు చెంచాలు, ధనియాల పొడి - చెంచా, జీలకర్రపొడి - చెంచా, మిరియాలు - ముప్పావు చెంచా, దాల్చినచెక్క - పెద్ద ముక్క, లవంగాలు - నాలుగైదు, గసగసాలు - చెంచా, నెయ్యి - రెండు చెంచా,

తయారుచేసే విధానం : మందపాటి కడాయిలో నూనె లేకుండా నువ్వులు, యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, గసగసాలు వేయించుకోవాలి. తర్వాత మెత్తగా పొడిచేసి పెట్టుకోవాలి. అలాగే టొమాటోలు, ఉల్లిపాయలు, కొత్తిమీరా, తాజా కొబ్బరి తురుము, ఎండు కొబ్బరి తురుము మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి అల్లంవెల్లుల్లి పేస్టు వేయించుకోవాలి. అందులో ముందుగా చేసుకున్న మసాలా పొడి వేయాలి. తర్వాత కొబ్బరి మిశ్రమం వేయాలి. పచ్చివాసన పోయాక మటన్ ముక్కలూ, తగినంత ఉప్పు వేసి మూతపెట్టేయాలి. మటన్ మెత్తగా ఉడికాక ధనియాలపొడి, జీలకర్రపొడి, కారం వేసి కలిపి దింపేస్తే సరిపోతుంది. ఇది బిర్యానీ, రొట్టెల్లోకి చాలా బాగుంటుంది.



ఇవి కారణాలు కావొచ్చు...



మహిళల రుతుచక్రం వారి ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఆరోగ్యం సరిగా ఉంటే, రుతుచక్రం క్రమంతప్పకుండా వస్తుంది. ఇందులో మార్పులు చోటుచేసుకుంటున్నాయి అంటే వారి ఆరోగ్యంలో, జీవనశైలిలో మార్పులు చోటు చేసుకున్నాయని అర్థం. క్రమరహిత రుతుస్రావం రెండు సందర్భాలలో మాత్రమే ఉంటుంది. ఒకటి రుతుక్రమం ప్రారంభం కాగానే, రెండోది రుతుక్రమం ఆగిపోయే సమయంలోనే. కానీ స్త్రీ శరీరం అనేక మార్పులకు అనుగుణంగా, రుతుచక్రంలో మార్పులు ఉండవచ్చు. ప్రతి నెలా 28 రోజులకు ఒకసారి రుతుక్రమం జరగాలి. 21 నుండి 35 రోజుల మధ్య కాలం ఆరోగ్యకరమైనది. ఈ వ్యవధిలో రుతుక్రమం జరగకపోతే దానిని క్రమరహిత రుతుస్రావం అంటారు. అలాంటప్పుడు శరీరంలో ఏదో సమస్య ఉందని అర్థం చేసుకోవాలి. ఈ క్రమరహితానికి ఏమేమి కారణాలో తెలుసుకుందాం.

ఒత్తిడి : శారీరక లేదా మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు శరీరంలో ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఈ హార్మోన్లు అధికంగా ఉంటే, అది పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ కార్యకలాపాలు తాత్కాలికంగా ఆగిపోవచ్చు. దీని ద్వారా రుతుచక్రం ఆలస్యం కూడా అయ్యే అవకాశాలు ఉన్నాయి.

గర్భనిరోధక మాత్రలు : గర్భనిరోధక మాత్రల వల్ల రుతుక్రమం ఆలస్యం అయ్యే అవకాశాలు ఎక్కువే ఉన్నాయి. గర్భనిరోధక మాత్రలు శరీరంలో అండాల విడుదలను నిలిపివేస్తాయి. అండం విడుదల కాకపోతే రుతుక్రమం రాదు. ఈ అత్యవసర గర్భనిరోధక మాత్రలు రుతుస్రావం ఆలస్యం లేదా వాయిదా వేయవచ్చు. యాంటిడిప్రెసెంట్స్ కూడా రుతుస్రావం ఆలస్యం చేయవచ్చు. యాంటిసైకోటిక్స్, కార్టికోస్టెరాయిడ్స్, కీమోథెరపీ కూడా దీనికి కారణం అవ్వొచ్చు.

మధుమేహం : మధుమేహం లేదా పేగు సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులు రుతుచక్రాన్ని ప్రభావితం చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు మారినప్పుడు హార్మోన్ల మార్పులు జరుగుతాయి. ఇది చాలా అరుదు. కానీ మధుమేహం క్రమరహిత రుతుచక్రాలకు దారి తీస్తుంది.

అధిక బరువు : ఊబకాయం శరీరం హార్మోన్ల మార్పులకు కారణం అవుతుంది. దీని వల్ల కూడా రుతుస్రావం ఆలస్యం అయ్యే అవకాశాలు చాలా ఎక్కువ. ఇలాంటి సమయంలో వైద్యులు సూచించిన ఆహారం, వ్యాయామాలు పాటించాలి. అలా చేస్తేనే ప్రతినెలా సరైన సమయంలో పీరియడ్స్ వస్తాయి. అయితే కొందరికి కొన్ని ఆరోగ్య సమస్యలు ఉంటాయి. వారు తక్కువ శరీర బరువు కలిగి ఉంటారు. ఇది కూడా రుతుక్రమం ఆలస్యం లేదా కోల్పోయేందుకు కారణం అవుతుంది. అందుకే బరువును కూడా సరిగా మెయింటెన్ చేయాలి. పీరియడ్స్ సరిగా ఉంటే స్త్రీల ఆరోగ్యం బాగుంటటుంది.

థైరాయిడ్ : ఈ రోజుల్లో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సమస్య థైరాయిడ్. ఈ గ్రంథి శరీర జీవక్రియను నియంత్రిస్తుంది. శరీరం సరిగ్గా పనిచేయడానికి ఇది ఇతర శరీర వ్యవస్థతో సంబంధం కలిగి ఉంటుంది. ఈ థైరాయిడ్ అసమతుల్యత రుతు చక్రంలో మార్పులకు కారణం అయ్యే అవకాశం ఉంది.

పాలిచ్చే తల్లులు : పాలు తాగే పిల్లలు ఉన్న తల్లులకు కొంత కాలం వరకు పీరియడ్స్ రాకపోవచ్చు. తల్లి పాలను ఉత్పత్తి చేయడానికి కారణమయ్యే ప్రోలాక్టిన్ అనే హార్మోన్ కారణంగా ఇది జరుగుతుంటుంది. అందువల్ల పాలిచ్చే తల్లులకు పీరియడ్స్‌లో సమస్యలు ఉండవచ్చు.

అందువల్ల స్త్రీ తానున్న పరిస్థితిని బట్టి వైద్యుని సలహాలు సూచనలు పాటిస్తూ రుతుక్రమం క్రమంగా ఉండేలా చూసుకోవాలి.

న్యాయ కోవిదుడు ఫాలి నారిమన్ కన్నుమూత

(మొదటిపేజి తరువాయి)

హైకోర్టులో న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నారిమన్ 1961 నాటికి సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 1972లో ఆయన భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. అయితే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించడాన్ని వ్యతిరేకిస్తూ 1975లో పదవికి రాజీనామా చేశారు. 1999లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన నారిమన్ 2005 వరకూ ఆ పదవిలో కొనసాగారు. 1991 నుంచి 2010 వరకూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989 నుంచి 2005 వరకూ పారిస్‌లోని ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టుకు వైస్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. నారిమన్ అనేక న్యాయ శాస్త్ర గ్రంథాలు రచించారు. గాడ్ సేవ్ ది ఆనరబుల్ సుప్రీంకోర్టు, బిఫోర్ మెమరీ ఫేడ్స్, ది స్టేట్ ఆఫ్ ది నేషన్ వాటిలో కొన్ని. ఆయన కుమారుడు రోహింగ్టన్ నారిమన్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. కుమార్తె అనహీత.

మయన్మార్‌లోని రంగూన్‌లో 1929 జనవరి 10న ఫాలి నారిమన్ జన్మించారు. సిమ్లా, ముంబయిలో విద్యాభ్యాసం చేశారు. 1955లో బాప్సీని వివాహం చేసుకున్నారు. నారిమన్ అనేక ప్రతిష్టాత్మక కేసుల్లో వాదించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో యూనియన్ కార్బైడ్ తరపున వాదించారు. ఆ తర్వాత తప్పు తెలుసుకొని బాధితులు, కంపెనీ మధ్య నష్టపరిహారం విషయంలో ఒప్పందం కుదిరేలా చూశారు. ఆర్టికల్ 370పై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన తప్పుపట్టారు.

ప్రముఖుల సంతాపం

నారిమన్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన అత్యుత్తమ న్యాయవాదులు, మేధావుల్లో ఒకరని ప్రధాని మోడీ కొనియాడారు. సామాన్యులకు న్యాయం అందించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు. నారిమన్ మేథోసంపద అపారమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగం యొక్క పవిత్రతను కాపాడే విషయంలో అనేక మంది న్యాయ నిపుణులకు నారిమన్ స్ఫూర్తినిచ్చారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నారిమన్ మరణం న్యాయ వ్యవస్థకు తీరని లోటని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. నారిమన్ మరణంతో ఓ యుగం ముగిసిందని సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వ్యాఖ్యానించారు. దేశం గొప్ప న్యాయవాదిని కోల్పోయిందని సుప్రీంకోర్టుకే చెందిన మరో న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ చెప్పారు. సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, ప్రశాంత్ భూషణ్ తదితరులు నారిమన్ మృతికి సంతాపం తెలియజేశారు.

కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుంది

(మొదటిపేజి తరువాయి)



అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రంలో 80 లోక్‌సభ స్థానాలు ఉండగా ఇప్పటి వరకూ ఆ పార్టీ 31 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఒప్పందం కుదిరిందని, దీని ప్రకారం కాంగ్రెస్ పార్టీ 17-19 స్థానాల్లో పోటీ చేస్తుందని వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ పోటీ పడే స్థానాల్లో వారణాసి, రాయబరేలి, అమేథి, బారాబంకి, ఝాన్సీ, ఘజియాబాద్ ఉన్నాయి. కాగా రెండు పార్టీలు త్వరలోనే విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి పొత్తుపై ప్రకటన చేసే అవకాశం ఉంది. అఖిలేష్‌తో ప్రియాంక మాట్లాడారని, దీంతో రెండు పార్టీల మధ్య ప్రతిష్టంభన తొలగిపోయిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మొరాదాబాద్ సీటుపై తొలుత పట్టుబట్టిన కాంగ్రెస్ ఆ తర్వాత దానిని వదులుకొని సీతాపూర్ స్థానాన్ని కోరింది. వారణాసి స్థానానికి సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించగా ఆ స్థానాన్ని తనకు వదిలేయాలని కాంగ్రెస్ కోరుతోంది.

రైతులపై బుల్లెట్లు, టియర్ గ్యాస్ షెల్స్

(మొదటిపేజి తరువాయి)

రైతులు హైడ్రాలిక్ క్రేన్‌లు, జేసీబీలు, ప్రొక్లెయినర్స్ తదితర భారీ యంత్రాలను ఉపయోగించి ముందుకుసాగారు. దీంతో రైతులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో రైతులపై పోలీసులు రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఈ దాడిలో ఒక యువ రైతు మరణించగా, 25 మంది రైతులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు క్రిపాల్ సింగ్ తెలిపారు. పోలీసులు పలువురు రైతులను అరెస్టు చేసి హర్యానాకు తరలించారు. ఈ క్రమంలో రైతులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పలువురు రైతులు పొలాల గుండా సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసుల తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శాంతియుత ప్రదర్శనకూ అనుమతివ్వకపోవడంపై వారు మండిపడుతున్నారు. యువ రైతు మరణానికి ఏఐకేఎస్ సంతాపం తెలిపింది. పోలీసులు చర్యలను ఖండించింది. అలాగే సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కూడా పోలీసుల చర్యలను ఖండించింది.

చర్చలకు పిలుపు

ఇదిలావుండగా.. కేంద్ర ప్రభుత్వం రైతులను ఐదో విడత చర్చలకు ఆహ్వానించింది. రైతులతో చర్చలకు సిద్ధంగా ఉన్నామనీ, వారిని చర్చలకు ఆహ్వానిస్తున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. కనీస మద్దతు ధర, పంట మార్పిడి, వ్యర్థాల దహనంపై రైతులతో చర్చకు సిద్ధమని అన్నారు. గత ఆందోళనల సందర్భంగా రైతులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసే అంశంపై చర్చిస్తామని తెలిపారు.

దేశంలో శాంతి నెలకొనాలంటే చర్చలు చాలా ముఖ్యమన్నారు. కాగా, తమ డిమాండ్‌లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని రైతులు అంటున్నారు. పంటలకు కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జేసీబీ, ప్రొక్లెయినర్స్ యజమానులకు బెదిరింపులు

రైతులకు అద్దెకిచ్చిన జేసీబీ, ప్రొక్లెయినర్స్ యజమానులపై హర్యానా పోలీసులు బెదిరింపులకు దిగారు. రైతుల వద్ద నుంచి జేసీబీ, ప్రొక్లెయినర్స్ వెనక్కి తీసుకోవాలనీ, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆందోళన ప్రదేశాల నుంచి తమ జేసీబీలు, ప్రొక్లెయినర్స్, బుల్డోజర్లు ఖాళీ చేయించకపోతే సీజ్ చేస్తామని తెలిపారు.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందే : రైతులు

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పిస్తే రైతులు ఆందోళన విరమిస్తారని పంజాబ్ కిసాన్ మజ్దూర్ ప్రధాన కార్యదర్శి శర్వన్ సింగ్ పాంధర్ బుధవారం పునరుద్ఘాటించారు. రైతులందరూ ఢిల్లీ ఛలో ప్రదర్శనలో ముందుకుసాగరని, కేవలం రైతు నాయకులే దేశ రాజధానికి ప్రదర్శనగా తరలివస్తారని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీపై చట్టం తీసుకువస్తే ఈ ఆందోళన అంతా సమసిపోతుందని తేల్చిచెప్పారు. రైతుల సమస్యలపై శాంతియుతంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని దేశ యువతకు ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలపై చర్చలు జరపాలని, రైతుల ఛలో ఢిల్లీ ప్రదర్శన శాంతియుతంగా సాగేందుకు అనుమతించాలని అంతకుముందు ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో తాము అన్ని సమావేశాలకు హాజరై తమ డిమాండ్లు సహా అన్ని అంశాలు ప్రభుత్వం ముందుంచామన్నారు. ప్రధాని చొరవచూపి తమ డిమాండ్లు అంగీకరించాలని కోరారు. దేశ జనాభాలో 80 శాతం ఉన్న రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్డీయే ఎంపీలకు వ్యతిరేకంగా ఎస్‌కేఎం ఆందోళన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2020లో రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ-ఎన్డీయే ఎంపీలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఉత్తరప్రదేశ్, హిమాచల్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతులు పెద్దఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ ఎంపీల కార్యాలయాలు, నివాసాల ఎదుట ఆందోళనలు జరిగాయి. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంటలకు చట్టపరమైన మద్దతు ధర డిమాండ్‌పై రైతుల ఆందోళన తీవ్రతరమవుతున్న నేపథ్యంలో గురువారం ఢిల్లీలో జరగనున్న సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. అఖిల భారత ప్రాతిపదికన, సమస్యల ప్రాతిపదికన అన్ని రైతు సంఘాలు కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్‌కేఎం ప్రకటించింది. హర్యానా-పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై పోలీసుల దాడి, కనౌరిలో యువ రైతు హత్యపై ఎస్‌కేఎం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పోలీసు చర్యలను ఖండించింది.

మోడీ రామరాజ్యంలో దళితులపై వివక్ష

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించలేదు. దళితుడైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ కోవింద్‌ను లోపలకు అనుమతించలేదని రాహుల్ గుర్తు చేశారు. కులగణన జరగాలన్నదే తమ పార్టీ, మిత్రపక్షాల డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రగతికి అతిపెద్ద విప్లవాత్మక చర్య అదేనన్నారు. అటువంటి సర్వే వల్లనే వెనుకబడిన వర్గాల సంక్షేమం ఎలా వుందో తెలుస్తుందని అన్నారు.

మున్సిపల్ శాఖలో అకౌంట్స్ ఆఫీసర్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పలు ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాటిలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంటెంట్ పోస్టులకు సంబంధించి జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటించామని తెలిపారు.

మార్క్సిజం-లెనినిజం ప్రపంచానికి దారిదీపాలు

(మొదటిపేజి తరువాయి)

సాధించిన విజయాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ప్రాసంగికత ఉందన్నారు. దేశంలో పార్టీ పునాది చెదిరిపోతున్నదనీ, బలహీనపడుతున్నదని ఆవేదన చెందడం కంటే రష్యన్ పార్టీ చరిత్రను అధ్యయనం చేయడం మంచిదన్నారు. 1914లో రష్యాలో లెనిన్ కూడా ఒక దశలో ఒంటరివాడయ్యారని గుర్తు చేశారు. అయినా 1917 అక్టోబర్‌లో సోవియట్ యూనియన్ విప్లవాన్ని సాధించిందనీ, దానికి లెనిన్ నాయకత్వం వహించారని చెప్పారు. పార్టీ పునాది చెదిరినా, అననుకూల పరిస్థితులొచ్చినా ఆందోళన అవసరం లేదనీ, సోషలిజమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవం లేదంటూ లెనిన్ చెప్పారని గుర్తు చేశారు. నేడు దేశంలో మూడోసారి మోడీ అధికారంలోకి వస్తారన్న ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. అయితే దేశం ఏమవుతుందోనని ప్రజాస్వామ్యవాదుల్లో ఆందోళన ఉందన్నారు. దేశంలో మతశక్తులు గెలవకూడదన్నా, మతోన్మాదం పోవాలన్నా లెనిన్ రచించిన 'ఏం చేయాలి'అనే పుస్తకాన్ని చదవాలని సూచించారు. అది ఆచరణకు కరదీపిక అన్నారు. హిట్లర్ ఉన్న దేశంలో విప్లవం వచ్చిందనీ, ముసోలిని ఉన్న దేశంలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందని అన్నారు. మోడీకీ అదే పరిస్థితి దాపురిస్తుందన్నారు. 1899లో రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి గురించి లెనిన్ గ్రంథం రాశారని వివరించారు. ఆ తర్వాతే ఇతర సమస్యలనూ అధ్యయనం చేశారని చెప్పారు. భారతదేశంలోనూ పెట్టుబడిదారీ విధానంతోపాటు కులం, ఇతర సమస్యలపై పోరాటం చేసిన యోధుల గురించి అధ్యయనం చేయాలని సూచించారు. దేశంలో విప్లవం సాధించాలన్నా, సోషలిజం సాధించాలన్నా నిర్దిష్ట పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. దేశంలో మతోన్మాదం విజృంభిస్తున్నదని వివరించారు. అయితే శ్రామికులకు మరణానంతర సుఖాల కోసం వేచి ఉండాలని మతం చెప్తుందన్నారు. బతికున్నపుడే సుఖాలు కావాలని కొట్లాడాలంటూ లెనిన్ చెప్పారని గుర్తు చేశారు. కానీ పెట్టుబడిదారులు మాత్రం బతికుండగానే సుఖాలు అనుభవిస్తారనీ, శ్రమదోపిడీ చేసి లాభాలు పొందుతారని చెప్పారు. అందులో కొంత డబ్బుతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా ప్రజలకు సేవ చేస్తాయని వివరించారు. ప్రజాపోరాటాలు బలహీనంగా ఉన్నపుడు మతం చెప్పే దేవుడివైపే ప్రజలు ఆకర్షితులవుతారని అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల మీద పోరాడకుండా మతోన్మాదాన్ని తిప్పికొట్టలేమంటూ పార్టీ పలు సందర్భాల్లో చెప్పిందన్నారు. మతం మీద కాకుండా మతోన్మాదం మీద పోరాడాలని చెప్పారు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థపై పోరాటం చేయాలన్నారు. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా ఆయన రచనలను అధ్యయనం చేయాలని అన్నారు.

అధ్యయనం నిరంతరంగా ఉండాలి : బి వెంకట్

అధ్యయనం నిరంతరంగా ఉండాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ చెప్పారు. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాన్ని దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించాలని సూచించారు. కష్టాలు, బాధలు వచ్చినపుడు గొప్పవ్యక్తుల జీవిత చరిత్రలను చదివితే స్ఫూర్తిని పొందుతామని అన్నారు. లెనిన్, మార్క్స్, ఎంగెల్స్, మావో, స్టాలిన్, సుందరయ్య వంటి వారు వారి జీవిత భాగస్వాముల సహకారం లేకుంటే అంత గొప్ప వారు అయ్యేవారు కాదన్నారు. జెన్నీ మార్క్స్ లేకుంటే మార్క్స్ పెట్టుబడి గ్రంథం రాసేవారు కాదని చెప్పారు. కష్టకాలంలో పార్టీని ఎలా నడపాలో లెనిన్ చరిత్ర ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. బీజేపీ పాలనలో నిర్బంధాలు పెరుగుతున్నాయనీ, ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని చెప్పారు. సాహిత్యాన్ని, సిద్ధాంతాన్ని, అధ్యయనాన్ని పార్టీ శ్రేణులకు అందించాలని వివరించారు. కమ్యూనిస్టులు అంతర్జాతీయ తత్వాన్ని కోల్పోకూడదనీ, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని కోరారు. అధ్యక్షత వహించిన నవతెలంగాణ ప్రచురణాలయ సంపాదకులు కె ఆనందాచారి మాట్లాడుతూ లెనిన్ అంటే ఓ చైతన్యమని అన్నారు. ఆయన ఆలోచనలు, సైద్ధాంతిక విషయాలు ఇప్పటికీ ఆచరణీయమని చెప్పారు. మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించిన మహనీయుడు లెనిన్ అని వివరించారు.



ఒలింపిక్స్ ఆశలు ఆవిరి

ప్రి క్వార్టర్స్‌లో పురుషుల జట్టు కొరియా చేతిలో ఓటమి
ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

బుసాన్: పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ దక్కించుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో భారత పురుషుల టిటి జట్టు పరాజయాన్ని చవిచూసింది. ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో పురుషుల జట్టు 3-0తో కొరియా రిపబ్లిక్ చేతిలో ఓటమిపాలైంది. తొలి సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ 10-21, 11-13, 7-11తో జంగ్-వూజిన్ చేతిలో ఓటమిపాల వ్వగా.. రెండో సింగిల్స్‌లో శరత్ కమల్ 9-11, 5-11, 8-11, 4-11తో లిమ్ జొంగ్‌హూన్ చేతిలో ఓడారు. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లోనూ స్టార్ జి సాథియాన్ 5-11, 8-11, 2-11తో లీగ్-సంగ్-సు చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. అంతకుముందు జరిగిన రౌండ్-32 తొలి సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ 11-5, 11-1, 11-6తో తిమోర్తీ ఛాయ్, రెండో సింగిల్స్‌లో జ్ఞానశేఖరన్ సాథియాన్ 11-3, 11-7, 11-6తో ఆల్‌ఫ్రెడ్ డెలా పెనా, మూడో సింగిల్స్‌లో మనుష్ 11-4, 11-8, 11-6తో మ్యాక్స్‌వెల్‌ను ఓడించాడు.

భారత మహిళా, పురుషుల జట్లు ప్రవేశించాయి. పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత టిటి జట్లు బుధవారం జరిగిన నాకౌట్ పోటీల్లో విజయం సాధించాయి. రౌండ్-32 నాకౌట్ పోటీలో మహిళల జట్టు 3-0తో ఇటలీని, పురుషుల జట్టు కూడా 3-0తోనూ న్యూజిలాండ్‌ను చిత్తుచేశాయి. మహిళల బృందం తొలి సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి ఆకుల శ్రీజ 12-10, 11-6, 11-7తో కేవలం 20 నిమిషాల్లోనే నికోలెటా స్టెఫనోవాను చిత్తుచేసింది. రెండో సింగిల్స్‌లో మనిక బత్రా విజయం సాధించి భారత్ ఆధిక్యతను 2-0కు చేర్చింది. మనిక ఆ మ్యాచ్‌ను 12-10, 11-6, 11-5తో కేవలం 23 నిమిషాల్లోనే ముగించింది.

తొలి రెండు మ్యాచుల్లో నెగ్గిన భారత్... ఇటలీపై 2-0 ఆధిక్యతను సాధించింది. మూడో సింగిల్స్‌లో అహిక ముఖర్జీ 15-13, 11-9, 13-15, 11-8తో మౌన్‌ఫర్దినిని చిత్తుచేయడంతో భారత్ 3-0తో మ్యాచ్‌ను ముగించింది. 17వ ర్యాంకర్‌గా బరిలోకి మహిళల జట్టు ప్రి క్వార్టర్స్‌లో 4వ సీడ్ చైనీస్ తైపీతో తలపడనుంది. ప్రి క్వార్టర్స్‌లో భారత మహిళలజట్టు చైనీస్ తైపీని చిత్తుచేస్తే పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కినట్లే. ఇక పురుషుల జట్టు రౌండ్-32లో కజకిస్తాన్‌తో తలపడనుంది.

మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలనం
యూరోపియన్ జట్టుపై తొలి విజయం



అంకారా(టర్కీ): భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలనం నమోదు చేసింది. చరిత్రలో తొలిసారి ఓ యూరోపియన్ జట్టుపై విజయం సాధించింది. టర్కిస్ మహిళల టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4-3గోల్స్ తేడాతో ఎస్టోనియాపై విజయం సాధించింది. భారత్ తరఫున మనీషా కళ్యాణ్ రెండు గోల్స్ చేయగా.. ఇందుమనతి, కతిరేసన్ ఒక్కో గోల్ కొట్టారు. మనీషా 17వ ని.లో బెలారస్ గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లి గోల్ చేయడంతో భారత్‌కు 1-0 ఆధిక్యత సాధించింది. ఆ తర్వాత 32వ ని.లో మరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత ఇందుమతి(62వ), మనీషా (79వ ని)లో ఒక్కో గోల్ కొట్టగా.. ప్యారీ క్సాక్సా(79వ ని.)లో ఒక గోల్ చేయడంతో భారత్ 4-1గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. 88వ ని.లో వ్లాడా కుబస్సోవా, 90వ ని.లో లియిస్ లిల్లేమే ఒక్కో గోల్ చేయడంలో భారత్ ఆధిక్యత 4-3గోల్స్‌కు తగ్గింది. చివర్లో భారత డిఫెండర్లు అడ్డుగోడలా నిలవడంతో భారత్‌కు యూరోపియన్ జట్టుపై తొలి విజయం ఖాయమైంది. ఇంతకుముందు భారత మహిళలజట్టు యూరోపియన్ జట్లయిన బెలారస్, ఉక్రెయిన్, రొమేనియాలతో తలపడినా ఆ మ్యాచుల్లో పరాజయాన్ని చవిచూసింది.

యుఎఇ హెడ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్



ముంబయి: భారత మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యుఎఇ పురుషుల క్రికెట్‌జట్టు హెడ్ కోచ్‌గా ఎన్నికయ్యారు. యుఎఇ హెడ్‌కోచ్‌గా రాజ్‌పుత్ మూడేళ్లు కొనసాగనున్నారు. 1980వ దశకంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన 62ఏళ్ల రాజ్‌పుత్.. 2016-17లో ఆఫ్ఘనిస్తాన్‌కు కోచ్‌గా పనిచేసిన అనుభవముంది. ఐసిసి క్రికెట్ వరల్డ్‌కప్ లీగ్-2, వన్డే ట్రై సిరీస్‌లతో పాల్గొనే యుఎఇ జట్టుతో కలిసి రాజ్‌పుత్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. ట్రై సిరీస్‌లో యుఎఇ జట్టుతోపాటు స్కాట్లాండ్, కెనడా జట్లు ఆడనుండగా.. ఈ టోర్నమెంట్‌కు యుఎఇ ఆతిథ్యమిస్తోంది. ఫిబ్రవరి 28నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. 2018-19లో జింబాబ్వే జట్టుకు రాజ్‌పుత్ కోచ్‌గా ఉన్నప్పుడు పురుషుల జట్టు 2022 టి20 ప్రపంచకప్‌కు అర్హత సాధించింది.

జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్
ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ద్విశతకాలతో చెలరేగుతున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్.. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా టెస్ట్ బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకున్నాడు. వైజాగ్, రాజ్‌కోట్ టెస్టుల్లో డబుల్ సెంచరీలతో మెరిసిన జైస్వాల్.. టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 14వ స్థానాలు మెరుగుపరుచుకొని 15వ ర్యాంకుకు చేరుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టుకు ముందు 29వ ర్యాంకులో ఉన్నాడు. జైస్వాల్ 699 పాయింట్లతో ఈ ర్యాంకుకు చేరాడు. కాగా ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి విరాట్ కోహ్లీ ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. కోహ్లీ 752 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా సారథి రోహిత్ శర్మ ఒక స్థానం ఎగబాకి 12వ ర్యాంకులో ఉన్నాడు. ఈ జాబితాలో కేన్ విలియమ్సన్(న్యూజిలాండ్) అగ్రస్థానంలో ఉన్నాడు. టెస్టు బౌలర్ల జాబితాలో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రిత్ బుమ్రా.. అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా రాజ్‌కోట్ టెస్టులో 500వ వికెట్ తీసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో స్థానానికి చేరాడు. రవీంద్ర జడేజా 3 స్థానాలు ఎగబాకి 6వ ర్యాంకుకు చేరాడు.



స్పెయిన్ రైతాంగం ఆందోళన

మాడ్రిడ్‌కు వందలాదిగా ట్రాక్టర్లతో ప్రదర్శన

మాడ్రిడ్ : మితిమీరిన అధికార యంత్రాగం ఆంక్షలు, ఏ మాత్రమూ సరిపోని ప్రభుత్వ సాయం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ స్పెయిన్ రైతాంగం ఆందోళన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే స్పెయిన్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్ళేందుకు బుధవారం స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కు వందలాదిగా ట్రాక్టర్లతో రైతులు వచ్చారు. యురోపియన్ దేశాల్లో రైతాంగం వారాల తరబడి ఆందోళనలు సాగిస్తోంది. ఇటీవలే పోలెండ్, గ్రీస్, చెక్ రిపబ్లిక్‌ల్లో రైతు నిరసనలు జరిగాయి. యురోపియన్ యూనియన్ ఉమ్మడి వ్యవసాయ విధానంతో ముడిపడిన అధికార ఆంక్షలు, జాప్యందారీ విధానాలను తగ్గించాలని వారు కోరుతున్నారు. పైగా యురోపియన్ యూనియన్ పర్యావరణ నిబంధనలను కూడా సడలించాలని రైతులు కోరుతున్నారు. మాడ్రిడ్‌లోని సెంట్రల్ ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్దకు చేరేందుకు ఐదు వరుసల్లో ట్రాక్టర్లు క్యూలు కట్టాయి. పసుపు రంగు దుస్తులు ధరించిన ఆందోళనకారులు స్పానిష్ పతాకాలు చేబూని, ఆవు గంటలను మోగించారు. ఆ ప్రాంతంలో వీధులన్నీ ఆందోళనకారులతో నిండిపోయాయి. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

మాడ్రిడ్‌లోకి రాకుండా ట్రాక్టర్లను పోలీసులు అడ్డగించారంటూ కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారు. 500 ట్రాక్టర్లను మాత్రమే అనుమతించామని ప్రభుత్వం తెలిపింది. ఆందోళన చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతి కోరినపుడు నిర్వాహకులు 500 వాహనాలే చెప్పారని, అందుకే అంతవరకే తాము అనుమతి మంజూరు చేశామని పోలీసులు చెప్పారు. మరో 150 వాహనాలను నగరంలోకి రాకుండా అడ్డుకున్నారు. వ్యవసాయ రంగానికి సాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులకు ప్రోత్సాహక ధరలు కావాలని ద్రాక్ష రైతు లూసియా రిసెనో డిమాండ్ చేశారు. గతంలో ఎంత ఖర్చు పెట్టానో ఇప్పుడూ అంతే పెడుతున్నా అందులో సగం మొత్తం కూడా ఇప్పుడు రావడంల లేదని ఆమె వాపోయారు. ఈ తరహా పరిస్థితిని ఇలా కొనసాగించలేమన్నారు. రైతులకు సాయం చేసేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకునేవరకు ఈ నిరసనలు, ఆందోళనలు కొనసాగుతునే వుంటాయని ఆమె స్పష్టం చేశారు. స్పానిష్ రైతాంగం రక్షణవాదాన్ని కోరుకుంటోందని, తమ ఉత్పత్తులను కాపాడుకుంటూ, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడేలా చేయాలనుకుంటున్నామని అడాల్ఫో అనే మరో రైతు చెప్పారు.

తమిళనాడు పట్ల ఆర్థిక వివక్ష

- కేంద్రంపై కమల్‌హాసన్ విమర్శలు



చెన్నై : తమిళనాడు పట్ల కేంద్రం ఆర్థిక వివక్షను చూపిస్తోందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ బుధవారం విమర్శించారు. కమల్ హాసన్ ఏర్పాటు చేసిన మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎం) పార్టీ తమిళనాడులో డిఎంకె నేతృత్వంలో ఇండియా బ్లాక్‌లో చేరబోతోందని ఊహాగానాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ విమర్శలు వెలువడ్డాయి. కేంద్రంలోని బిజెపి ఏర్పాటు చేసిన పన్ను ఆదాయాల పంపిణీ వ్యవస్థ ఉత్తర భారతంలోని రాష్ట్రాలకు అనుకూలంగా వుంటూ తమిళనాడు పట్ల వివక్షను ప్రదర్శిస్తోందని ఆయన విమర్శించారు.

పార్టీ ఏడవ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం చెన్నైలో పార్టీ ప్రధాన కార్యాలయం వెలుపల కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఇండియా బ్లాక్‌లో చేరుతున్నారా అని ప్రశ్నించగా, పార్టీ రాజకీయాలను వదిలిపెట్టి దేశం గురించి ఆలోచించాల్సిన సమయమిదని వ్యాఖ్యానించారు. దేశం గురించి ఎవరైనా నిస్వార్ధంగా ఆలోచిస్తే వారితో తాము జత కలుస్తామని చెప్పారు. అలా కాకుండా స్థానిక, ఫ్యూడల్ రాజకీయాలకు పాల్పడితే తాము అందులో భాగస్వాములం కాబోమని చెప్పారు.

'కేంద్రానికి ఆర్థికంగా దోహదపడుతున్న రాష్ట్రాల జాబితా చూస్తే టాప్ 3లో తమిళనాడు వుంటుంది. కానీ మేం ఇచ్చే ప్రతి రూపాయికి మాకు కేవలం 29 పైసలు మాత్రమే వస్తోంది. అదే యుపి, ఎంపి, బీహార్ వంటి రాష్ట్రాలకు నాలుగు రూపాయిలు వస్తోంది. ఆ రాష్ట్రాల ప్రజలు అభివృద్ధి చెందనివ్వండి, కానీ మా వాటాలోంచి తీసుకోరాదు. మొత్తంగా సమానత్వం వుండాలి.' అని కమల్ పేర్కొన్నారు.

తమిళనాడు ప్రభుత్వం, రైతులకిచ్చే దాంట్లో కనీసం 10శాతం కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. రైతులంటేనే శత్రువులుగా చూస్తున్నారని అన్నారు. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం రైతులను గౌరవంతో చూస్తోందంటూ పొగడ్తల్లో ముంచెత్తారు.



మంచి కంటెంట్ ఉన్న సినిమా - వరుణ్‌తేజ్

'ఈ నగరానికి ఏమైంది, మీకు మాత్రమే చెబుతా, సేవ్ టైగర్' చిత్రాల్లో కమెడియన్‌గా పాపులారిటీ సంపాందించుకుని, తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్న నటుడు అభినవ్ గోమఠం. అయితే తాజాగా 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంలో ఆయన పాపులర్ డైలాగ్ అయిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా..' టైటిల్‌తోనే అభినవ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతుంది. వైశాలి రాజ్ హీరోయిన్. కాసుల క్రియేటివ్ వర్క్స్ పతాకపంపై తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 23న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. మంగళవారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది.

ఈ వేడుకకు హీరో వరుణ్‌తేజ్ ముఖ్య అతిథిగా హాజరై బిగ్‌టికెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'అభినవ్ తొలిసారిగా లీడ్ రోల్ చేస్తున్నాడు. విభిన్న పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. ఈచిత్రంతో అభినవ్‌కు మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమాలా అనిపిస్తుంది. టీమ్ అంతా కాన్ఫిడెంట్‌గా ఉంది. అభినవ్‌లో నటన పరంగా మంచి షేడ్స్ ఉన్నాయి. చిత్రంలో అన్ని భావోద్వేగాలు ఉన్నాయని తెలిసింది. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో స్పెషల్. ఇందులో నటించడం లక్కీగా ఫీలవతున్నాను. ఈ కథ నచ్చి ఈ సినిమా చేశాను. నా సినిమా కంటెంట్ చూడండి. మీకు నచ్చితే సినిమా చూడండి. తప్పకుండా అందరి అభిమానంతో సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని అనుకుంటున్నాను' అని అభినవ్ గోమఠం చెప్పారు. దర్శకుడు తిరుపతి రావు మాట్లాడుతూ,'అందరి సహకారంతో సినిమాని సక్సెస్‌ఫుల్‌గా పూర్తిచేశాం. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన భవాని కాసుల మాట్లాడుతూ,'సినిమా బాగా వచ్చింది. సినిమాలోని ప్రతి పాత్ర అందరికీ రిలేట్‌గా ఉంటుంది. ఈ సినిమాకు అన్ని సమపాళ్లలో కుదిరాయి. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఉన్నాయి' అని తెలిపారు. ఈ వేడుకలో నిర్మాతలు ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వితో పాటు అలీ రైజా, రాధామోహన్, కార్తికేయ, మెహిన్, సంజీవ్, లావణ్య, సిద్దార్థ్ స్వయంభూ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

నయా సస్పెన్స్ థ్రిల్లర్



వేదిక

'కాంచన 3, రూలర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ వేదిక. ఆమె లీడ్ రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ "ఫియర్". దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి, సామ సురేందర్ రెడ్డి కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. దర్శకురాలు హరిత గోగినేని ఈ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు.

బుధవారం హీరోయిన్ వేదిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విషెస్ చెబుతూ మూవీ టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది.

ఈ పోస్టర్‌లో వేదిక బ్యూటిఫుల్ మేకోవర్‌లో కనిపించి అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో వేదిక క్యారెక్టర్ కొత్తగా ఉంటూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది. ఆమె కెరీర్‌లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందని చిత్రబృందం చెబుతున్నారు.

ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నారు.

జెపి (జయప్రకాష్), పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజి షిండే, సత్య కృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ - అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ - ఐ ఆండ్రూ, ఎడిటింగ్ - గ్యారీ బీ హెచ్, లిరిక్స్ - కృష్ణ కాంత్, కొరియోగ్రఫీ - విశాల్, నిర్మాత - ఏఆర్ అభి, కో ప్రొడ్యూసర్స్ - సుజాత రెడ్డి, సామ సురేందర్ రెడ్డి, రచన, దర్శకత్వం - హరిత గోగినేని.

నవచిత్రం

పది భాషల్లో కంగువ



సూర్య

హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ'. ఈ సినిమాను భారీ నిర్మాణ విలువలతో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొంది స్తున్నారు. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో బాబీ డియోల్ కీ రోల్ ప్లే చేస్తున్నారు. తాజాగా 'కంగువ' సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్స్ స్టార్ట్ చేశారు హీరో సూర్య. డబ్బింగ్ వర్క్స్ జరుగుతున్న అద్నాన్ ఆర్ట్స్ స్టూడియోస్‌లో హీరో సూర్యతో డైరెక్టర్ శివ, ఇతర టెక్నీషియన్స్ పాల్గొన్నారు. పాన్ వరల్డ్ మూవీగా మొత్తం పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ'లో వరల్డ్ క్లాస్ మేకింగ్, సూర్య పర్ఫార్మెన్స్ హైలైట్ కానుంది. హీరో సూర్య కెరీర్‌లో హై బడ్జెట్ మూవీగా రూపొందుతున్న ఇది ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద ఒక స్పెషల్ ఫిల్మ్ కాబోతోంది.

త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించనున్నారు. త్రీడీలోనూ 'కంగువ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఎడిటర్ - నిశాద్ యూసుఫ్, సినిమాటోగ్రఫీ - వెట్రి పళనిస్వామి, యాక్షన్- సుప్రీమ్ సుందర్, డైలాగ్స్- మదన్ కార్కే, కథ - శివ, ఆది నారాయణ, పాటలు - వివేక్, మదన్ కార్కే, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - ఏ జే రాజా, కో ప్రొడ్యూసర్ - నేహా జ్ఞానవేల్ రాజా, ప్రొడ్యూసర్స్ - కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం - శివ.


యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణు గోపాల్ నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. మార్చి 22న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'నలుగురు స్నేహితుల కథ ఇది. వారి స్నేహం, ప్రేమ, లైఫ్ జర్నీ ఈ చిత్రంలో చూపిస్తున్నాం. నేటి యువతరాన్ని అమితంగా ఆకట్టుకునే ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో కుటుంబ ప్రేక్షకులను అలరించే భావోద్వేగాలు కూడా ఉన్నాయి. అభిరుచి గల నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌తో కలిసి సృజన్ కుమార్ బొజ్జం ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. తప్పకుండా ఈ చిత్రం యూత్‌కు ఓ ఫెస్ట్‌లా ఉంటుంది' అని అన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ మామిడి, అసోసియేట్ ప్రొడ్యూసర్: నాగార్జున వడ్డె, డీఓపీ: సంతోష్ రెడ్డి, సంగీతం: హర్ష వర్ధన్ రామేశ్వర్, ఆర్ ఆర్ ధ్రువన్, వసంత్.జి, పాటలు: క్రిష్ణ కాంత్, కాసర్ల శ్యామ్, రఘురామ్, ఎడిటర్: విజయ్ వర్ధన్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: విక్రమ్ రెడ్డి.

14 డేస్ లవ్ రిలీజ్‌కి రెడీ



చాందిని భాగవని, మనోజ్ పుట్టూర్

సుప్రియ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై హరిబాబు దాసరి నిర్మాతగా, అఖిల్ అండ్ నిఖిల్ సమర్పణలో నాగరాజు బోడెం దర్శకత్వంలో నిర్మించిన యూత్ ఫుల్, కుటుంబ కథా చిత్రం '14 డేస్ లవ్'. అత్యధిక థియేటర్లలో విడుదల అవుతున్న ఈ చిత్రంలో మనోజ్ పుట్టూర్, చాందిని భాగవని హీరో హీరోయిన్లుగా నటించారు. రాజా రవీంద్ర, సనా సునూర్ కీలక పాత్రలు పోషించగా, అంజలి, ఐడ్రీమ్ రాజా శ్రీధర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్ని పోషించారు.

కుటుంబ విలువల్ని కాపాడే ప్రయత్నంలో ఆ ఇంటి వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏంటి?, వారి మధ్య చిగురించిన ప్రేమకు ఎలాంటి ముగింపు దొరికింది అనే కోణంలో దర్శకుడు నాగరాజు బోడెం అత్యంత ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంప్రదాయ విలువలున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 23న విడుదల అవుతుంది.ఈ చిత్రానికి మాటలు: గౌరీశ్వర్, శివప్రసాద్ సామల, కెమెరా: కన్నన్ మునస్వామి, సంగీతం: కిరణ్ వెన్న, బ్యాక్ గ్రౌండ్ స్కోర్: యస్.కె. బాజి, సాహిత్యం: గిరిపట్ల, ఎడిటర్: యస్.యస్.వి.సుంకర, కో ప్రొడ్యూసర్స్: వేణు, లైన్ ప్రొడ్యూసర్స్: రాజేష్ కుమార్ దాసరి, వినీత్ ప్రకాష్ దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చంద్రకళ దాసరి.

దిష్టి బొమ్మ చుట్టూ తిరిగే కథ



స్నేహాల్, శశిధర్

శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ సినిమాకి పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మార్చి 1న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో నిర్మాతలు స్నేహాల్, శశిధర్ మీడియాతో మాట్లాడుతూ, '2014లో షీష్‌మహల్ అనే ఇండిపెండెంట్ సినిమా చేశాం. 2020లో 'నీతో' అనే సినిమా చేశాం. 2022లో 'భూతద్ధం భాస్కర్ నారాయణ' కథ విన్నాం. స్క్రిప్ట్ అద్భుతంగా అనిపించింది. సినిమాని ఎక్కడా రాజీపడకుండా మంచి క్యాలిటీతో నిర్మించాం. అవుట్ పుట్ బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్, పాటలు చాలా మంచి బజ్‌ని క్రియేట్ చేయడం ఆనందంగా ఉంది. ఇదొక డిటెక్టివ్ థ్రిల్లర్. దర్శకుడు ఈ కథని చాలా కొత్తగా తీశారు. డిటెక్టివ్ కథని పురాణాలతో ముడిపెట్టిన విధానం ప్రేక్షకులకు చాలా థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇందులో ఇన్వెస్టిగేషన్ చాలా ఆసక్తిగా ఉంటుంది. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుందనే నమ్మకం ఉంది. డిటెక్టివ్ పాత్రలో శివ కందుకూరి అద్భుతంగా చేశారు. ఇందులో డిటెక్టివ్ రోల్ రెగ్యులర్‌కి భిన్నంగా ఉంటుంది. శివ కందుకూరి ఈ పాత్రకు యాప్ట్. చాలా సహజంగా ఆ పాత్రలో ఒదిగిపోయారు. అలాగే హీరోయిన్ రాశి సింగ్ కూడా చాలా హార్డ్ వర్క్ చేసింది. బిజినెస్ పరంగా చాలా హ్యాపీగా ఉన్నాం. ఓవర్సీస్, ఓటీటీ బిజినెస్ క్లోజ్ అయ్యింది. పురుషోత్తం రాజ్ మంచి విజన్ ఉన్న దర్శకుడు. చాలా మంచి కథతో వచ్చారు. ఇందులో కథే హీరో. ఇప్పటివరకూ ఇలాంటి కథని చూసి ఉండరు. ప్రతి ఇంటిముందు దిష్టి బొమ్మ వుంటుంది. దాని వెనుక ఉన్న కథ ఏమిటి?, దీనికి ఒక ఫాంటసీ ఎలిమెంట్‌ని జోడించి ఈ కథని చాలా అద్భుతంగా తీశారు. శ్రీచరణ్ మంచి సంగీతం అందించారు. ఆయన అందించిన బిజీఎం మామూలుగా వుండదు. బీజీఎంని ప్రేక్షకులకు చాలా ఎంజాయ్ చేస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ సినిమాని నిర్మించినందుకు గర్వంగా ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

దుర్గం చెరువు రక్షణకు చర్యలు తీసుకోండి

• రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని దుర్గం చెరువు రక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆక్రమణలను తొలగించి, మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని న్యాయస్థానం పిల్‌గా పరిగణించి విచారించింది. ఈ క్రమంలో హైకోర్టు గతంలో ఏర్పాటు చేసిన కమిటీ రిపోర్టును బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ పరిశీలించింది. చెరువు రక్షణకు కమిటీ చేసిన సిఫార్సులను రెండు దశల్లో అమలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించింది. రిపోర్టులను చిత్తశుద్ధితో అమలు చేయాలని, లేదంటే అధికారులను కోర్టుకు పిలిపించి విచారిస్తామని హెచ్చరించింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 29కి వాయిదా వేసింది.



పార్క్ స్థలం ఆక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూటి ప్రశ్న

ఆదిలాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో పిల్లల క్రీడల కోసం నిర్దేశించిన పార్కు స్థలం ఆక్రమణలకు గురికాకుండా తీసుకున్న చర్యలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అన్యాక్రాంతం కావడానికి సహకరించిన అప్పటి మున్సిపల్ కమిషనర్ శైలజను ప్రతివాదిగా చేర్చాలని కోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కోరుతూ 23 మంది పిల్లలు హైకోర్టుకు లేఖ రాశారు.దీనిని సుమోటగా స్వీకరించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 1970లో ఆదిలాబాద్‌లో బడుగు వర్గాల సంక్షేమం కోసం హౌసింగ్ బోర్డు కాలనీ ఏర్పాటైంది. అందులో 15 ఎకరాలను పిల్లల పార్కు నిమిత్తం కేటాయించారు. ఆభూమిలో 30 గంటల స్థలాన్ని 2004 సమయంలో కొందరు ఆక్రమించుకోగా, ఇటీవల మిగిలిన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

ఆక్రమణదారులకు మున్సిపల్ కమిషనర్ శైలజ సలహాలు ఇస్తున్నారని కూడా వాళ్లు ఆరోపించారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. మున్సిపల్ కమిషనర్ శైలజపై ఆరోపణలున్న కారణంగా ఆమెను కూడా ప్రతివాదిగా చేర్చాలని నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ శైలజ ప్రస్తుతం ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ గా లేరని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 7వ తేదీకి వాయిదా వేసింది.

అద్దె చెల్లించనప్పుడు హక్కులుండవు: హైకోర్టు

హైదరాబాద్, నాంపల్లిలోని చేనేత భవన్‌లో వ్యాపారాలు చేసుకుంటూ అద్దె బకాయిలు చెల్లించలేని వారిని అక్కడ కొనసాగించాలన్న మహిళా పారిశ్రామికవేత్తల సంఘ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. తమను బలవంతంగా షాపుల ఖాళీ చేయించారనీ, తిరిగి తమకు చేనేత భవనాన్ని అప్పగించాలని సంఘం చేసిన అప్పీల్ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.ఇదే వ్యాజ్యాన్ని గతంలో సింగిల్ జడ్జి కొట్టివేశారు. దీనిపై సంఘం చేసిన అప్పీల్‌ను మంగళవారం ధర్మాసనం కొట్టివేసింది. నాంపల్లిలోని 9200 చదరపు అడుగుల స్థలాన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి మహిళా పారిశ్రామికవేత్తల సంఘం 2011 నుంచి 2014వరకు అద్దెకు తీసుకుంది.

అద్దె ఒప్పందం గడువు అయ్యాక కూడా ఒప్పందం రెన్యువల్ చేసుకోకుండా అద్దె చెల్లిస్తూ కొనసాగింది. తర్వాత అద్దె చెల్లించకపోవడంతో రూ.50 లక్షల వరకు బకాయిలు చెల్లించాలంటూ 2022 అక్టోబర్‌లో రాష్ట్ర చేనేత సముదాయ సహకార సంఘం నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత బలవంతంగా మహిళా పారిశ్రామికవేత్తల సంఘాన్ని ఖాళీ చేయించింది. విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒప్పందం రద్దు తర్వాత కూడా పిటిషనర్ కొనసాగుతూ, లక్షల్లో అద్దె బకాయిలు ఉన్నారని తెలిపింది. ఈ పరిస్థితుల్లో వారికి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చి అద్దె చెల్లించని వారికి రక్షణగా ఉండలేమని కోర్టు తేల్చి చెప్పింది.

బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటాం

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

• అగ్ని ప్రమాద గుడిసె వాసులకు భరోసా
• శాశ్వత గృహ వసతి కల్పిస్తామని హామీ



నవతెలంగాణ- కరీంనగర్

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ ఆదర్శనగర్‌లో మంగళవారం అగ్ని ప్రమాదంలో దాదాపు 21 పూరి గుడిసెలు దగ్ధమైన విషయం విదితమే. బుధవారం ఉదయం ఘటన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. వారికి శాశ్వత గృహవసతి కల్పిస్తామని చెప్పారు. రాజీవ్ స్వగృహతో పాటు వేరేచోట వారు నివాసం ఉండేలా చూస్తామని తెలిపారు.

ప్రజాపాలనలో భాగంగా నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటు న్నామని, ఇందులో అగ్ని ప్రమాద బాధితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. పూరి గుడిసెలతో పాటు ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. జిల్లాలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో జిల్లాలో పర్యటించనున్నారని, ఈ మేరకు అన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. మంత్రి వెంట కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసు, స్థానిక కార్పొరేటర్ మేచినేని అశోక్‌రావు, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, అధికారులు ఉన్నారు.

ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ విచారణ

పొంతనలేని నివేదికలు

• సుప్రీంకోర్టుకు నివేదికను అందజేయండి : కేంద్ర పర్యావరణ శాఖకు ఎన్జీటీ ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీ మండిపడింది. ఏపీలో అక్రమ మైనింగ్‌పై ఎన్జీటీలో సామాజిక కార్యకర్త దండా నాగేంద్ర పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిటిషన్‌పై విచారించి ఏపీలో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని గతంలో ఎన్జీటీ ఆదేశించింది. ఏపీలో అక్రమ మైనింగ్‌పై బుధవారం ఎన్జీటీకి కేంద్ర అటవీ, పర్యావరణ అటవీ శాఖ కమిటీ నివేదిక ఇచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా ఏపీలో ఇంకా భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు నివేదికలో కేంద్ర కమిటీ నిర్ధారించింది. ఫొటోలతో పాటు ఇతర సాక్ష్యాధారాలతో నివేదికను కేంద్ర కమిటీ ఎన్జీటీకి అందజేసింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఎలాంటి అనుమతులు లేకుండా 24 గంటలూ తవ్వకాలు చేపడుతున్నారని, ఒక్కో రీచ్ లో రోజుకు రెండు వేల టన్నుల మేర తవ్వకాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ద్వారా తవ్వకాల ఆధారాలు సేకరించామని వివరించింది. ఎలాంటి ఈసీలు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని తెలిపింది. గతంలో ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు అమలు కావట్లేదని పేర్కొంది.

కంద్ర కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని కేంద్ర పర్యావరణ అటవీశాఖకు ఎన్జీటీ ఆదేశాలను జారీ చేసింది. ఈ అంశంలో కలెక్టర్ల నివేదిక, కేంద్ర మంత్రిత్వ శాఖ నివేదిక పూర్తి భిన్నంగా ఉన్నాయని పేర్కొంది. సుప్రీంకోర్టులో కూడా ఈ కేసు విచారణ జరుగుతోందని, ఏం చేయాలనేది న్యాయస్థానమే తేలుస్తుందని స్పష్టం చేసింది. నివేదికను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేస్తామని తెలిపింది. గతంలో ఇసుక అక్రమాలపై జేపీ పవర్ వెంచర్‌కి రూ.18 కోట్లు తాత్కాలికంగా ఎన్జీటీ జరిమానా విధించింది. మొత్తం ఎన్ని రీచ్‌లలో అక్రమ మైనింగ్ జరుగుతుందో తేల్చాలని కమిటీని కూడా నియమించింది. అక్రమాలు జరిగినట్లు నివేదికలో వెల్లడైతే ప్రతి రీచ్‌కి రూ. కోటి చొప్పున జరిమానా చెల్లించాలని కూడా ఎన్జీటీ ఆదేశించింది.

ఏపీలో 40 రీచ్‌లలో మ్యానువల్ మైనింగ్‌కి ఈసీ అనుమతులుంటే 500లకు పైగా రీచ్‌లలో ఈసీ అనుమతులు లేకుండా యంత్రాలతో ఇసుక మైనింగ్ చేస్తున్నట్లు కేంద్ర కమిటీ నివేదికలో బట్టబయలు చేసింది. కేంద్ర కమిటీ నివేదిక ప్రకారం జేపీ పవర్ వెంచర్ కంపెనీ రూ.500 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎన్జీటీ అభిప్రాయపడింది. గతంలో ఎన్జీటీ ఆదేశాలను జేపీ పవర్ వెంచర్స్ సుప్రీంలో సవాలు చేసింది. ఎన్జీటీ విధించిన జరిమానాను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు షరతులు విధించింది. మైనింగ్‌ను వెంటనే నిలిపివేయడమే కాకుండా అసలు ఎంతమేరకు అక్రమ మైనింగ్ జరిగిందో కేంద్ర కమిటీ ద్వారా నిగ్గు తేల్చాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతవరకూ ఎన్జీటీ విధించిన జరిమానాపై తాత్కాలికంగా సుప్రీంకోర్టు స్టే విధించింది.

గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను సుప్రీంలో సవాలు చేసినందున ఇసుక మైనింగ్ అక్రమాలపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని నేడు ఎన్జీటీ ఆదేశించింది. తమ ఆదేశాలను కూడా ఏపీ ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని కేంద్ర కమిటీ నివేదిక ద్వారా స్పష్టమవుతోందని తెలిపింది. సుప్రీం కోర్టే ఏపీలో జరుగుతున్న అక్రమ ఇసుక మైనింగ్‌పై తుది నిర్ణయం తీసుకుంటుందని కేసును సుప్రీంకు ఎన్జీటీ రిఫర్ చేసింది. వచ్చే వారం సుప్రీంకోర్టులో ఏపీ అక్రమ ఇసుక తవ్వకాలపై విచారణ జరిగే అవకాశం ఉంది.

సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో పేలుడు..

• చెలరేగిన మంటలు • భారీ ప్రమాదమే తప్పింది : ఎమ్మెల్యే హరీశ్ రావు




నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో ఒక్కసారిగా భారీగా పేలుడు, మంటలు చెలరేగాయి. దాంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియక స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద నున్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా పీటీఆర్ పేలి మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న స్థానికులు పేలుడు దాటికి బయటకు వచ్చారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘటనాస్థలానికి బయలు దేరారు. దారిలోనే..ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ ఫైర్ స్టేషన్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే హరీశ్‌రావు.. మూడు ఫైర్ ఇంజన్లు ఏర్పాటుచేసి మంటను ఆర్పాలని కోరారు. మంటలు ఆపే వరకు విద్యుత్ అధికారులను, ఫైర్ సిబ్బందిని కి సూచనలు ఇస్తూ, పర్యవేక్షించారు. సుమారు మూడు గంటలు కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాత్రి 7.30 గంటల సమయంలో విషయం తెలవగానే ఘటనా స్థలానికి చేరుకున్నట్టు తెలిపారు. 220 కేవీ సబ్ స్టేషన్ పరిసరాల్లోనే 132 కేవీ సబ్ స్టేషన్, ఇతర సబ్ స్టేషన్లు ఉన్నాయని, కానీ భారీ ప్రమాదం తప్పిందని అన్నారు.

సంఘటనను చూసి ఆందోళనకు గురయ్యానని, ఫైర్ సిబ్బంది, విద్యుత్ అధికారుల సమిష్టి కృషి ఫలితంగా మంటలు అదుపులోకి వచ్చినట్టు చెప్పారు. ఘటనపై విచారణ జరిపించాలని అధికారులను కోరారు. విద్యుత్ సరఫరా లేని ప్రాంతాలకు .. దుద్దెడ, జక్కాపూర్, హబ్సిపూర్, పాలమకుల 132 కేవీ సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. కాగా, ఘటనాస్థలంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసి, సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అక్రమం, రాజకీయ దురుద్దేశపూరితం

• అసాంజె అప్పగింత ప్రయత్నాలపై లండన్ హైకోర్టులో లీగల్ టీమ్ వాదనలు



లండన్ : వికీలీక్స్ వ్యవస్థాపకుడు, జర్నలిస్ట్ జూలియన్ అసాంజెను అమెరికాకు అప్పగించడానికి జరుగుతున్న యత్నాలు అక్రమమని, రాజకీయ దురుద్దేశంతో కూడినవని లండన్ హైకోర్టులో విచారణ సందర్భంగా అసాంజె తరపు లీగల్ టీమ్ వ్యాఖ్యానించింది. ఈ కేసులో తుది విచారణ మంగళవారం ఆరంభమైంది. అయితే ఆరోగ్యం సహకరించకపోవడంతో అసాంజె కోర్టుకు హాజరు కాలేకపోయారు. కనీసం వీడియో లింక్ ద్వారా కూడా పాల్గొనలేకపోయారు. ఆయన ఆరోగ్యంపై సన్నిహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసాంజెను అమెరికాకు అప్పగించడానికి అధికారికంగా ఆమోదించిన బ్రిటన్ మాజీ హోం మంత్రి ప్రీతి పటేల్ అమెరికాలో ఆయనకు మరణశిక్ష విధించబోరని హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని అసాంజె తరపున న్యాయస్థానంలో లీగల్ టీమ్ లీడర్ ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ వాదించారు. బ్రిటన్, అమెరికా మధ్య వున్న ఖైదీల అప్పగింత ఒప్పందం నిబంధనల మేరకు రాజకీయ కారణాలతో అప్పగింత అవకాశాలను ఆయన తోసిపుచ్చారు. శతాబ్దాల తరబడి అమల్లో వున్న చట్టపరమైన రక్షణలపైనే ఈ అప్పగింత ఆధారపడి వుందన్నారు. తనను అప్పగించవద్దంటూ అసాంజె పెట్టుకున్న పిటిషన్‌పై లండన్‌లోని రాయల్ కోర్ట్స్ ఆఫ్ జస్టిస్‌లో రెండు రోజుల విచారణ మంగళవారం ఆరంభమైంది. ఈ పిటిషన్‌పై విచారణలో ఆయనకు అనుకూలంగా తీర్పు రాకపోతే అమెరికాలో గూఢచర్యం చట్టం కింద అసాంజె 17 అభియోగాలను, కంప్యూటర్ హ్యాకింగ్ అభియోగాన్ని ఎదుర్కొనాల్సి వుంటుంది. 175ఏళ్ళ పాటు జైలు శిక్ష విధించే అవకాశాలు కూడా వున్నాయి. ఈ వారంలో విచారణ పూర్తయితే ఈ ఏడాది చివరిలో పూర్తి స్థాయి అప్పీల్‌పై విచారణ జరుగుతుంది.

ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా అనిల్ కుమార్

• ఉత్తర్వులు జారీ చేసిన నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా (జనరల్) జి. అనిల్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పని చేసిన మురళీధర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యుల్ని చేస్తూ ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. అయితే ఆయన స్థానంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ఈ పదవి కోసం పలువురు ప్రయత్నించినప్పటికి ప్రభుత్వం అనిల్ కుమార్ వైపు మొగ్గు చూపింది. అలాగే బి.నాగేంద్ర రావును ఈఎన్‌సీ(ఆపరేషన్, మెయింటనెన్స్) గా, కెఎస్ఎస్. చంద్రశేఖర్‌ను సీఈ(కాడా)గా నియమించింది.

న్యాయవాది నారిమన్ మృతి పట్ల సీఎం సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ న్యాయనిపుణుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి ఎస్ నారిమన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. న్యాయవాదిగా ఎన్నో సంక్లిష్టమైన కేసులను వాదించిన ఆయన దేశంలోనే పేరు సంపాదించారని కొనియాడారు. నారామన్ మరణం దేశ న్యాయ వ్యవస్థకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

• ఎస్ఐ సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం కారు చెట్టును ఢీకొట్టడంతో ఎస్ఐ సహా ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ప్యాపిలి ఎస్ఐ వెంకటరమణ(57) కుమార్తె అనూష వివాహం హైదరాబాద్‌కు చెందిన పవన్‌సాయి(25)తో ఫిబ్రవరి 15న అనంతపురంలో జరిగింది. హైదరాబాద్‌లోని పవన్ ఇంటి నుంచి బుధవారం సాయంత్రం అనంతపురం వెళ్తుండగా కారు అదుపు తప్పి అన్నాసాగర్ గ్రామ పరిధిలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. దీంతో వెంకటరమణ, పవన్‌సాయి, డ్రైవర్ చంద్ర(23) అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటరమణ కుమార్తె అనూషకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పెండ్లైన వారం రోజులకే మామాఅల్లుళ్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలి

• ఏపీలో 28 బీసీ కులాలను కేంద్ర ఓబీసీలోకి చేర్చాలి :ఎన్సీబీసీ చైర్మెన్ హన్సరాజ్‌కు ఎంపీ ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో మాదిరిగా దేశ వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని నేషనల్ బీసీ కమిషన్ (ఎన్సీబీసీ)ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ .కృష్ణయ్య కోరారు. ఈ నిర్ణయంతో పేద, బడుగు బలహీన వర్గాలు ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడుతుందన్నారు. బుధవారం ఢిల్లీలో ఎన్సీబీసీ చైర్మెన్ హన్సరాజ్ గంగారాం ఆహీర్‌ను ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఏపీలో 28 బీసీ కులాలను కేంద్ర ఓబీసీలోకి చేర్చాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి, వెనకబడిన వర్గాల ఆర్థిక, విద్య ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాంత్రిక వినియోగం పెరగడం, పరిశ్రమల రాకతో కులవృత్తులు, చేతివృత్తులు దెబ్బతిన్నాయన్నారు. దీంతో ఈ కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారు ఆకలి చావులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వెనకబడిన వర్గాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేలా... ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాజీవ్ ఫెలో షిప్ స్కీం కింద అర్హులైన పీహెచ్‌డీ స్కాలర్స్‌కు స్టైఫండ్ మంజూరు చేయాలని, గురుకుల పాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా తమ విజ్ఞప్తులపై ఎన్సీబీసీ చైర్మెన్ సానుకూలంగా స్పందించారని, తమ డిమాండ్లను కేంద్రానికి పంపిస్తానని హన్సరాజ్ హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య వెల్లడించారు.

పాట్నాలో ఘోర ప్రమాదం..8 మంది మృతి



పాట్నా (బీహార్) : బీహార్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లఖిసరాయ్ పట్టణం సమీపంలోని ఝూల్నా గ్రామం వద్ద ఈరోజు తెల్లవారుజామున ఆటోరిక్షాను లారీ ఢీకొట్టడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్నాలోని సర్దార్ హాస్పిటల్‌కు తరలించామన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోరిక్షాలో 14 మంది ఉన్నట్లు తెలిపారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధరణకు వచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిజినెస్

కోల్ ఇండియా రూ.16,500 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,500 కోట్ల పైగా పెట్టుబడుల వ్యయం చేయ నుందని బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా 80 శాతం వాటా కలిగి ఉంది. "2023-24కు గాను సిఐఎల్, ఎన్ఎల్‌సిఐఎల్ సంస్థలు మరోమారు తమ పెట్టుబడుల లక్ష్యం కంటే ఎక్కువగా వ్యయం చేస్తున్నాయి. రెండు సంస్థలు కూడా భారత వృద్ధిలో కీలక భాగస్వామ్యం అవుతున్నాయి." అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఎన్ఎల్‌సి ఇండియా రూ.2,880 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. కాగా మంత్రిత్వ శాఖ రూ.21,030 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని పెట్టుకుంది. గడిచిన కొన్ని ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వ బొగ్గు సంస్థలు అంచనాలు మించి పెట్టుబడులు చేస్తున్నాయి. 2021-22లో కోల్ ఇండియా, ఎన్ఎల్‌సిఐఎల్‌లు వరుసగా 104.88 శాతం, 123.33 శాతం చొప్పున పెట్టుబడుల లక్ష్యాన్ని చేరాయి. 2022-23లో ఇరు సంస్థలు 113 శాతం లక్ష్యాన్ని నమోదు చేశాయి.

జీలో రూ.2 వేల కోట్ల నిధుల మళ్లింపు..!

• సెబీ దర్యాప్తు • 14 శాతం పడిపోయిన షేర్ ధర



ముంబయి: జీ ఎంటర్‌టైన్‌మెంట్‌లో రూ.2,000 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందని రిపోర్టులు వస్తోన్నాయి. ఆ సంస్థ ఆర్థిక అవకతవకలను సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఇటీవల గుర్తించి విచారణ ప్రారంభించిందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్టులో పేర్కొంది. ఓ కేసులో భాగంగా జీ వ్యవస్థాపకులపై విచారణ జరుపుతున్న క్రమంలో కంపెనీ నుంచి రూ.2,000 కోట్లు (241 మిలియన్ డాలర్లు) అక్రమంగా తరలించినట్లు వెల్లడయ్యిందని సమాచారం. ఇది సెబీ తొలుత అంచనా వేసిన దాని కంటే 10 రెట్లు ఎక్కువని తెలుస్తోంది. ఈ అంశమై జీ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు పునీత్ గోయెంకా, బోర్డు సభ్యులను సెబీ వివరణ కోరినట్లు తెలుస్తోంది. దీనిపై జీ, సెబీ అధికారికంగా స్పందించాల్సి ఉంది. సుభాష్ చంద్ర, గోయెంకా తమ సొంత ప్రయోజనాల కోసం కంపెనీ నిధులను దారి మళ్లించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై సెబీ గతకొంతకాలంగా దర్యాప్తు జరుపుతోంది.

తాజాగా మరింత సమాచారం బయటికి రావడంతో బుధవారం బిఎస్ఇలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఏకంగా 14.77 శాతం పతనమై రూ.28.50కు పడిపోయింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కుదిరిన విలీన ఒప్పందాన్ని కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్) రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పంద విలువ రూ.83వేల కోట్లుగా ప్రకటించాయి. 2021 డిసెంబర్ 22న ఈ ఒప్పందం కోసం సంతకాలు చేసుకోగా.. ఇటీవల సోనీ పిక్చర్స్ ఈ డీల్ రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటిం చింది. కాగా.. దీన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ఇరు సంస్థలు చర్చలు జరుపుతున్నాయని వస్తోన్న వార్తలను తాజాగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఖండించింది.

లీడింగ్ బ్రాండ్‌గా కెనన్ కొనసాగింపు

న్యూఢిల్లీ : వరుసగా 21వ ఏడాదిలోనూ గ్లోబల్ కెమెరా మార్కెట్‌లో ముందంజలో ఉన్నట్లు కెనన్ పేర్కొంది. వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా వినూత్న ఉత్పత్తుల ఆవిష్కరణలు, ఆఫర్లు, ఫ్రెండ్లీ మోడల్స్, ప్రొఫెషనల్ పవర్ హౌసెస్ తదితర అంశాలు కెమెరా మార్కెట్‌లో రాణించడానికి, తమ విజయానికి ప్రధాన కారణమని ఆ సంస్థ పేర్కొంది. తమ నూతన ఇఒఎస్ సీరిస్ ఉత్పత్తులు స్పీడ్, కంఫర్ట్, అధిక నాణ్యతను కలిగి ఉన్నాయని పేర్కొంది.

Canon
Delighting You Always

భారత్‌లో 250 మంది ఉద్యోగులపై నోకియా వేటు



న్యూఢిల్లీ : నోకియా కంపెనీ భారత్‌లో 250 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుంది. సంస్థ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలు, పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిపై వేటు వేయాలని నిర్ణయించింది. నోకియా 5జీ టెక్నాలజీ పట్ల భారత్‌లో డిమాండ్ తగ్గడంతో కంపెనీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని సమాచారం. నోకియా టెక్నాలజీపై గతంలో భారీగా వెచ్చించిన కొన్ని బడా దేశీ కంపెనీలు ప్రస్తుతం దీనిపై ఇది వరకు స్థాయిలో ఖర్చు చేసేందుకు మొగ్గు చూపకపోవడంతో సిబ్బందిని తగ్గించుకోవాలని చూస్తోందని తెలుస్తోంది.

కేర్ హాస్పిటల్స్ చీఫ్ సేల్స్ ఆఫీసర్‌గా షాలాబ్ దంగ్



హైదరాబాద్ : కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్‌గా షాలాబ్ దంగ్ నియమితులయ్యారు. వివిధ రంగాల్లో ఆయనకు రెండున్నర దశాబ్దాల అనుభవం ఉందని ఆ సంస్థ తెలిపింది. కేర్ హాస్పిటల్స్‌లో చేరక ముందు ఆయన ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌లో ఇంటర్నేషనల్ హెడ్‌గా పని చేశారని పేర్కొంది.

గృహ రుణాల్లో పటిష్ట వృద్ధి

• హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడి

ముంబయి : ప్రయివేటు రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గృహ రుణాల జారీలో మెరుగైన వృద్ధిని కనబర్చుతున్నట్లు తెలిపింది. హెచ్‌డిఎఫ్‌సి విలీనం తర్వాత మరింత పటిష్ట పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. 2023 డిసెంబర్‌తో ముగిసిన చివరి రెండు త్రైమాసికాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు పేర్కొంది. రెండు సంస్థల విలీనం తర్వాత గృహ రుణాల మార్కెట్‌లో 18 శాతం నుంచి 20 శాతం వాటాకు పెరిగినట్లు తెలిపింది. 2050 నాటికి దేశంలో 90 కోట్ల నివాసాల అవసరం ఉండొచ్చని అంచనా వేసింది. గృహ రుణాలకు డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,740	▲	180
22 క్యారెట్లు	- 57,600	▲	250
కిలో వెండి	- 77,200	▲	200



చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	135
రిటైల్ (లైవ్)	రూ.	157
స్కిన్‌తో	రూ.	228
స్కిన్‌లెస్	రూ.	259